


# ఈనాడు





కరీంనగర్ 28-8-2019 బుధవారం సిటీ సంపుటి 46 సంచిక 19

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50. పేజీలు 14+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi


**హైదరాబాద్‌లోని అలిజాపూర్‌లో...**



గంజాయి కొనేందుకు వెళ్తున్న యువకుడు... ఓ ఇంట్లో యువతి నుంచి ఇలా కొనుగోలు

# రాజధానిలో గంజాయ్

- నగరం నడిబొడ్డున యథేచ్ఛగా విక్రయాలు
- మత్తుకు బానిసలవుతున్న యువత

రాజధాని నగరంలో యువతపై గంజాయి పంజా విసురుతోంది. కాలేజీ విద్యార్థులను ప్రధాన లక్ష్యంగా చేసుకుంటోంది. యువతులూ బానిసలుగా మారుతున్నారు. గంజాయి పొడిని సిగరెట్లలో దట్టించి దమ్ మారో దమ్.. అంటున్నారు. కొందరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లూ సై అంటున్నారు. గతంలో పరిమిత ప్రాంతాల్లోనే కొనసాగే విక్రయాలు హైదరాబాద్ నగరం నుంచి శివారు ప్రాంతాల్లోని గల్లీలకు విస్తరిస్తున్నాయి. పట్టపగలే యథేచ్ఛగా విక్రయాలు సాగుతున్నాయి. 'ఈనాడు-ఈటీవీ' ప్రతినిధులు విద్యార్థుల్లా వెళ్లి ఈ విషయాన్ని బట్టబయలు చేశారు. మచ్చుకు గోల్కొండ పోలీస్ ఠాణా పరిధిని పరిశోధనకు ఎంచుకున్నారు. అక్కడ డెక్కన్ పార్క్ నుంచి లక్ష్మీనగర్ వరకూ ఐదారుచోట్ల ఇళ్లు, కిరాణా దుకాణాలు గంజాయి విక్రయ కేంద్రాలుగా కనిపించాయి.

**అడ్డాలివీ...** నగరంలోని సీతాఫల్ మండి, ధూల్‌పేటలు గంజాయికి ప్రధాన అడ్డాలు. సీతాఫల్‌మండిలో ఉపరితల వంతెన కింద, హనుమాన్ ఆలయం పక్కన, ధూల్‌పేట పరిసరాల్లోని టక్కర్‌వాడి, జుమ్మేరాత్‌బజార్లలో అమ్ముతున్నారని సమాచారం. అక్కడి నుంచి ఇంజినీరింగ్ విద్యార్థుల వసతిగృహాలు, అద్దెగదులు ఎక్కువగా ఉన్న దిల్‌సుఖ్‌నగర్‌కి సరఫరా చేస్తున్నారు.

...పూర్తి వివరాలు 6లో

**పరిశోధన సాగింది ఇలా..**

ప్రాంతం: అలిజాపూర్...
సమయం: మధ్యాహ్నం 3 గంటలు

అలిజాపూర్ ప్రాంతంలో భారీగా గంజాయి విక్రయాలు సాగుతున్నాయన్న సమాచారంతో 'ఈనాడు-ఈటీవీ' ప్రతినిధులు మధ్యాహ్నం 3 గంటల సమయానికి విద్యార్థుల్లా అక్కడకు వెళ్లారు. బంజారా దర్వాజా నుంచి అలిజాపూర్ వరకూ ఉన్న మార్గంలో ఏడెనిమిది చోట్ల అమ్ముతున్నారు. అప్పుడే అక్కడికి రెండు ద్విచక్ర వాహనాల్లో నలుగురు విద్యార్థులు వచ్చారు. ఆ సమయంలో ఓ యువతి ఇంటి బయట కూర్చుని ఉంది. వారు సంకేతం ఇవ్వగానే ఇంట్లోకి వెళ్లింది. ప్యాకెట్లు తెచ్చి వారి చేతిలో పెట్టి డబ్బులు తీసుకుంది. పొట్లాలను తెచ్చుకుంటూ వారు 'ఈనాడు-ఈటీవీ' ప్రతినిధులను చూశారు. సాటి విద్యార్థులే అనుకున్నారు. సరకు తెచ్చుకోడానికి బిడియ పడుతున్నట్టు భావించారో ఏమో 'మీరు కూడా పుడీ(పొట్లం) కోసం వచ్చారా?' అని అడిగారు. భరోసా ఇస్తున్నట్టుగా 'ఏం కాదు వెళ్లండి' అన్నారు. ప్యాకెట్ ఎంత.. అంటే 'వందకు 20 గ్రాములు ఇస్తారు' అని జవాబిచ్చారు.

**సౌ రూపాయ్‌కా పుడీ దేవ్‌జీ....**

విద్యార్థులు చెప్పిన ప్రకారమే నడుచుకుంటూ 'ఈనాడు-ఈటీవీ' ప్రతినిధులు ఆ ఇంటికి చేరుకున్నారు.

'సౌ రూపాయ్‌కా పుడీ దేవ్‌జీ' అన్నారు. మరో మాట లేకుండా ఇంట్లోకి వెళ్లిన ఆ యువతి సరకుతో బయటకొచ్చింది.



# పొద్దూ మాపూ ఓపీ

**విజృంభిస్తున్న జ్వరాలకు విరుగుడు చర్యలు**

- సర్కారు దవాఖానాల్లో సాయంత్రమూ వైద్య సేవలు
- ఆదివారం సహా ఇతర సెలవు దినాలకూ వర్తింపు
- డాక్టర్లు, ఇతర సిబ్బంది సెలవుల రద్దు
- జ్వరాలు తగ్గుముఖం పట్టే వరకూ ఆరోగ్య అప్రమత్తత
- వైద్య ఆరోగ్య శాఖ కీలక ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: సర్కారు దవాఖానాల్లో ఇకనుంచి పొద్దూ మాపూ ఓపీ సేవలు అందనున్నాయి. రాష్ట్రంలో విషజ్వరాలు విజృంభిస్తుండటంతో.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాయంత్రం వేళల్లోనూ ఓపీ సేవలు నిర్వహించాలని వైద్యఆరోగ్యశాఖ నిర్ణయించింది. కొద్దిరోజులుగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా సహా వైరల్ జ్వరాలు పెద్దఎత్తున నమోదవుతున్నాయి. దీంతో ఆరోగ్యశాఖ అప్రమత్తత ప్రకటించింది. కోఠిలోని ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ కార్యాలయంలో వైద్యఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి శాంతికుమారి మంగళవారం అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ డాక్టర్ యోగితారాణా, వైద్య విద్య సంచాలకులు డాక్టర్ రమేశ్‌రెడ్డి, ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ జి.శ్రీనివాసరావు, వైద్య విధాన పరిషత్ ఉన్నతాధికారి డాక్టర్ అశోక్, రాష్ట్ర వైద్యసేవలు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీ చంద్రశేఖరరెడ్డి, ఐపీఎం సంచాలకులు డాక్టర్ శంకర్, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు, ఇతర వైద్యశాఖ అధికారులు హాజరయ్యారు. ...మిగతా 2లో



**బంగారు మురిపెం**

ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో సాధించిన స్వర్ణ పతకాన్ని దిల్లీలో మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీకి చూపుతూ మురిసిపోతున్న పి.వి.సింధు ...వివరాలు ఛాంపియన్‌లో

# ఆర్థిక క్రమశిక్షణ పాటించండి

- నిధుల వ్యయంపై ప్రత్యేక దృష్టి అవసరం
- మంత్రులు, కార్యదర్శులతో బడ్జెట్‌కు ముందే సీఎం భేటీ
- సభ నిర్వహణకు సెప్టెంబరు 4, 9, 14 తేదీల పరిశీలన
- రెండో రోజూ బడ్జెట్‌పై ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్ష



ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ప్రభుత్వ శాఖలు ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదేశించారు. దేశవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం నేపథ్యంలో రాష్ట్ర బడ్జెట్ రూపకల్పన, నిధుల వినియోగం సహా అన్ని దశల్లోనూ నిధుల వ్యయంలో ప్రణాళిక, ఆర్థిక క్రమశిక్షణ అవసరమని స్పష్టం చేశారు. ...మిగతా 2లో

**మంత్రివర్గ విస్తరణపై సీఎం దృష్టి** 2లో

## జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక ప్యాకేజీ!

తుది మెరుగులు దిద్దుతున్న మోదీ సర్కారు

కేంద్ర చట్టాలు, పథకాల అమలు కోసమే 14లో






## సర్కారు కొలువుపై హైదరాబాద్ యువత మోజు

అత్యధిక దరఖాస్తుల్లో భాగ్యనగరానిదే అగ్రస్థానం

దరఖాస్తుదారుల్లో అమ్మాయిలు 46 శాతం

2లో

## రెవెన్యూ చట్టంపై ముమ్మర కసరత్తు

ముసాయిదాపై కలెక్టర్లతో సుదీర్ఘ కార్యశాల

హన్మకొండలో అన్ని జిల్లాల పాలనాధికారులతో సమావేశమైన సోమేశ్‌కుమార్

2లో

## ఇదీ సంగతి!




మనం తొలగించిన అధికారులంతా కలిసి కన్సల్టెన్సీ పెట్టుకున్నారు సార్... డిపార్టుమెంటులో ఏయే అధికారి ఎంతెంత తిని పనిచేస్తాడనేది క్లైంట్లకు చెబుతున్నారు.




# మంత్రివర్గ విస్తరణపై సీఎం దృష్టి

- ఒకటి లేదా రెండు విడతలుగా చేపట్టే అవకాశం
- మొదటి దఫా దసరా లోపు..
- సంక్రాంతి వరకు రెండో సారి విస్తరణ

ఈనాడు - హైదరాబాద్

శాసనసభ్యుల కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికలు ముగియడంతో ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రమంత్రివర్గ విస్తరణపై దృష్టి సారించారు. ఒకటి లేదా రెండు దఫాల్లో దసరా నాటికి దీనిని చేపట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం. మొదటి దఫా దసరా లోపు కాగా.. రెండో విడత సంక్రాంతి నాటికి చేపట్టవచ్చని తెలిసింది. వచ్చే నెలలో శాసనసభ బడ్జెట్ సమావేశాలున్నాయి. వినాయక చవితి ఉత్సవాలు, ఆ తర్వాత బతుకమ్మ పండుగ ఉన్నాయి. ఇవన్నీ ముగిసిన తర్వాత కొత్త మంత్రులు వస్తారనే భావన తెరాస వర్గాల్లో ఉంది. ముహూర్తాలు బాగుంటే, ఇతర పరిణామాలేమైనా ఉంటే దసరా కంటే ముందే మంత్రివర్గ విస్తరణ జరుగుతుంది. మంత్రివర్గంలో ప్రస్తుతం సీఎంతో కలిసి 12 మంది ఉన్నారు. మరో ఆరుగురికి అవకాశం ఉంది. వివిధ సమీకరణాలపరంగా వారిని తీసుకోవాలని సీఎం భావిస్తున్నారు. తొలివిడతలో ముగ్గురిని, రెండో విడతలో మరో ముగ్గురిని తీసుకుంటారనే ప్రచారం జరుగుతోంది.

- మంత్రివర్గంలోకి తీసుకుంటామని గతంలో గుత్తా సుఖేందర్‌రెడ్డికి హామీ ఇచ్చారు. దీనికి అనుగుణంగా ఆయనకు ఎమ్మెల్సీ స్థానం కట్టబెట్టారు. మంత్రిగా కూడా ఆయనకు అనుకూల వాతావరణం ఉంది.
- తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు కూడా స్థానం ఖాయంగా కనిపిస్తోంది.
- మిగిలిన నాలుగు స్థానాల్లో ఒక బీసీని తీసుకునే వీలుంది. బీసీ కోటాలో ముఖ్య సామాజిక వర్గానికి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు పోటీలో ఉన్నారు. దానం నాగేందర్, బాజిరెడ్డి గోవర్ధన్, వినయ్‌భాస్కర్, జోగు రామన్న, గంగుల కమలాకర్, నన్నపనేని నరేందర్‌లు పోటీలో ఉన్నారు.
- మహిళా కోటాలో ఇద్దరికి అవకాశమిస్తామని సీఎం చెప్పారు. ఈ ప్రకారం ఎమ్మెల్సీ సత్యవతి రాఠోడ్ లేదా ఎమ్మెల్యే హరిప్రియనాయక్, సబితారెడ్డిల పేర్లు పరిశీలించే వీలుంది. ప్రస్తుతం మంత్రివర్గంలో మహిళ, గిరిజన కోటా అభ్యర్థుల్లేరు. సత్యవతి లేదా హరిప్రియను తీసుకుంటే ఈ కోటా భర్తీ అయ్యే వీలుంది.
- మాజీ మంత్రి హరీశ్‌రావుకు స్థానంపై ఉత్కంఠ నెలకొంది. సానుకూలతలను పరిగణనలోకి తీసుకుంటే ఆయనను తీసుకునే ఆస్కారం ఉంది.
- రాష్ట్రంలో మరో బలమైన సామాజికవర్గం నుంచి ఖమ్మం, హైదరాబాద్‌లలో ముగ్గురు ఎమ్మెల్యేలు పువ్వాడ అజయ్‌కుమార్, మాగంటి గోపీనాథ్, అరికెపూడి గాంధీలు ఉన్నారు. వీరికి కూడా చోటు ఇవ్వాలనుకుంటే ఒకరిని తీసుకునే అవకాశం ఉంది.
- గిరిజన కోటాలోనే ఎమ్మెల్యే రేగ కాంతారావు పేరు కూడా ప్రచారంలో ఉంది.

## ఆర్థిక క్రమశిక్షణ పాటించండి

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టే ముందే రాష్ట్ర మంత్రులు ఆయా శాఖల కార్యదర్శులతో ప్రత్యేకంగా సమావేశం కావాలని ఆయన నిర్ణయించారు. ఈ ప్రత్యేక సమావేశంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని, ఆర్థిక క్రమశిక్షణ పాటించే నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సీఎం స్పష్టంగా వివరించనున్నారు. పూర్తి స్థాయి రాష్ట్ర బడ్జెట్‌ను ఆమోదించేందుకు సెప్టెంబరు 4, 9 లేదా 14 తేదీల్లో ఏదో ఒకరోజు శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ముఖ్యమంత్రి మంగళవారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్, ప్రభుత్వముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు సహా అధికారులతో పూర్తి స్థాయి బడ్జెట్, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. పూర్తి స్థాయి బడ్జెట్‌ను సెప్టెంబరు 30లోపు ఆమోదించాల్సిన నేపథ్యంలో గత రెండు రోజులుగా ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో చర్చించిన అంశాలపై ముఖ్యమంత్రి కార్యాలయం మంగళవారం విడుదల చేసిన ప్రకటన వివరాలిలా ఉన్నాయి.

- సెప్టెంబరు 24 నుంచి దక్షిణాఫ్రికాలో జరగనున్న స్పీకర్లు, శాసనసభ కార్యదర్శుల సమావేశంలో తెలంగాణ స్పీకర్ పాల్గొననున్న నేపథ్యంలో బడ్జెట్ సమావేశాలను అంతకంటే ముందే పూర్తి చేయాలి.
- వినాయకచవితి, గణేశ నిమజ్జనం, మొహర్రం, సెలవుల నేపథ్యంలో పోలీసు సిబ్బంది లభ్యత, ప్రభుత్వ కార్యక్రమాలు, సెలవులను పరిగణనలోకి తీసుకుని సెప్టెంబరు 4, 9 లేదా 14 తేదీల్లో శాసనసభ సమావేశాలు ప్రారంభించుకోవచ్చని శాసనసభ కార్యదర్శి ప్రతిపాదించారు.
- ఫిబ్రవరిలో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించినందున.. ఈసారి జరిగే శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం ఉండదు.
- బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత రోజు సెలవు.. అనంతరం బడ్జెట్‌పై చర్చ.. తరువాత ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదం అంశాలను పరిగణనలోకి తీసుకుని సభను నిర్వహించే రోజులపై నిర్ణయం తీసుకోనున్నారు.



'ఎడారిలో ఒయాసిస్సు - ఇజ్రాయెల్ వ్యవసాయం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రామోజీ గ్రూపు సంస్థల ఛైర్మన్ రామోజీరావు. చిత్రంలో జి.సుధాకర్, డీఎన్ ప్రసాద్, సీహెచ్ కిరణ్, అమిర్నేని హరికృష్ణ, ఎం.నాగేశ్వరరావు

### ఇజ్రాయెల్ వ్యవసాయం
## ఎడారిలో ఒయాసిస్సు

- పుస్తకాన్ని ఆవిష్కరించిన రామోజీ గ్రూపు సంస్థల ఛైర్మన్ రామోజీరావు

ఈనాడు, హైదరాబాద్: వ్యవసాయం, నీటి పారుదల యాజమాన్యంలో ఇజ్రాయెల్ సాధించిన విజయాలపై అన్నదాత కార్యనిర్వాహక సంపాదకుడు అమిర్నేని హరికృష్ణ రచించిన 'ఎడారిలో ఒయాసిస్సు - ఇజ్రాయెల్ వ్యవసాయం' పుస్తకాన్ని రామోజీ గ్రూపు సంస్థల ఛైర్మన్ రామోజీరావు మంగళవారం ఆవిష్కరించారు. ఇజ్రాయెల్ చరిత్ర, ఆవిర్భావంతో పాటు వ్యవసాయం, నీటిపారుదల రంగాల్లో ఈ ఎడారి దేశం అనన్య సామాన్యమైన ప్రగతిని అందుకున్న తీరును రచయిత ఈ పుస్తకంలో వివరించారు. భారత్-ఇజ్రాయెల్ సంబంధాల్లో పొద్దు పొడిచిన నవశకం, అందుకు రెండు దేశాల ప్రధానులు మోదీ, నెతన్యాహుల మధ్య స్నేహ బంధాన్ని రచయిత ఇందులో ప్రస్తావించారు. ప్రపంచ వ్యవసాయ సదస్సు- ప్రదర్శనలో భాగంగా ఇజ్రాయెల్ విదేశాంగ శాఖ 2015లో భారత్‌లోని ఆరుగురు సీనియర్ పాత్రికేయులను ఎంపిక చేసి అధ్యయనానికి ఆహ్వానించింది. బృంద సభ్యుడిగా ఇజ్రాయెల్ సందర్శించిన హరికృష్ణ అక్కడ వ్యవసాయం, నీటి పారుదల రంగాల స్థితిగతులను పరిశీలించి ఈ పుస్తకాన్ని రచించారు. పుస్తకానికి రామోజీరావు ముందుమాట రాశారు. రామోజీ ఫిల్మ్ సిటీలో మంగళవారం జరిగిన పుస్తకావిష్కరణలో 'ఈనాడు' మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ కిరణ్, సీనియర్ అసోసియేట్ ఎడిటర్లు డి.ఎన్.ప్రసాద్, ఎం.నాగేశ్వరరావు, జనరల్ మేనేజర్ (సర్క్యులేషన్) జి.సుధాకర్, పుస్తక రచయిత అమిర్నేని హరికృష్ణ పాల్గొన్నారు.

## సర్కారు కొలువుపై హైదరాబాద్ యువత మోజు

- అత్యధిక దరఖాస్తుల్లో భాగ్యనగరానిదే అగ్రస్థానం
- దరఖాస్తుదారుల్లో అమ్మాయిలు 46 శాతం
- అడ్డా 247 గణాంకాల్లో వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగం దక్కించుకోవాలని హైదరాబాద్ యువత తహతహలాడుతోంది. దేశవ్యాప్తంగా సర్కారు కొలువుల భర్తీకి నిర్వహిస్తున్న పోటీ పరీక్షలకు మన నగరం నుంచే అత్యధిక దరఖాస్తులు అందుతున్నాయి. ప్రముఖ విద్యా సాంకేతిక సంస్థ 'అడ్డా 247' దేశంలోని పలు నగరాల నుంచి దరఖాస్తులు చేస్తున్న వారి గణాంకాలను సేకరించింది. ఎస్‌బీఐ-పీఓ, ఎస్ఎస్‌సీ సీజీఎల్, ఐబీపీఎస్, ఆర్ఆర్‌బీ ఉద్యోగాలకు అందిన దరఖాస్తులను పరిశీలించింది. 2018-19లో హైదరాబాద్ నుంచే అత్యధికంగా 65,07,470 మంది దరఖాస్తు చేశారు. ఇతర నగరాల్లో 42 శాతం మంది అమ్మాయిలు పరీక్షకు హాజరవుతుండగా హైదరాబాద్‌లో 46 శాతం ఉండటం విశేషం.

### నగరాల వారీగా దరఖాస్తుల సంఖ్య

- హైదరాబాద్: 65,07,470
- పట్నా: 54,37,345
- జయపుర: 46,22,508
- పుణె: 36,93,402
- లఖ్‌నవూ: 35,66,370

JOB APPLICATIONS

### ముఖ్య విశేషాలు...

- దేశవ్యాప్తంగా పోటీ పరీక్షలకు హాజరయ్యే వారిలో 54 శాతం అబ్బాయిలు, 46 శాతం అమ్మాయిలు ఉంటున్నారు.
- మిగిలిన నగరాల కంటే హైదరాబాద్ నుంచి డిజిటల్ లేదా ఆన్‌లైన్ ద్వారా సన్నద్ధమయ్యే వారి సంఖ్య బాగా పెరుగుతోంది.
- హైదరాబాద్ విద్యార్థులు ఎక్కువగా ఎస్‌బీఐ పీఓ, ఆర్ఆర్‌బీ ఎన్‌టీపీసీ, ఆర్ఆర్‌బీ జేఈ, ఐబీపీఎస్- ఆర్ఆర్‌బీ పోటీ పరీక్షలకు దరఖాస్తు చేస్తున్నారు.
- టైర్-1 నగరాల నుంచి 30 శాతం, టైర్-2, 3 నగరాల నుంచి 70 శాతం మంది పరీక్షలకు దరఖాస్తు చేస్తున్నారు.
- అత్యధికంగా ఎస్‌బీఐ-పీఓ, ఎస్‌సీసీ సీజీఎల్, ఐబీపీఎస్-ఆర్ఆర్‌బీలకు వరుసగా 45.82, 22.31, 19.50 శాతం దరఖాస్తులు అందుతున్నాయి.
- ప్రభుత్వ కొలువులకు పోటీ పడే వారి సంఖ్య ఏటా 28 శాతం పెరుగుతోంది.

## రెవెన్యూ చట్టంపై ముమ్మర కసరత్తు

- ముసాయిదాపై కలెక్టర్లతో సుదీర్ఘ కార్యశాల
- హన్మకొండలో అన్ని జిల్లాల పాలనాధికారులతో సమావేశమైన సోమేశ్‌కుమార్

ఈనాడు - వరంగల్

కొత్త రెవెన్యూ చట్టం రూపకల్పనకు ముసాయిదా తయారీపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ మంగళవారం హన్మకొండలో కార్యశాల నిర్వహించారు. బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లు కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించనున్న నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నానికే వారంతా హన్మకొండకు చేరుకున్నారు. ఈ క్రమంలో కలెక్టర్లతో సోమేశ్‌కుమార్ మధ్యాహ్నం 2.40 గంటల నుంచి రాత్రి 8.40 వరకు సుదీర్ఘ కార్యశాల నిర్వహించారు. కొత్తగా రూపొందించబోయే రెవెన్యూ చట్టంలో మార్పులు, చేర్పులపై లోతుగా చర్చ సాగింది. ప్రభుత్వం భూ ప్రక్షాళనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని.. ఈ క్రమంలో కలెక్టర్లు మరింత దృష్టి సారించి ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్త రెవెన్యూ చట్టం రూపకల్పనపై దృష్టి సారించారని సోమేశ్‌కుమార్ చెప్పారు. ఈ క్రమంలో కలెక్టర్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్న ఆయన.. వారి సలహాలు, సూచనలు తీసుకున్నారు. కొత్త రెవెన్యూ చట్టంపై ఇటీవల హైదరాబాద్‌లో కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమావేశమైన నేపథ్యంలో దానికి కొనసాగింపుగా ఈ కార్యశాల జరిగింది.

### కలెక్టర్ల భిన్నాభిప్రాయాలు

కార్యశాలలో సోమేశ్‌కుమార్‌తోపాటు 30 మంది కలెక్టర్లు పాల్గొన్నారు. వివిధ కారణాలతో సిద్దిపేట, పెద్దపల్లి, మహబూబ్‌నగర్ పాలనాధికారులు హాజరుకాలేదు. ఈ క్రమంలో కలెక్టర్లు కొత్త రెవెన్యూ చట్టంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న చట్టంలోని లొసుగులు, అవినీతి కట్టడికి కొత్త చట్టంలో తీసుకురావాల్సిన మార్పులు, చేర్పులపై వేర్వేరుగా కీలక సూచనలు చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఎదురవుతున్న సమస్యలు, ధరణి వెబ్‌సైట్ వల్ల ఉత్పన్నమవుతున్న ఇబ్బందులను సోమేశ్‌కుమార్ దృష్టికి తీసుకొచ్చారు. కొత్తగా తెచ్చే చట్టం వల్ల ప్రజలకు మేలు జరగాలని, అవినీతికి తావివ్వకుండా పూర్తి పారదర్శకతతో ఉంటే బాగుంటుందని తగు ప్రతిపాదనలు పాలనాధికారులు చేశారు. కలెక్టర్ల అభిప్రాయాలతో నివేదికను సీఎం ముందు ఉంచుతానని సోమేశ్‌కుమార్ తెలిపారు.



కలెక్టర్లనుద్దేశించి మాట్లాడుతున్న సోమేశ్‌కుమార్

## చండూరు ఎంపీడీవోపై సస్పెన్షన్ వేటు

- కేటీఆర్ సూచన మేరకు నిలుపుదల!

నల్గొండ జిల్లాపరిషత్-న్యూస్‌టుడే

రహదారి మరమ్మతులకు నిధుల విషయమై ఓ ప్రజాప్రతినిధి, ఎంపీడీవో మధ్య జరిగిన ఫోన్ సంభాషణ.. అందులో తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై ఆ అధికారి చేసిన వ్యాఖ్యలు ఆయన సస్పెన్షన్‌కు దారితీశాయి. నల్గొండ జిల్లా చండూరు మున్సిపాలిటీ ఇన్‌ఛార్జి కమిషనర్, ఎంపీడీవో నరేందర్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా పరిషత్తు సీఈవో వీరబ్రహ్మచారి మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పుర ప్రజలు కమిషనర్‌ను ఆశ్రయిస్తే వాటి పరిష్కారానికి నిధులు లేవంటూ, ప్రజాప్రతినిధులను దూషిస్తూ, నోటి దురుసు ప్రదర్శించినట్లు ఫోన్ సంభాషణ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. విధుల పట్ల బాధ్యతారహితంగా వ్యవహరించిన ఎంపీడీవోపై చర్య తీసుకోవాలన్న కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ ఆదేశాల మేరకు జడ్పీ సీఈవో ఆయనను సస్పెండ్ చేశారు. విషయాన్ని రాష్ట్ర ఎంపీడీవోల సంఘం కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన ఆ ఉత్తర్వులను నిలుపుదల చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు సమాచారం. చివరకు ఎంపీడీవో సస్పెన్షన్‌ను నిలిపివేసినట్లు తెలిసింది.

## 'రాధేశ్యాం వాంగ్మూలం తీసుకోవచ్చు'

ఈనాడు, హైదరాబాద్: మనీ సర్క్యులేషన్ నేరాన్ని ఎదుర్కొంటున్న 'ఫ్యూచర్ మేకర్ లైఫ్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్' చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ రాధేశ్యాం వాంగ్మూలం తీసుకోవడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు మంగళవారం హైకోర్టు అనుమతి మంజూరు చేసింది. ఈసీఐఆర్ (ఎఫ్ఐఆర్)లో రాధేశ్యాంను నిందితుడిగా పేర్కొనకపోవడంతో అరెస్ట్ చేయడానికి వీల్లేదని షరతు విధించింది. హరియాణా జైలులో ఉన్న రాధేశ్యాంను విచారించడానికి కింది కోర్టు నిరాకరించడాన్ని సవాలు చేస్తూ ఈడీ హైకోర్టును ఆశ్రయించింది. విచారణ జరిపిన జస్టిస్ గండికోట శ్రీదేవి షరతులతో అనుమతి మంజూరు చేశారు. హరియాణా జైలు నుంచి ఈడీ కార్యాలయానికి రాధేశ్యాంను తరలించి వాంగ్మూలం తీసుకున్నాక తిరిగి జైలు అధికారులకు అప్పగించాలని ఆదేశించారు.

ఈనాడు | 1869 - 2019 | మహాత్ముడి 150వ జయంతి వేడుకలు

### మన కమ్యూనిజం!

మన సోషలిస్టు లేదా కమ్యూనిస్టు కార్యాచరణకు మౌలికంగా అహింసే పునాది కావాలి. అలాగే కార్మికుడికీ - పెట్టుబడిదారుడికీ, భూస్వామికీ - రైతుకీ మధ్య సమన్వయ సహకారాలే భూమికగా ఉండాలి!

- మహాత్మా గాంధీ



నర్సమ్మ

## బతికుండగానే..'చితి'కి

- కన్నతల్లిని శ్మశానానికి తరలించిన కొడుకు
- ప్రభుత్వాస్పత్రికి చేర్చి చికిత్స అందిస్తున్న వైద్యులు

జగిత్యాల, న్యూస్‌టుడే: అది జగిత్యాలలోని శ్మశానవాటిక.. ఓ అంబులెన్స్ అక్కడున్న వృద్ధురాలిని ఆసుపత్రికి తీసుకెళుతోంది. వినడానికి వింతగా అనిపిస్తున్నా ఇది నిజం.. అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధురాలైన తన తల్లిని స్వయానా కన్నకొడుకు శ్మశానానికి చేర్చాడు. ఈ అమానవీయ ఘటన మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగింది. ఆనోటా ఈ నోటా విషయం తెలుసుకున్న ప్రభుత్వాసుపత్రి సిబ్బంది రంగంలోకి దిగి ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. జగిత్యాల వీక్లీ బజార్‌లో చెట్‌పల్లి నర్సమ్మ(95) అనారోగ్యంతో బాధ పడుతోంది. ఈమె భర్త ముప్పయ్యేళ్ల క్రితమే చనిపోగా.. కుమారుడు ధర్మయ్య తల్లి ఆలనా పాలనా చూసుకుంటున్నాడు. తల్లి వృద్ధురాలు కావడంతో అనారోగ్యానికి గురైంది. ధర్మయ్య ఉండేది అద్దె ఇల్లు.. తల్లి ఇంట్లోనే చనిపోతే ఇంటి యజమానితో మాట పడాల్సి వస్తుందన్న భయంతో తల్లి కన్నుమూయక ముందే శ్మశానానికి తరలించాడు. అక్కడున్న ఓ గదిలో ఉంచాడు. వృద్ధురాలి దీనస్థితిని చూసి కొందరు చలించిపోయారు. జగిత్యాల ప్రభుత్వాసుపత్రి పర్యవేక్షకురాలు సుదక్షిణాదేవికి వారు సమాచారం అందించారు. వెంటనే ఆమె అంబులెన్స్ పంపించి ఆమెను ఆసుపత్రికి రప్పించారు. ప్రస్తుతం నర్సమ్మ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది.

## పొద్దూ మాపూ ఓపీ

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో విషజ్వరాల విజృంభణ, ఆరోగ్యశాఖ సన్నద్ధతపై ముఖ్య కార్యదర్శి కీలక ఆదేశాలను జారీ చేశారు.

### కీలక ఆదేశాలు

- ✦ రాష్ట్రంలో జిల్లాల వారీగా వ్యాధుల నమోదును గణించే ప్రక్రియను కచ్చితంగా అమలు చేయాలి.
- ✦ ఏ ప్రాంతాల్లో ఏ రకమైన జబ్బులు ఎక్కువగా వస్తున్నాయో గుర్తించడానికి ఈ ప్రక్రియ దోహదపడుతుంది.
- ✦ వ్యాధుల సంఖ్యను తక్కువగా చేసి చూపించడం, తప్పుడు గణాంకాలను నమోదు చేయడం ఎట్టి పరిస్థితుల్లోనూ చేయొద్దు.
- ✦ వాస్తవాలను పొందుపర్చినప్పుడే వ్యాధులను ఎదుర్కోవడం సులభమవుతుంది. ఏరోజుకారోజు ఫలితాలపై సమీక్షించాలి.
- ✦ ఎప్పటికప్పుడు వైద్యసేవలను సంబంధిత విభాగాధిపతులు పర్యవేక్షించాలి.
- ✦ జ్వరాల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని వైద్యసేవలను విస్తరించాలి. జ్వరాలు తగ్గుముఖం పట్టే వరకూ ప్రత్యేక ఆదేశాలను అన్ని ఆసుపత్రులూ పాటించాలి.
- ✦ బోధనాసుపత్రులు, జిల్లా, ప్రాంతీయ ఆసుపత్రుల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ, తిరిగి సాయంత్రం 4-6 గంటల వరకూ ఓపీ సేవలను అందించాలి.
- ✦ ఆదివారాలు, రెండో శనివారాలు, ఇతర సెలవు దినాల్లోనూ వైద్యులు, ఇతర సిబ్బంది సేవలందించాలి.
- ✦ జ్వరాలు తగ్గుముఖం పట్టే వరకూ వైద్యులు సహా సిబ్బందికి సెలవులు రద్దు.
- ✦ ఉస్మానియా, గాంధీ, ఎంజీఎం, ఫీవర్, నిలోఫర్ తదితర ఆసుపత్రుల్లో రోజుకు ఓపీ 1800-2000 దాటుతున్న పరిస్థితుల్లో. . ఓపీలో తమ పేరు నమోదు చేసుకోవడానికి మధ్యాహ్నం 2 గంటలు దాటుతుందనే అంశం చర్చకొచ్చింది. దీంతో ఓపీలో నమోదు చేసుకునే కేంద్రాల సంఖ్యను అన్ని ప్రభుత్వాసుపత్రుల్లోనూ పెంచాలి.
- ✦ నిర్ధారణ పరీక్షలకు రక్త, మూత్ర నమూనాలను స్వీకరించే కేంద్రాలనూ పెంచాలి. 100 శాతం నిర్ధారణ పరీక్షలను ప్రభుత్వాసుపత్రుల్లోనే చేయాలి.
- ✦ ఓపీలో వైద్యుల సంఖ్యను అవసరానికి తగ్గట్లుగా పెంచాలి. జ్వర బాధితులను పరీక్షించడానికి అవసరమైతే ఇతర విభాగాల స్పెషలిస్టు వైద్యులనూ వినియోగించుకోవాలి.
- ✦ జీహెచ్ఎంసీ పరిధిలోని 100 బస్తీ దవాఖానాలు, 150 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల సేవలను మరింత మెరుగ్గా వినియోగించుకోవాలి. వీటిల్లోనూ నిర్ధారణ పరీక్షలు, ఔషధాలను కచ్చితంగా అందించేలా చర్యలు తీసుకోవాలి.
- ✦ అన్ని స్థాయుల ఆసుపత్రుల్లోనూ ఔషధాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి. అవసరమైతే ఆసుపత్రి నిధుల నుంచి అత్యవసరంగా కొనుగోలు చేయాలి.
- ✦ కేవలం రాత్రిపూట మాత్రమే కాకుండా ఉదయం, పగటిపూట కూడా దోమల సంహరణ మందులను చల్లడం, పొగబెట్టడం వంటివి చేయాలి.

## రైతు కష్టం కేసీఆర్‌కు తెలుసు: మంత్రి నిరంజన్‌రెడ్డి

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయానా రైతు కావడం వల్ల అన్నదాతల కష్టాలు ఆయనకు తెలుసని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. అందుకే రైతుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శాస్త్రవేత్తల సమావేశం జరిగింది. ఫిలిప్పీన్స్‌కు చెందిన అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ ప్రతినిధులు, ఉపకులపతి డా.ప్రవీణ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వ్యవసాయ విశ్వవిద్యాలయం, అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ సంయుక్తంగా ప్రతిపాదించిన ప్రాజెక్టును ముఖ్యమంత్రి కేసీఆర్ ఆమోదిస్తారని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకుముందు పరిశోధనా సంస్థ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ జాక్వెలిన్ హ్యూస్ ప్రతిపాదిత ప్రాజెక్టు అంశాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

## 108 కష్టాలు!



- సిబ్బందికి నేటికీ అందని వేతనాలు
- నిధుల విడుదలలో తరచూ జాప్యం
- ఇలాగే కొనసాగితే సేవలు నిలిచిపోయే ప్రమాదం

ఈనాడు, హైదరాబాద్: అత్యవసర వాహన(108) సేవల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఆగస్టు 1న చెల్లించాల్సిన వేతనాలు ఇప్పటికీ అందలేదు. మరో నాలుగు రోజులు గడిస్తే రెండో నెల వేతనాలనూ పొందాల్సిన పరిస్థితుల్లో.. వాహన చోదకులు, సాంకేతిక నిపుణులు, అత్యవసర ఫోన్ కాల్స్‌ను స్వీకరించే ఉద్యోగులందరూ జీతాల కోసం ఎదురుచూస్తున్నారు. వైద్యఆరోగ్యశాఖ నుంచి ఇప్పటికీ నిధులు విడుదల కాకపోవడంతో వచ్చే నెలలోనైనా సకాలంలో వేతనాలు అందుతాయా? అనే ఆందోళన ఉద్యోగుల్లో నెలకొంది. నిధుల విడుదలలో జాప్యం ఇలాగే కొనసాగితే.. 108 అంబులెన్సు సేవలు కూడా నిలిచిపోయే పరిస్థితి ఎదురయ్యే ప్రమాదమూ పొంచి ఉంది. ఇప్పటికే వరంగల్ పట్టణ జిల్లాలో కొన్నిచోట్ల బకాయిల చెల్లింపుల్లో జాప్యం కారణంగా ఆదివారం డీజిల్ పోయడానికి పెట్రోల్ బంకుల యజమానులు నిరాకరించినట్లుగా తెలిసింది. ఈ విషయం ఈఎంఆర్ఐ ఉన్నతాధికారులకు తెలియడంతో అప్పటికప్పుడు కొంత మొత్తాన్ని సర్దుబాటు చేసి 108 అంబులెన్సు సేవలు కొనసాగేలా చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

**వ్యయంతో పోల్చితే సేవలు అమోఘం:** రాష్ట్రంలో 320 అత్యవసర వాహనాలు అందుబాటులో ఉండగా.. నిరంతరం సేవలందించేందుకు 300 వాహనాలు సిద్ధంగా ఉంటాయి. వీటి డీజిల్ ఖర్చులు, నిర్వహణ వ్యయం కలుపుకొని నెలకు సుమారు రూ.కోటి వరకు ఉంటుంది. ఇక 108 అంబులెన్సు సేవల్లో పనిచేస్తున్న సిబ్బంది సుమారు 1500 మంది ఉంటారు. వీరికయ్యే వేతనాల ఖర్చు నెలకు సుమారు.3.5 కోట్లు. అంటే 108 వాహన సేవల కోసం మొత్తంగా నెలకు రూ.4.5 నుంచి 5కోట్ల లోపే ఖర్చవుతుంది. ఏడాదికి గరిష్ఠంగా రూ.60 కోట్లు వ్యయమవుతుంది. ఈ అంబులెన్సుల ద్వారా నెలకు దాదాపు 40 వేలకు పైగా, ఏడాదికి సుమారు 5 లక్షల మందికి పైగా రోగులకు సేవలందిస్తున్నారు. 108 వాహనాల కోసం ప్రభుత్వం ఖర్చు చేసే నిధులతో పోల్చితే రోగులకు అందించే సేవలు ఎక్కువే. అత్యవసర వాహన సేవల ప్రాధాన్యం దృష్ట్యా క్రమబద్ధంగా నిధుల విడుదలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని ప్రజలు కోరుతున్నారు.

## గ్రహం అనుగ్రహం

28-8-2019 బుధవారం

శ్రీ వికారి నామ సం॥రం॥ దక్షిణాయనం
వర్ష రుతువు; శ్రావణ మాసం; బహుళ పక్షం
త్రయోదశి: రా. 9-08 తదుపరి చతుర్దశి
పుష్యమి నక్షత్రం: రా. 9-43 తదుపరి ఆశ్లేష
అమృత ఘడియలు: మ. 3-38 నుంచి 5-09 వరకు
వర్జ్యం: ఉ. 6-30 నుంచి 8-02 వరకు
దుర్ముహూర్తం: మ. 11-36 నుంచి 12-26 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.5-48; సూర్యాస్తమయం: సా. 6.15

## వాతావరణం

| ప్రాంతం | గరిష్ఠ | కనిష్ఠ |
|---|---|---|
| ఒంగోలు | 37.7 | 28.4 |
| విశాఖపట్నం | 37.4 | 27.6 |
| గుంటూరు | 37.1 | 27.2 |
| తిరుపతి | 36.8 | 25.6 |
| హన్మకొండ | 35.2 | 26.9 |
| విజయవాడ | 34.9 | 26.0 |
| కర్నూలు | 34.8 | 24.6 |
| ఖమ్మం | 34.0 | 33.0 |
| నల్గొండ | 34.0 | 26.6 |
| సూర్యాపేట | 33.0 | 28.0 |
| రామగుండం | 33.0 | 23.5 |
| కరీంనగర్ | 32.0 | 24.0 |
| హైదరాబాద్ | 31.8 | 22.8 |
| మహబూబ్‌నగర్ | 31.8 | 22.2 |
| మెదక్ | 30.5 | 21.0 |
| నిజామాబాద్ | 30.4 | 23.9 |
| ఆదిలాబాద్ | 30.3 | 23.4 |

# అనుభవమే సేద్యం చేస్తోంది

- వ్యవసాయం భావోద్వేగాలతో ముడిపడింది
- రైతులు అనుసరిస్తున్న విధానంతో ఆహార భద్రత
- డీడీఎస్ తాజా అధ్యయనంలో వెల్లడి

ఆహార, వ్యవసాయ సంక్షోభం నుంచి దేశం బయటపడేదెలా? ఆ మార్గం రైతులకే బాగా తెలుసు. వారి పరిజ్ఞానం, తెలివితేటల నుంచే అన్నీ కనుగొనవచ్చు. ఎందుకంటే వ్యవసాయం, చుట్టూ నెల కొన్న స్థితిగతులపై రైతులకు ఉండే అవగాహనా శక్తి ఎంతో ఎక్కువ అని తేలింది. 'సాధారణ వ్యవసాయ శాస్త్రంలో రైతుల పరిజ్ఞానం' అంశంపై దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ, (డీడీఎస్), అనుభవజ్ఞులైన మరికొందరు శాస్త్రవేత్తలు కలిసి పరిశీలన జరిపారు. సంగారెడ్డి జిల్లా పస్తాపూర్‌లో వర్షాధార భూముల రైతులతో పాటు వారు విస్తృత అధ్యయనం చేశారు.

**వివరాలు**

అధ్యయనం కోసం 2017 జూన్ నుంచి 2019 మే వరకు పలు అవగాహన సమావేశాలు నిర్వహించారు. వ్యవసాయంలో 30 నుంచి 50 ఏళ్లదాకా అనుభవం ఉన్న రైతుల నుంచి సమాచారమంతా తెలుసుకున్నారు.

ఖరీఫ్, రబీ సీజన్లలోని పంటల సాగు సమయాల్లో రైతులందరి అనుభవాలనూ గ్రహించారు.

నేల దున్నడం, విత్తనాల ఎంపిక, భూసార పరిరక్షణ, నాట్లు వేయడం, కలుపుతీత, పురుగు మందులు చల్లడం, పంట కోత..ఇలా ప్రతి వ్యవసాయ పనిలోనూ రైతులు అనుసరిస్తున్న విధానాలను నిశితంగా పరిశీలించారు.




1. రాష్ట్రంలో ఆహార ధాన్యాల పంటల సాగు విస్తీర్ణం క్రమంగా తగ్గుతోంది. 2016-17లో 34 లక్షల హెక్టార్లలో వీటిని సాగుచేస్తే, మరుసటి ఏడాది(2017-18)లో అంతకన్నా తగ్గి, అది 31 లక్షల హెక్టార్లకు చేరింది.

2. మొత్తం ఆహారధాన్యాల్లో జొన్న విస్తీర్ణం ఖరీఫ్‌లో 2.4 శాతమే ఉంది.

3. నేలను బాగా ఎక్కువగా దుక్కి దున్నడం అంత అవసరమేమీ కాదని రైతులు చెప్పారు. జొన్న, కందులు వంటి పంటలు వేయడానికి లోతు దుక్కులతో పనిలేదని తెలిపారు.

4. నేలల రకాలనుబట్టి పంటలను సాగు చేయడంలో రైతులకు పరిజ్ఞానం ఉంది. వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్న సాంకేతిక అంశాల మాదిరిగానే, రైతులు కూడా సొంత పరిజ్ఞానంతో ఏ పంటకు ఏ నేల మంచిదో ఎంపిక చేసుకుంటున్నారు. మార్కెట్ డిమాండునుబట్టి మాత్రమే కాకుండా, నేల రకాన్ని అనుసరించి అనువైన పంటలు వేస్తామంటున్నారు.

5. తెలుగు కార్తెల ఆధారంగా విత్తనాలు, నాట్లు వేయడం రైతులకు అలవాటు. ఒక్కో కార్తెలో ఒక్క పంట సాగు మొదలుపెడితే దిగుబడి బాగా వస్తుందంటున్నారు. కార్తె మారేకొద్దీ వేసే పంట మారుతుంది. పంటను ఏ కార్తెలో ఏ సమయంలో వేశారన్నదాన్ని బట్టి దాన్ని ఆశించే తెగుళ్లు, పురుగులు పెరుగుతున్నాయి. ఒకే చోట వివిధ రకాల పంటలు వేస్తే తెగుళ్ల వ్యాప్తి తగ్గుతుందని శాస్త్రవేత్తలు సూచిస్తుంటారు. ఇదే విధానం నాటి కాలం నుంచే రైతుల సేద్యంలో భాగమవుతూ వస్తోంది.

6. రైతులు అనుసరిస్తున్న పంటల విధానం..అత్యంత కఠిన వాతావరణంలోనూ ఆహార భద్రత కలిగిస్తోంది. తమ ఆహార ధాన్యాల కోసం వారు ఎప్పుడూ బయటివారిపై ఆధారపడలేదు.

7. వ్యవసాయం రైతుల భావోద్వేగాలు, ఆచారాలు, సంస్కృతితో ముడిపడి ఉంటుంది. వారు చేసుకునే ప్రతి పండగా పంటలకు అత్యంత ప్రాధాన్యమిచ్చేదే.

8. పశువుల పేడ వంటి సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా నేల సారం పెరుగుతుందని రైతులు నమ్ముతున్నారు. సంప్రదాయ విధానం దుక్కుల ద్వారా మట్టి గట్టిపడకుండా చూస్తుంది. దీనికి విరుద్ధంగా పెద్ద ట్రాక్టర్లతో దుక్కులు, రసాయన ఎరువుల విపరీత వాడకం వల్ల నేల గట్టిపడి విత్తనాలు అంతగా మొలకెత్తడం లేదు. కలుపు మొక్కల విత్తనాలే సులభంగా మొలకెత్తుతున్నాయి. తేలిక రకాల పంట విత్తనాలు ఆ నేలల్లో మొలకెత్తడం లేదు మరి.

- ఈనాడు, హైదరాబాద్

# బీబీనగర్ ఎయిమ్స్‌లో వైద్య విద్య తరగతుల ప్రారంభం

**బీబీనగర్, న్యూస్‌టుడే:** యాదాద్రి జిల్లా బీబీనగర్‌లో ఏర్పాటు చేసిన ఎయిమ్స్ (ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్) ఆసుపత్రికి ఎట్టకేలకు మోక్షం లభించింది. ఇక్కడ వైద్య విద్య తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. భోపాల్ ఎయిమ్స్ డైరెక్టర్, బీబీనగర్ ఎయిమ్స్ ఇన్‌ఛార్జి శర్వాన్ సింగ్ ప్రస్తుతం ఎయిమ్స్‌కు కేటాయించిన అధ్యాపకులు, భోపాల్ ఎయిమ్స్ అధికారులతో కలిసి తరగతులు ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులకు ఓరియంటేషన్ తరగతులు నిర్వహించి ఎయిమ్స్ ఆసుపత్రి ప్రాముఖ్యతను వివరించారు. ఆసుపత్రి పూర్తి నిర్వహణ బాధ్యతలు ఎయిమ్స్ ఆధ్వర్యంలోనే కొనసాగుతాయని స్పష్టం చేశారు. విద్యార్థులకు వైద్యవిద్యతోపాటు అన్ని వసతులను కల్పించినట్లు తెలిపారు. మొదటి సంవత్సరం ల్యాబ్‌లు తక్కువగా ఉంటాయని, అవి ఎయిమ్స్ అనుబంధ నిమ్స్‌లోనే కొనసాగుతాయన్నారు. రెండో సంవత్సరం నాటికి ఎయిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలోనే వైద్య సేవలు ప్రారంభమవుతాయని చెప్పారు. మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, జడ్పీ ఛైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి ఆసుపత్రిని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఉత్తమ ఫలితాలు సాధించి జాతీయ స్థాయిలో గుర్తింపు తేవాలని సూచించారు. ఎయిమ్స్ ఆసుపత్రిలో తరగతులు ప్రారంభం అవుతున్నాయన్న సమాచారంతో రంగాపురం గ్రామస్థులు పెద్ద సంఖ్యలో ఆసుపత్రికి చేరుకున్నారు. ఆసుపత్రికి కేటాయించిన భూములు తమవేనని, వాటికి నేటికీ నష్టపరిహారం చెల్లించలేదని ఆందోళనకు దిగారు. భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పించి, ఎయిమ్స్‌లో కుటుంబానికి ఓ ఉద్యోగం చొప్పున ఇప్పించాలని డిమాండ్ చేశారు.

## నీటి సంరక్షణ సదస్సులో పెద్దపల్లి కలెక్టర్


సదస్సులో పాల్గొన్న కలెక్టర్

**పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే:** స్వీడన్‌లోని స్టాక్‌హోమ్‌లో నిర్వహిస్తున్న ప్రపంచ నీటి సంరక్షణ వారోత్సవాల్లో పెద్దపల్లి జిల్లా పాలనాధికారిణి శ్రీదేవసేన మంగళవారం ప్రసంగించారు. వివిధ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు వారి దేశంలో నీటి వనరులు, వాటి వినియోగానికి తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా వివరించారు. భూగర్భంలోకి ప్రతి నీటి బొట్టును ఇంకించేందుకు ఇంకుడు గుంతలు, కాంటూరు కందకాలను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. నీటి వినియోగంలో ప్రజలను చైతన్యం చేస్తున్నట్లు తెలియచేశారు.

# గ్రామ రెవెన్యూ వ్యవస్థకు చికిత్స

- అర్హులకు రెవెన్యూశాఖలోనే బాధ్యతలు
- కలెక్టర్ల అభిప్రాయాలు కోరిన ప్రభుత్వం

**ఈనాడు, హైదరాబాద్:** గ్రామ రెవెన్యూ వ్యవస్థ ముఖచిత్రం మార్చాలని భావిస్తున్న ప్రభుత్వం.. ఏ స్థాయి నుంచి మార్పులు చేయాలనేదానిపై కసరత్తు చేస్తోంది. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్, మంగళవారం వరంగల్‌లో రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌లు గ్రామ రెవెన్యూ వ్యవస్థ సమూల మార్పులపై కలెక్టర్లతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా కొత్త రెవెన్యూ చట్టంతోపాటు వీఆర్‌ఓ వ్యవస్థలో మార్పులు, చేర్పులపై కలెక్టర్ల అభిప్రాయాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అభిప్రాయాలను కూడా వారి ముందుంచినట్లు తెలిసింది. గ్రామ రెవెన్యూ అధికారులు(వీఆర్‌ఓ), గ్రామ రెవెన్యూ సహాయకులు(వీఆర్‌ఏ) భూ దస్త్రాల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నారు. వీఆర్‌ఏలు కేవలం సహాయ సహకారాలు అందిస్తుండగా తహసీల్దారు నుంచి మిగిలిన సిబ్బందికి వీఆర్‌ఓలే కళ్లు, చెవులుగా ఉంటూ వస్తున్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో భూ దస్త్రాల నిర్వహణ అంతా కాగితాలపైనే ఎక్కువగా సాగుతోంది. మున్ముందు పూర్తిగా ఆన్‌లైన్‌లోనే(ధరణి) నిర్వహణ చేపట్టనున్నారు. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో భూముల విచారణలు, నివేదికలు అందించే ప్రక్రియ తగ్గిపోనున్నట్లు అంచనా వేస్తున్నారు. దీంతోపాటు సాంకేతికతతో ముడిపడి ఉన్న విధులే ఉండనున్నాయి. అర్హులైన సిబ్బందితోనే క్షేత్రస్థాయిలో పనులు కొనసాగనున్నాయి. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అర్హులకు పెద్దపీట వేయాలనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది.

### అర్హులకు భూముల నిర్వహణలో అవకాశం

రాష్ట్రంలో 7,038 వీఆర్‌ఓ స్థానాలు ఉండగా 5,088 మంది సిబ్బంది ఉన్నారు. 24,035 వీఆర్‌ఏ స్థానాలు ఉండగా 22 వేల మంది ఉన్నారు. వీఆర్‌ఓలలో దాదాపు రెండు వేల మంది వరకు ప్రభుత్వం నేరుగా నిర్వహించిన పరీక్షల ద్వారా ఎంపికైన వారు ఉన్నారు. వీఆర్‌ఏలలో కూడా 2700 మంది వరకు ప్రత్యక్ష నియామకాల పద్ధతిలో నియామకమైన వారున్నారు. మిగిలిన వారిలో వీఆర్‌ఏ నుంచి వీఆర్‌ఓలుగా పదోన్నతులతో వచ్చిన వారు, కారుణ్య నియామకాల ద్వారా ఎంపికైన వారు ఉన్నారు. వీఆర్‌ఏలలో కావలికారు, మస్కూరీ తదితర వ్యవస్థల నుంచి గుర్తింపు లభించిన వారు ఉన్నారు. భూమి విలువైన సంపదగా మారడంతో భూ దస్త్రాల నిర్వహణకు కూడా విలువ పెరిగింది. దీంతో ప్రభుత్వ సేవల్లో భూముల నిర్వహణ అనేది కీలకంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం భూముల నిర్వహణ విధానాన్ని పూర్తిగా ఆధునికీకరిస్తుండటంతో సాంకేతికతకు పెద్దపీట వేయనున్నారు. దీనిలో భాగంగా వీఆర్‌ఓ, వీఆర్‌ఏలలో అర్హులైన వారిని భూ దస్త్రాల నిర్వహణ విధానానికి అనుసంధానం చేసుకుని మిగిలిన వారిని గ్రామ స్థాయిలో అనుబంధంగా ఉన్న శాఖలకు మళ్లించాలని భావిస్తున్నారు. ప్రత్యక్ష పద్ధతుల్లో ఎంపికైన వారికి రోస్టర్, సర్వీస్ రూల్స్, పదోన్నతులు తదితర అంశాల్లో సమస్యలు ఉండకపోవచ్చని తెలుస్తోంది. కొత్త రెవెన్యూ చట్టం రూపొందించిన అనంతరం క్రమంగా జనవరి నాటికి గ్రామ రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా మార్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

## తెలంగాణ ప్రాజెక్టులకే ప్రాధాన్యం ఇవ్వాలి

**కృష్ణా ట్రైబ్యునల్‌లో తెలంగాణ సాక్షి ఘన్‌శ్యాం ఝా**

**ఈనాడు, దిల్లీ:** తెలంగాణ పరిధిలోని ప్రాజెక్టులన్నీ కృష్ణాబేసిన్‌లో ఉన్న నేపథ్యంలో నీటివాటాలో రాష్ట్ర ప్రాజెక్టులకే ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ తరఫు సాక్షి ఘన్‌శ్యాం ఝా తెలిపారు. మంగళవారం జస్టిస్ బ్రిజేష్‌కుమార్, జస్టిస్ బీపీ దాస్, జస్టిస్ రామ్మోహన్‌రెడ్డిలతో కూడిన కృష్ణా ట్రైబ్యునల్‌లో తెలంగాణ సాక్షి ఝాను ఆంధ్రప్రదేశ్ సీనియర్ న్యాయవాది వెంకటరమణి క్రాస్ ఎగ్జామిన్ చేశారు. కృష్ణాడెల్టాలో సాగు విస్తీర్ణం 68,746 ఎకరాలు మాత్రమేనని ఝా అన్నారు. 100 ఏళ్లకి 65% నీటిలభ్యత ఆధారంగా కృష్ణాట్రైబ్యునల్-2 జలాలు కేటాయించిందని, 75% నీటి లభ్యత ఆధారంగా కేటాయింపులు చేయాలన్నారు. ఆల్మట్టి, తుంగభద్ర, బీమాల నుంచి గ్రావిటీ ద్వారా నీటిని అప్పట్లో తెలంగాణ పట్ల నిర్లక్ష్యం వల్ల కోల్పోయామని ఝా తెలిపారు.

## టీఎస్‌పీసీబీకి రెండో ర్యాంకు

**ఈనాడు డిజిటల్, హైదరాబాద్:** మెరుగైన పనితీరుతో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టీఎస్‌పీసీబీ) జాతీయ స్థాయిలో రెండో ర్యాంకు సాధించింది. జాతీయ హరిత ట్రైబ్యునల్ ఆదేశాల మేరకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) దేశవ్యాప్తంగా ఉన్న 35 కాలుష్య నియంత్రణ మండళ్లు, కమిటీల పనితీరుపై ఆడిట్ నిర్వహించి జాబితా ప్రకటించింది. ఈ నివేదికలో 82.72 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచామని టీఎస్‌పీసీబీ తెలిపింది.

# 15 రోజుల్లో పంచాయతీలకు కో-ఆప్షన్ సభ్యులు

- అన్ని జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా '60 రోజుల ప్రణాళిక'
- జిల్లా పంచాయతీ అధికారులకు ఉన్నతాధికారుల ఆదేశం

**ఈనాడు డిజిటల్, హైదరాబాద్:** గ్రామ పంచాయతీల్లో కో-ఆప్షన్ సభ్యుల ఎంపికను 15 రోజుల్లో పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లో అన్ని జిల్లాల పంచాయతీ అధికారు (డీపీవో)లతో సమావేశమైన పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, కమిషనర్ రఘునందన్‌రావు ఈ మేరకు పలు సూచనలు చేసినట్లు తెలిసింది. నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని అనుసరించి కలెక్టర్లు, డీపీవోల ఆధ్వర్యంలో ఒక్కో పంచాయతీకి ముగ్గురు చొప్పున కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికను పూర్తి చేయాలని చెప్పినట్లు సమాచారం. కొత్తగా మంజూరైన 312 పోస్టుల భర్తీకి వీలుగా ప్రస్తుతం ఉన్న అధికారులకు పదోన్నతులు కల్పించే అంశంపై సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. అర్హులైన ఏ ఒక్కరూ పదోన్నతి కోల్పోకుండా రెండు రోజుల్లో పోస్టుల వారీగా సీనియారిటీ జాబితా రూపొందించి పంపాలని ఉన్నతాధికారులు సూచించారు. పంచాయతీ కార్యదర్శి మొదలు జిల్లా స్థాయి వరకు అన్ని పోస్టుల వివరాలు సేకరించాలని, నమోదైన కేసుల వివరాలను సైతం నివేదికలో పొందుపరచాలని సూచించినట్లు తెలిసింది. పల్లెల్లో '60 రోజుల ప్రణాళిక' అమలులో సాధకబాధకాలు తెలుసుకునేందుకు ప్రతి జిల్లాలో మూడు పంచాయతీలను ఎంపిక చేసి పైలెట్ ప్రాజెక్టుగా కార్యక్రమాన్ని నిర్వహించాలని డీపీవోలను ఉన్నతాధికారులు ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణ, హరితహారం మొక్కలకు నీరు పోసేందుకు పంచాయతీలకు ట్రాక్టర్లు, ఇతర వాహనాల కేటాయింపుపై నివేదిక ఇచ్చేందుకు ఐదుగురు డీపీవోలతో ఒక కమిటీని నియమించారు.

## సమస్యలను పరిష్కరించాలి

**ఆర్టీసీ కార్మికుల ఆందోళన**

**రాంనగర్, న్యూస్‌టుడే:** ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. విద్యానగర్‌లోని సంఘం కేంద్ర కార్యాలయం నుంచి మంగళవారం ర్యాలీగా బయలుదేరిన కార్మికులు బస్‌భవన్ పక్కన బహిరంగ సభలో పాల్గొన్నారు. ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి మాట్లాడుతూ, సమస్యల పరిష్కారంలో గుర్తింపు సంఘం టీఎంయూ పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత తెరాస అనుబంధ కార్మిక సంఘంగా టీఎంయూని గెలిపించినా కార్మికులకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని 2013 అక్టోబరులో జీవో విడుదలైనప్పటికీ, నేటికీ ఆ దిశగా చర్యలు లేవన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్నారు. 2017 వేతన సవరణ అమలు కాకపోవడంతో అనేకులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్టీసీలో గత ఐదేళ్లుగా ఉద్యోగ విరమణలే తప్ప, భర్తీలు లేకపోవడంతో పని ఒత్తిడి పెరిగిందన్నారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.నర్సింహన్, అధ్యక్షుడు ఎస్.బాబు ప్రసంగించారు. విధి నిర్వహణలో చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు.

## కశ్మీరీలకు మద్దతుగా నిలవండి

**మావోయిస్టు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ**

**ఖమ్మం, ఈనాడు; ఏటూరునాగారం, న్యూస్‌టుడే:** అన్ని వర్గాల ప్రజలు, ప్రజాసంఘాలు కశ్మీర్ ప్రజల స్వాతంత్ర్య పోరాటానికి అండగా నిలవాలని సీపీఐ (మావోయిస్టు) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కోరింది. ఉత్తర తెలంగాణ అధికార ప్రతినిధి జగన్ పేరిట మంగళవారం విడుదలైన ఓ ప్రకటన.. కశ్మీర్‌కు ప్రత్యేక హోదాను కల్పించే అధికరణాలను రద్దుచేయడం ఫాసిస్టు చర్యగా పేర్కొంది. కశ్మీర్ లోయకు చెందిన పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పీడీపీ), నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ), తదితర పార్టీల నాయకులను నిర్బంధించి బిల్లును ఆమోదింపజేయటం సిగ్గుచేటని అన్నారు. సమాధాన్, నయాభారత్ పేరుతో ఉద్యమకారులను అణచివేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు.

Admission Guidance
MBBS-BDS
BAMS-BHMS
Very Low Packages - Last 3 days only
GURU MITHRA, DSNR, HYD
9553170170, 8790511616


కేరళ సీఎం విజయన్ చేతుల మీదుగా జ్ఞాపికను అందుకున్న అలెప్పి సబ్ కలెక్టర్ కృష్ణతేజ

## కృష్ణతేజకు కేరళ ప్రభుత్వ పురస్కారం

**వరదల్లో అందించిన సేవలకు గుర్తింపు**

**ఈనాడు, హైదరాబాద్:** రెండేళ్ల కిందట కేరళను ముంచెత్తిన వరదల్లో అతలాకుతలమైన అలెప్పి ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రాల పునరుద్ధరణకు విశేషంగా కృషి చేసిన సబ్ కలెక్టర్ వి.ఆర్.కృష్ణతేజకు కేరళ ప్రభుత్వ పురస్కారం లభించింది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాకు చెందిన కృష్ణతేజ కేరళలో ఐఏఎస్ అధికారిగా సేవలందిస్తున్నారు. 2018-19 సంవత్సరంలో దాతల నుంచి సేకరించిన నిధుల ద్వారా 70 అంగన్‌వాడీలకు సమూల మరమ్మతులు కల్పించి నూతన సొబగులు అద్ది అందుబాటులోకి తీసుకురాగా, మరో 30 అంగన్‌వాడీలను కొత్తగా నిర్మించారు. ఉపాధి కోల్పోయిన ఒంటరి మహిళల్లో సుమారు 3వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. వరదల కారణంగా ఇళ్లలోని సామగ్రిని నష్టపోయిన కుటుంబాలకు అవసరమైన వంట సామగ్రి, పడకలు, దుప్పట్లు, తదితర వస్తువులను సమకూర్చారు. వీటికయ్యే ఖర్చునంతటినీ వేర్వేరు రాష్ట్రాలు, దేశాల నుంచి స్పందించిన దాతల నుంచి సేకరించిన నిధుల ద్వారానే నిర్వహించడంలో కృష్ణతేజ కీలకంగా వ్యవహరించారు. ఆయన చేసిన విశేష కృషిని గుర్తించిన కేరళ ప్రభుత్వం ఇటీవల పురస్కారంతో సత్కరించింది. కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ చేతుల మీదుగా కృష్ణతేజ ప్రశంసాపూర్వక జ్ఞాపిక, ధ్రువపత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కేరళ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శైలజ టీచర్, ఎమ్మెల్యే ఓ.రాజగోపాల్ పాల్గొన్నారు.

# రూ.ఐదు కోట్ల హవాలా సొమ్ము స్వాధీనం

- ముంబయికి తరలిస్తున్న ఏడుగురు ఏజెంట్ల అరెస్టు



స్వాధీనం చేసుకున్న హవాలా సొమ్మును చూపుతున్న హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్

**ఈనాడు, హైదరాబాద్:** దేశంలోని మెట్రో నగరాల్లో నిర్మాణరంగ సంస్థలు, రాజకీయ నేతల అవసరాలకు హవాలా సొమ్మును సమకూర్చుతున్న ఓ ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లో ఈ ముఠా సభ్యుల నుంచి రూ.5 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.అంజనీకుమార్ విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. గుజరాత్‌కు చెందిన విపుల్ కుమార్ పటేల్, శైలేష్ భాయ్, వి.కుమార్‌పటేల్, అర్జున్ లాభుజీ, ఉపేంద్ర కుమార్ పటేల్, రాజేష్ రమేష్ పటేల్, పటేల్ చేతన్ కుమార్ చాలా ఏళ్లక్రితం హైదరాబాద్ వచ్చి స్థిరపడ్డారు. అహ్మదాబాద్, సూరత్, ముంబయిలో ఉన్న పి.ఉమేష్‌చంద్ర కంపెనీ, మహారాష్ట్రలోని హవాలా ఏజెంట్లతో సంబంధాలు పెంచుకుని హైదరాబాద్‌లో వీరు ఏజెంట్లయ్యారు. అప్పటి నుంచి 0.6 శాతం కమీషన్ తీసుకుని హవాలా సొమ్మును అవసరమైన వారికి చేరవేస్తున్నారు. ముంబయిలోని ఉమేష్‌చంద్ర కంపెనీ యజమాని హర్షద్‌భాయ్ పటేల్ నుంచి రెండు రోజుల క్రితం రూ.5 కోట్ల నగదు కావాలంటూ విపుల్‌కుమార్‌కు ఫోన్ వచ్చింది. ఒక్కరోజులో నగదు సమీకరించిన విపుల్ దాన్ని తీసుకెళ్లడానికి జూబ్లీహిల్స్‌లోని తన కార్యాలయానికి సోమవారం రాత్రి అందరినీ రమ్మని చెప్పాడు. ఈ సమాచారం పశ్చిమ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అందడంతో ఇన్‌స్పెక్టర్ గట్టు మల్లు బృందం జూబ్లీహిల్స్ చెక్‌పోస్టుకు చేరుకుంది. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో విపుల్, అతడి సహచరులు రెండు కార్లలో వస్తుండగా ఆపి తనిఖీ చేయగా రూ.5 కోట్ల నగదు లభించింది. నగదుకు సంబంధించిన రసీదులు, లెక్కపత్రాలను చూపించక పోవడంతో ఏడుగురిని అదుపులోకి తీసుకొని, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న నగదును తదుపరి చర్యల కోసం ఐటీశాఖ అధికారులకు అప్పగించారు.

## యూరియాపై కదిలిన సర్కారు

**దిల్లీ వెళ్లాలని వ్యవసాయ కమిషనర్‌కు ఆదేశం**

**ఈనాడు, హైదరాబాద్:** యూరియా అందక రైతులు రోడ్లపైకి వస్తుండడంతో ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. అదనంగా లక్ష టన్నులు సరఫరా చేయాలని కేంద్రాన్ని అడిగేందుకు బుధవారం దిల్లీ వెళ్లాలని వ్యవసాయ కమిషనర్ రాహుల్ బొజ్జాను ఆదేశించింది. బుధవారం ఆయన దిల్లీలో కేంద్ర ఎరువుల శాఖ కార్యదర్శిని కలవనున్నారు. వచ్చే నెలకు కేంద్రం రాష్ట్రానికి లక్షన్నర టన్నులు కేటాయించగా.. మరో లక్ష టన్నులు కలిపి 2.50 లక్షల టన్నులు ఇవ్వాలని కోరనున్నట్లు కమిషనర్ తెలిపారు. దేశవ్యాప్తంగా ఎరువుల సరఫరాపై మంగళవారం కేంద్ర ఎరువుల శాఖ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. ఇందులో పాల్గొన్న రాహుల్ బొజ్జా రాష్ట్రంలో యూరియా డిమాండ్‌ను వివరించగా.. సరఫరాపై సమీక్షిస్తామని కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో జిల్లాల వారీగా డిమాండ్, సరఫరాపై మంగళవారం కంపెనీల ప్రతినిధులు, అధికారులతో కమిషనరేట్‌లో రాహుల్ బొజ్జా సమీక్ష నిర్వహించారు. నిల్వలున్న జిల్లాల నుంచి డిమాండ్ అధికంగా ఉన్న ప్రాంతాలకు పంపాలని ఆదేశించారు. రైలు మార్గాలు లేని జిల్లాల్లో సరఫరాలో ఇబ్బందులు ఉండడంతో.. పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించారు. కొరత లేకుండా సరఫరా చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయ కమిషనర్ తెలిపారు.

GITAM INSTITUTE OF MEDICAL SCIENCES AND RESEARCH (GIMSR)
GITAM (DEEMED TO BE UNIVERSITY)
Visakhapatnam-530045, Andhra Pradesh, India.
MBBS ADMISSIONS - STRAY VACANCY ROUND
For the few vacant seats in MBBS course for 2019-20 batch, interested NEET qualified rankers who are in the wait list provided by MCC at www.mcc.nic.in may immediately contact the office of the Principal, GIMSR before 30-08-2019. Visit: www.gimsr.gitam.edu.
Registrar
CONTACT: 9440279462 / 9908035979

www.hmcbgk.ac.in
SHRI BASAVESHWAR VEERASHAIVA VIDHYAVARDHAKA SANGHA'S
HOMOEOPATHIC MEDICAL COLLEGE AND HOSPITAL, BAGALKOT
BVVS Old Campus Belagavi - Raichur Road, Bagalkot - 587101 State Karnataka
BHMS (BACHELOR OF HOMOEOPATHIC MEDICINE AND SURGERY)
(Affiliated to Rajiv Gandhi University of Health Sciences, Bangalore & Approved by CCH, New Delhi)
ADMISSIONS OPEN for 1st YEAR BHMS 2019-20
DURATION 5 1/2 YEARS INCLUDING 1 YEAR INTERNSHIP
ELIGIBILITY PUC IInd - SCIENCE
PCB - 50% FOR GM STUDENTS
PCB - 40% FOR SC, ST, OBC STUDENTS
NEET 2019 ELIGIBLE
Zero Donations! Fees Only.
For Details Contact Principal: DR. ARUN V. HOOLI, MD (HOM)
9008654352 / 9448635104
Dr. Veeranna C. Charantimath, MLA
Chairman, B.V.V. Sangh, Bagalkot

# పఠనం కఠినం.. శయనం నరకం!




అసలే అద్దె భవనం. అరకొర సౌకర్యాలు. చుట్టూ ట్రంకు పెట్టెల మధ్య ఇరుకిరుగ్గా నేలపైనే కూర్చుండి పాఠాలు వినాల్సిన పరిస్థితి. రాత్రి పూట ఆ పెట్టెలన్నింటినీ వరండాలోకి తరలిస్తేగాని నిద్రించలేని దుస్థితి. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలానికి కేటాయించిన సాంఘిక సంక్షేమ ఎస్సీ గురుకుల విద్యాలయ బాలికల దయనీయ గాథ ఇది. చొప్పదండిలో కేటాయించిన స్థలంలో భవన నిర్మాణం జరక్క, అక్కడ అద్దెభవనం దొరక్క కరీంనగర్ గ్రామీణ మండలం నగునూర్‌లో నడిపిస్తున్నారు. సుమారు 400 మంది విద్యార్థినులు ఇక్కడ చదువుకొంటున్నారు. ఒక్కో గదిలో 40 మంది విద్యార్థినులు ఉండాల్సి వస్తోంది. భవన నిర్మాణమయ్యేదెన్నడో.. ఈ బాధలు తీరేదెన్నడో అని విద్యార్థినులు వాపోతున్నారు. అధికారులు దృష్టి సారించాలని ఆ బాలికలు కోరుతున్నారు.

—ఈనాడు, కరీంనగర్

LIC HFL
LIC HOUSING FINANCE LTD
Presents
SUPERB 30
Home Loan
8.40%
Onwards
*T&C Apply
For home loans log on to www.lichousing.com
or place a missed call on 84228 32132 or contact nearest Area office

# ప్రెస్ కౌన్సిల్ ఉన్నదెందుకు?

పత్రికాస్వేచ్ఛ పరిరక్షణ అన్నది ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) స్థాపిత లక్ష్యాల్లో అత్యంత కీలకమైనది. 'ప్రజాప్రయోజనాల పరిరక్షకురాలిగా సమాచార మాధ్యమం సమర్థంగా పని చెయ్యాలంటే, ఏ వ్యక్తులు, సంస్థలు, అధికార శ్రేణుల నుంచి ఎలాంటి ప్రతిబంధకాలూ లేని సుభద్రమైన భావ ప్రకటన స్వేచ్ఛ దానికి ఉండి తీరాలి' అని అంతర్జాలంలో తన పుట్టుపూర్వోత్తరాల్ని ఏకరువుపెడుతూ పీసీఐ గట్టిగా ప్రకటిస్తోంది. చట్టబద్ధమైన, స్వతంత్ర, పాక్షిక న్యాయసంస్థగా పత్రికా స్వేచ్ఛకు రక్షాకవచంగా నిలవాల్సిన పీసీఐ- సుప్రీంకోర్టు విచారణలో ఉన్న 'కశ్మీర్ టైమ్స్' వ్యాజ్యంలో జోక్యం చేసుకొంటూ ఇటీవల వెలగబెట్టిన నిర్వాకం నిశ్చేష్టపరుస్తోంది. జమ్మూకశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి రద్దు, రాష్ట్ర విభజనల దరిమిలా అక్కడ మీడియా స్వేచ్ఛకు సర్కారు సంకెళ్లు వేసింది. ఇంటర్నెట్, టెలీ కమ్యూనికేషన్ సేవల్ని పూర్తిగా నిలిపేసి విలేకరులు, ఫొటో జర్నలిస్టుల రాకపోకలపై తీవ్ర ఆంక్షలు విధించిన నేపథ్యంలో పాత్రికేయులు తమ వృత్తిధర్మాన్ని నిర్వర్తించలేకపోతున్నారంటూ కశ్మీర్ టైమ్స్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ అనురాధా భాసిన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రాజ్యాంగంలోని 14, 19 అధికరణల ద్వారా పాత్రికేయులకు దఖలుపడిన హక్కుల్ని తొక్కిపడుతున్న ఆంక్షల్ని రద్దు చేయాలని అభ్యర్థించారు. ఆ వ్యాజ్య విచారణలో తనకు తానుగా జోక్యం చేసుకున్న పీసీఐ- సమాచార ప్రసార సాధనాలపై ఆంక్షల విధింపు జాతిసమైక్యత సమగ్రతల కోసమేనంటూ భిన్నగళంతో స్పందించింది. పత్రికాస్వేచ్ఛ, జాతి ప్రయోజనాల విషయంలో న్యాయపాలిక సరైన నిర్ణయం తీసుకొనేలా సహకరించేందుకంటూ పీసీఐ ఒలకబోసిన అత్యుత్సాహం- ప్రెస్ కౌన్సిల్ స్థాపిత లక్ష్యంపైనే సమ్మెటపోటుగా పరిణమించింది. పాత్రికేయ స్వాతంత్ర్యానికి గొడుగుపట్టి, తటస్థంగా వ్యవహరించాల్సిన పీసీఐ ప్రభుత్వ విభాగంగా పనిచేస్తోందని ఎడిటర్స్ గిల్డ్ సహా మూడు సంస్థలు సంయుక్త ప్రకటనలో నిరసించాయి. కశ్మీరులో పరిస్థితుల అంచనాకు నలుగురు సభ్యుల నిజనిర్ధారణ బృందాన్ని పంపాలన్న పీసీఐ తాజా నిర్ణయం- గుర్రం ముందు బండికట్టిన చందంగానే అఘోరించింది!

భారత రాజ్యాంగంలోని 19(1) (ఏ) అధికరణ ద్వారా పత్రికా స్వేచ్ఛ పురుడు పోసుకుంది. పత్రికా స్వేచ్ఛ అన్న మాటను రాజ్యాంగం సూటిగా ప్రస్తావించకపోయినా- భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు సంబంధించి వ్యక్తి, పౌరుడు, పత్రికలన్నీ ఒకే గాటన ఉంటాయన్న భారత రత్న అంబేడ్కర్ ప్రకటన- పాత్రికేయానికి దారిదీపమైంది. 'దేశవ్యాప్తంగా న్యాయస్థానాలన్నీ భావప్రకటన స్వేచ్ఛకు గొడుగుపట్టాలి... దాన్ని దెబ్బతీసేందుకు ప్రభుత్వాలు చేసే చట్టాల్ని, చర్యల్ని తోసిపుచ్చడం వాటి ప్రాథమిక విధి' అని మూడు దశాబ్దాల క్రితమే సుప్రీంకోర్టు స్పష్టీకరించింది. సంక్షుభిత పరిస్థితుల్లో నిష్పాక్షిక సంస్థగా ఎలా వ్యవహరించగల వీలుందో జస్టిస్ ఆర్ఎస్ సర్కారియా సారథ్యంలోని పీసీఐ 1990లో ప్రత్యక్ష నిదర్శనగా నిలిచింది. పంజాబు, కశ్మీరుల్లో కల్లోల పరిస్థితులున్నప్పుడు- ఆయా రాష్ట్రాల్లో పత్రికల పాత్ర వాటి పనితీరుపై ఒకటి, పత్రికలతో ప్రభుత్వాధికారుల వ్యవహారశైలిపై మరొకటి- రెండు కమిటీల్ని ఏర్పాటుచేసింది. సైన్యం దురాగతాలకు పాల్పడుతోందంటూ వచ్చిన వార్తల్లో వాస్తవాల్నీ మదింపు వెయ్యాలన్న సైనికాధికారుల విజ్ఞప్తి- నాటి పీసీఐ నిష్పాక్షిక వ్యవహారశైలికి దర్పణంగా నిలిచింది. అలా సమాచార ప్రసార స్వేచ్ఛకు గొడుగుపడుతూ- తటస్థ పాక్షిక న్యాయసంస్థగా కరకు ఆంక్షల చట్రంలో బందీ అయిన పాత్రికేయానికి బాసటగా నిలవాల్సిన పీసీఐ నేడు పూర్తిగా ఒకవైపు మొగ్గి వినిపించిన వాదన ఆలోచనాపరుల్ని కలచివేస్తోంది. సంస్థ సభ్యులతో ఏమాత్రం సంప్రతించకుండానే పీసీఐ తీసుకొన్న వైఖరి మున్నెన్నడూ లేనిది, దురదృష్టకరమైనదని జస్టిస్ పీబీ సావంత్ వంటి మాజీ సారథులూ తృణీకరిస్తున్నారు. ప్రజాస్వామ్యానికి ప్రాణస్పందన అయిన పత్రికా స్వేచ్ఛతో ఈ తరహా రాజీ ధోరణి ఆత్మహత్యా సదృశమవుతుంది!

'పత్రికలు తీవ్ర పదజాలంతో వ్యాఖ్యానం చెయ్యగలిగినప్పుడే (ఒక్కోసారి అవి పరిస్థితుల్ని తప్పుగా చిత్రించినప్పటికీ) పత్రికా స్వాతంత్ర్యానికి నిజంగా గౌరవం దక్కినట్లు'- అని తీర్మానించారు జాతిపిత బాపూజీ. ఆ మహాత్ముడి 150వ జయంత్యుత్సవాలకు సిద్ధమవుతున్న దేశంలో- పత్రికాస్వేచ్ఛకు ఆంక్షల సంకెళ్లను భిన్న వాదనలతో సమర్థించడానికి పీసీఐ లాంటి వ్యవస్థే పూనుకోవడం సమకాలీన దుస్థితి! స్వతంత్రంగా వ్యవహరించేలా పత్రికలకు తోడ్పడటం- 1965నాటి ప్రెస్ కౌన్సిల్ చట్టం ప్రతిపాదించిన మౌలిక లక్ష్యాల్లో మొట్టమొదటిది. ఆ పనిని పీసీఐ కంటే సర్వోన్నత న్యాయపాలికే మరింత సమర్థంగా నిర్వర్తిస్తోంది! 'అత్యున్నత రాజ్యాంగం గల దేశంలో మనం ఉన్నాం... (వ్యక్తి) స్వేచ్ఛకు అది భరోసా ఇస్తోంది' అని రెండున్నర నెలల క్రితం పాత్రికేయుడు కనోజియా కేసులో వ్యాఖ్యానించిన సుప్రీంకోర్టు- వెంటనే బెయిలుపై అతగాడి విడుదలకు నిర్దేశించింది. అధికార దండధరులకు ఎదురాడటమే మహాపరాధమన్న ధోరణి బలంగా పాదుకొని రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కుల కోసం పదేపదే సుప్రీంకోర్టు శరణుకోరాల్సిన దురవస్థ- పౌరుల్ని పత్రికల్ని ఒక్కతీరుగా బాధిస్తోంది. పత్రికా స్వాతంత్ర్య సూచీలో మొత్తం 180 దేశాల జాబితాలో ఇండియా పోయినేడు రెండు స్థానాలు దిగజారి 140వ స్థానానికి చేరింది. పరోక్షంగా పీసీఐ పనిపోకడలకు నిదర్శనే ఇది. తన ప్రజాస్వామిక హక్కుల కోసం 'సుప్రీం'ను ఆశ్రయించిన 'కశ్మీర్ టైమ్స్'కు సంఘీభావం సంగతి దేవుడెరుగు- న్యాయనిర్ణయంలో కోర్టుకు సాయం చేస్తానంటూ పత్రికాస్వేచ్ఛ పీక నులిమే వాదనకు శ్రుతి చేసిన పీసీఐ- స్వీయ నిష్ప్రయోజకత్వాన్ని, అంతకుమించి దివాలాకోరుతనాన్నే ఎండగట్టుకొంది!

---

అమలులో లేని చట్టాలను రద్దు చేసేందుకు మోదీ సర్కారు నడుంకట్టింది. గత అయిదేళ్లలో 250కి పైగా వ్యర్థ చట్టాలను రద్దు చేసింది. అదే సమయంలో చట్టాల్లోని సంక్లిష్టతలను తొలగించి, వాటిని సులభతరం చేసే ప్రక్రియనూ ప్రారంభించింది. శ్రమజీవులకు మేలు చేసే కార్మిక చట్టాలపై దృష్టి సారించింది. దీనికి సంబంధించి నాలుగు చట్టాల స్థానంలో ఒకే చట్టాన్ని తీసుకువచ్చింది. వేతనాల చట్టం-1936, కనీస వేతనాల చెల్లింపుల చట్టం-1948, బోనస్ చెల్లింపుల చట్టం-1965, సమాన ప్రతిఫలం చెల్లింపుల చట్టం-1976 స్థానంలో వేతనాల కోడ్-2019ను రూపొందించింది. దీనికి పార్లమెంటు ఉభయ సభలు ఆమోదం తెలపడంతో న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక చట్టాలు సాలెగూళ్లలా తయారయ్యాయి. కేంద్రానికి చెందిన 40 కార్మిక చట్టాలు ఉన్నాయి. రాష్ట్రానికి సంబంధించినవి వందకుపైగా ఉన్నాయి. దీంతో ఏ చట్టం కింద తమకు న్యాయం దక్కుతుందో తెలియక దిక్కుతోచని పరిస్థితిని కార్మికులు ఎదుర్కొంటున్నారు. వాజ్‌పేయీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలోనే చట్టాల




మహిళలకు అవకాశం కల్పించాలి. బోర్డు ఛైర్మన్‌ను కేంద్రం నియమిస్తుంది. నిర్దిష్ట కాలపరిమితిలో వేతనాల నిర్ణయానికి, సవరణకు, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం తదితర అంశాల్లో సలహాలు ఇవ్వడానికి ఈ బోర్డును ఏర్పాటు చేస్తుంది. ఇదే తరహాలో రాష్ట్ర ప్రభుత్వం సలహా బోర్డులను ఏర్పాటు చేయవచ్చు. భిన్నమైన అంశాలపై అధ్యయనం చేయడానికి ఒకటి లేదా అంతకంటే ఎక్కువ బోర్డులనూ ఏర్పాటు చేయవచ్చు.

### కార్మికులకు రక్షణలు

పాత చట్టాల్లో కార్మికులకు గల రక్షణలు కొత్త చట్టంలోనూ ఉన్నాయి. నైపుణ్యం, నైపుణ్యంలేని, సాంకేతిక, నిర్వహణ, గుమస్తా, పాలన వ్యవహారాలు చూసే మేనేజర్లు, సూపర్‌వైజరుసహా కార్మికులకు నిర్వచనం ఇచ్చింది. అప్రెంటిస్ చట్టం 1961 సెక్షన్ 2(ఎఎ) నిర్వచనం కింద వచ్చే వారిని మినహాయించింది. కాంట్రాక్టరు, సబ్ కాంట్రాక్టర్లనూ యజమాని పరిధిలోకి తీసుకువచ్చింది. కార్మికుల విభాగంలోకి వచ్చే అంశానికి

# నిబంధనల సరళీకరణతో సాంత్వన

సంఖ్యను తగ్గించేందుకు ప్రయత్నాలు జరిగాయి. దేశంలోని అన్ని కార్మిక చట్టాలను కుదించి నాలుగు కోడ్‌లుగా తీసుకురావాలని నాటి ప్రభుత్వం భావించింది. ఇందుకు సంబంధించి రెండో జాతీయ కార్మిక కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిటీ అధ్యయనం చేసి నివేదిక సమర్పించింది. రష్యా, జర్మనీ, హంగేరి, పోలండ్, కెనడాల్లో మాదిరిగా ఒకే చట్టాన్ని తీసుకురావాలని 2002కు ముందే కేంద్రానికి జాతీయ కార్మిక కమిషన్ సూచించింది. అప్పట్లో ఈ సూచన అటకెక్కింది. సుదీర్ఘకాలం తరవాత నాటి సూచన నేడు కార్యరూపం దాల్చింది.

### ప్రయోజనాలెన్నో...

నాలుగు చట్టాలను రద్దుచేస్తూ తీసుకువచ్చిన కొత్త చట్టంవల్ల అటు యాజమాన్యాలకు, ఇటు కార్మికులకు ప్రయోజనం కలగనుంది. దేశంలో అసంఘటిత రంగానికి చెందిన కార్మికులే ఎక్కువమంది ఉన్నారు. గతంలో ఉన్న కనీస వేతనాల చట్టం పరిధిలోకి 60 శాతం కార్మికులైనా వచ్చేవారు కారు. కొత్త చట్టంతో సుమారు 50 కోట్ల మంది కార్మికులు కనీస వేతనాల ప్రయోజనాలు పొందనున్నారు. ఉద్యోగ, ఉపాధి రంగాలకు సంబంధించి కేంద్రం పరిధిలో వ్యవసాయం, గనుల తవ్వకాలతో కలిపి 45, రాష్ట్రాల పరిధిలో 1,709 రంగాలు ఉన్నాయి. గతంలో 33 శాతం కార్మికులకు 2009-10లో నిర్ణయించిన జాతీయ కనీస వేతనం కంటే తక్కువగా చెల్లింపులు జరిగేవి. కనీస వేతనాల చట్టం పరిధిలో షెడ్యూల్డ్ ఎంప్లాయ్‌మెంట్ కింద నిర్వచనంలోకి రావడం క్లిష్టంగా ఉండేది. కార్మికులు పనిచేసే సంస్థ నోటిఫై అయి ఉండాలి. ప్రతి కొత్త సంస్థను నోటిఫై చేయడానికి ఆచరణలో ఇబ్బందులు ఉండేవి. కొత్త చట్టంలో అలాంటి ఇబ్బందులు లేవు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు ఫ్యాక్టరీ, సంస్థ, ఇతరత్రా ఎక్కడ పనిచేసే కార్మికులకైనా కొత్త వేతన చట్టం కింద కనీస వేతనం వర్తిస్తుంది. ఇది జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనిచేసే వారికి వర్తించదు. గతంలో ఉన్న చట్టాల ఆధారంగా వృత్తి, నైపుణ్యస్థాయి, అక్కడున్న భౌగోళిక పరిస్థితుల ఆధారంగా కనీస వేతన నిర్ణయం జరిగేది. కొత్త చట్టం ద్వారా నైపుణ్యం, భౌగోళిక పరిస్థితులను, కష్టాన్ని అంచనా వేసి నిర్ణయం జరుగుతుంది. గతంలో ఉన్న పని రకాన్ని బట్టి వేతనాన్ని నిర్ణయించే విధానం రద్దయింది. అనుభవాన్ని ఆధారంగా తీసుకుని కనీస వేతన నిర్ణయం జరుగుతుంది. ఈ చట్టం కింద స్వతంత్ర వ్యక్తులతో కేంద్ర, రాష్ట్ర స్థాయుల్లో కమిటీ ఏర్పాటవుతుంది. ఒకటి లేదా అంతకంటే ఎక్కువ కమిటీలను ఏర్పాటు చేయవచ్చు. వీటిలో యాజమాన్య, కార్మిక వర్గాలకు చెందినవారితోపాటు స్వతంత్ర వ్యక్తులూ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీలు అధ్యయనం, విచారణ చేపట్టి కనీస వేతనం ప్రతిపాదనలను సిద్ధం చేయవచ్చు. ఈ ప్రతిపాదనలను ప్రకటించి, ఎవరైతే ప్రభావితులవుతారో వారి నుంచి అభ్యంతరాలు స్వీకరించవచ్చు. అన్నింటినీ పరిశీలించాక రాష్ట్ర ప్రభుత్వం నోటిఫై చేస్తుంది. ఒక వ్యక్తి కనీస జీవన ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని కనీస వేతనాన్ని నిర్ణయించే అధికారం కేంద్రానికి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించే కనీస వేతనం, కేంద్రం నిర్ణయించిన దానికంటే తక్కువ ఉండరాదు. జాతీయ కనీస వేతనాలను నిర్ణయించే అధికారం కేంద్రానికి ఉంది. భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా ఒక్కో రాష్ట్రానికి ఒక్కో విధంగా వేతనాలను నిర్ణయించవచ్చు. జీవన వ్యయం ప్రాతిపదికన ప్రభుత్వాలు అయిదేళ్ల వ్యవధిలో కనీస వేతనాన్ని సవరించవచ్చు. ప్రభుత్వాలు నిర్ణయించిన కనీస వేతనం కంటే తక్కువ వేతనాన్ని ఏ యజమానీ చెల్లించరాదు. వేతన చెల్లింపుల్లో లింగ దుర్విచక్షణను కొత్త చట్టం నిషేధించింది. స్త్రీ, పురుషులతోపాటు ట్రాన్స్‌జెండర్లకు ఒకే రకమైన వేతనం చెల్లించాల్సిందే. పని కల్పించడంలో యజమాని లింగ దుర్విచక్షణ చూపరాదు. ప్రత్యేకంగా ప్రభుత్వం మహిళలను ఏదైనా చట్టం కింద నియంత్రించినా, నిషేధిస్తే తప్ప అందరికీ సమానంగా పనిలో అవకాశాలు కల్పించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో కేంద్ర సలహా బోర్డును ఏర్పాటు చేయడానికి చట్టం అవకాశం కల్పించింది. యజమానులు, ఉద్యోగులు, స్వతంత్ర అభ్యర్థులతోపాటు రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన వారినీ కేంద్రం ఈ బోర్డుకు నామినేట్ చేయవచ్చు. బోర్డులో మూడో వంతు సభ్యులుగా

**సంక్లిష్టతలను తొలగించే వేతన చట్టం**



సంబంధించి కేంద్రం సవరణ తీసుకువచ్చింది. మేనేజర్లు, సూపర్‌వైజర్లు కార్మికుల విభాగంలోకి రారు. వివాదాల పరిష్కారానికి గెజిటెడ్ స్థాయి అధికారికి తగ్గకుండా ఒకటి లేదా ఎక్కువ అథారిటీలను ఏర్పాటు చేయవచ్చు. బోనస్ చెల్లింపుపై యాజమాన్యానికి, సిబ్బందికి మధ్య వచ్చే వివాదంలో అథారిటీ ఇచ్చిన ఉత్తర్వులపై అభ్యంతరాలు ఉంటే సెక్షన్ 45 కింద ప్రభుత్వం ఏర్పాటు చేసిన అప్పిలేట్ అథారిటీలో 90 రోజుల్లో అప్పీలు చేసుకోవచ్చు. దీన్ని మూడు నెలల్లో పరిష్కరించాలి. పరిహారం చెల్లించడానికి అథారిటీ ఆదేశాలు ఇవ్వవచ్చు. కనీస వేతనాన్ని పరిగణనలోకి తీసుకుని పరిహారం చెల్లింపు ఆదేశాలు వెలువరించాలి. ఈ చట్టం కింద 'ఇన్‌స్పెక్టర్ కమ్ ఫెసిలిటేటర్'ను నియమించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంది. వేతన చట్టం, అందులోని నిబంధనల గురించి యాజమాన్యం, కార్మికులకు అవగాహన కల్పించే బాధ్యతను 'ఫెసిలిటేటర్' తీసుకుంటారు. కార్మికులు తమకు ఎదురయ్యే ఇబ్బందులపై ఆయనను ఆశ్రయించవచ్చు. 'ఫెసిలిటేటర్' ఆయా సంస్థల యాజమాన్యంతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సోదాలు, తనిఖీలు, ఈ-తనిఖీలు నిర్వహించవచ్చు. రికార్డులను స్తంభింపజేసే అధికారమూ 'ఫెసిలిటేటర్'కు ఉంటుంది. ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనం కంటే తక్కువ చెల్లిస్తున్నట్లయితే రూ.50 వేల వరకు జరిమానా ఉంటుంది. అయిదేళ్లలో తిరిగి ఇదే నేరానికి పాల్పడితే మూడు నెలల వరకు జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా లేదా రెండూ విధించవచ్చు. చట్టంలోని ఇతర నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే రూ.20 వేల వరకు జరిమానా, రెండోసారి పాల్పడితే నెల జైలుశిక్ష, రూ.40 వేల జరిమానా విధించవచ్చు. కనీస వేతనాన్ని ఏ రకంగా లెక్కించాలనే అంశంపై చట్టంలో స్పష్టంగా పేర్కొనలేదు. ఆర్థికంగా గిట్టుబాటు కాని కొన్నింటిలో 'యూనిట్ రేట్' ప్రకారం చెల్లింపులు ఉంటాయి. గతంలో సమస్యల పరిష్కారానికి ఉమ్మడి సంప్రతింపులు ఉండేవి. ప్రస్తుత చట్టం కింద ఆ అవకాశం లేదు. దీంతో కార్మిక సంఘాల పాత్ర పరిమితంగానే ఉంటుంది. యాజమాన్యమే చట్టప్రకారం సమస్యను పరిష్కరించాల్సి ఉండటంతో కార్మిక సంఘాల జోక్యం తక్కువేనన్న అభిప్రాయం ఉంది. మొత్తం మీద కొత్త చట్టంతో కార్మికులకు కొంత వెసులుబాటు లభించనుంది!

**- దండు నారాయణరెడ్డి**

### బిల్లు చట్టమైన క్రమం...

| | | |
|---|---|---|
| 2015 మార్చి | : | ముసాయిదాపై చర్చించడానికి సమావేశం |
| మార్చి 21 | : | ప్రజాభిప్రాయ సేకరణ. 30 రోజుల గడువు. |
| ఏప్రిల్ 13 | : | రెండోసారి సమావేశం |
| 2017 ఆగస్టు 10 | : | లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టారు |
| ఆగస్టు 21 | : | స్థాయీసంఘం పరిశీలనకు |
| 2018 డిసెంబరు 18 | : | స్థాయీసంఘం నివేదిక సమర్పణ పదహారో లోక్‌సభ రద్దు కావడంతో బిల్లు రద్దు. |
| 2019 జులై 30 | : | వేతనాల బిల్లుకు లోక్‌సభ ఆమోదం |
| ఆగస్టు 2 | : | రాజ్యసభ ఆమోదం |
| ఆగస్టు 8 | : | గెజిట్ నోటిఫికేషన్ జారీ |

---

# ఆచితూచి వేయాలి అడుగు

ఆయుధ ఉత్పత్తుల్లో దేశీయ పరిజ్ఞానానికి పెద్దపీట వేయాల్సిన అవసరాన్ని పదహారో లోక్‌సభ చివర్లో రక్షణ రంగంపై నియమితమైన పార్లమెంటరీ స్థాయీ సంఘం నొక్కిచెప్పింది. ఆయుధోత్పత్తి కర్మాగారాలు(ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలు) సుదీర్ఘకాలంగా భారతీయ సేనావాహినికి సేవలందిస్తున్నాయి. ఇతర రక్షణోత్పత్తి సంస్థలతో పోలిస్తే భారతీయ ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీల్లో దేశీయ పరిజ్ఞానానికే ప్రాధాన్యం దక్కుతోంది. ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీల ఉత్పత్తి అవసరాలకోసం 2016-17లో విదేశాలనుంచి దిగుమతి చేసుకున్న దిగుమతుల పరిమాణం 11.79 శాతం. 2013-14లో అది 15.15శాతం. ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలకోసం చేసుకుంటున్న విదేశీ దిగుమతుల పరిమాణం క్రమంగా తగ్గుతోందనడానికి ఇది నిదర్శనం. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ లేదా భారత్ డైనమిక్స్ లిమిటెడ్ వంటి ప్రభుత్వరంగ సంస్థలతో పోలిస్తే ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలకోసం చేసుకుంటున్న విదేశీ దిగుమతులు బాగా తక్కువ. చాలావరకు దేశీయ పరిజ్ఞానంతోనే ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీల్లో ఆయుధోత్పత్తులు చేస్తున్నారు. ప్రధాన యుద్ధ ట్యాంకులు, పదాతిదళ పోరాట వాహనాలు, ప్రత్యేక సాయుధ వాహనాలు, ఫిరంగి తుపాకులు, వాయు రక్షణ తుపాకులు, రాకెట్ లాంచర్లు వంటివి ఈ ఫ్యాక్టరీల్లో తయారవుతాయి. భారత్ 1947, 1962, 1965, 1999ల్లో యుద్ధాల్లో పాల్గొంది. ఆయా సందర్భాల్లో దేశీయ ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలు భారత సైన్యానికి అద్భుతమైన తోడ్పాటు అందించాయి. రక్షణ శాఖ ఆధ్వర్యంలోని ఏ వ్యవస్థలతో పోల్చినా ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలకే అతి తక్కువ నిధుల తోడ్పాటు అందుతోంది. 2019-20 ఆర్థిక సంవత్సరానికి ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలకు ఇచ్చింది రూ.50.58 కోట్లు మాత్రమే. అవి తమ ఉత్పత్తులను ఆర్మీ, నౌకా, వైమానిక దళాలకు సరఫరా చేస్తున్నాయి. తద్వారా తమ నిర్వహణకు అవసరమైన మేర ఆదాయం సమకూర్చుకుంటున్నాయి. కార్గిల్ యుద్ధంలో సైన్యానికి అవసరమైన ఆయుధాలను సకాలంలో సరఫరా చేయడం ద్వారా ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలు దేశ రక్షణకు చేసిన కృషి మరువలేనిదని భారత ఆర్మీ ఒకప్పటి అధిపతి జనరల్ వీపీ మాలిక్ వ్యాఖ్యానించారు. మరోవంక విదేశాలనుంచి దిగుమతి చేసుకున్న సరకు అవసరానికి అందుబాటులోకి రాలేదని, తద్వారా తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామనీ ఆయన చెప్పడం ఈ సందర్భంగా గమనార్హం.

మలిదశ ఎన్డీయే తొలి వంద రోజుల పాలనలో పీఎస్‌యూల నుంచి పెట్టుబడుల ఉపసంహరణకు సంబంధించి మోదీ సర్కారు ఎన్నో ప్రతిపాదనలు తీసుకువచ్చింది. ఆ క్రమంలోనే ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలు వంటివాటి కార్పొరేటీకరణ దిశగా అడుగులు పడుతున్నట్లు 'నీతి ఆయోగ్' ఉపాధ్యక్షుడు రాజీవ్ కుమార్ ఇటీవల వెల్లడించారు. ఆయుధోత్పత్తి కర్మాగార బోర్డు



### ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీల ప్రైవేటీకరణ

ఒక్కదానికే 60వేల ఎకరాలమేర స్థలం ఉంది. దేశంలోని 40కిపైగా ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించడమో లేదా వాటిని పూర్తిగా మూసివేసే దిశగానో వడివడిగా అడుగులు పడుతున్నాయి. అందులో భాగంగానే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులపై గరిష్ఠ పరిమితిని ఎత్తివేసే సూచనలూ కనిపిస్తున్నాయి. గడచిన అయిదేళ్ల కాలంలో 'ఎయిర్ ఇండియా' వంటివి పతనావస్థలోకి జారుకున్నాయి. యుద్ధ సమయాల్లో సైన్యానికి సరిపడా ఆయుధ సామగ్రిని అందించేందుకు ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలు నిత్యం సన్నద్ధంగా ఉండాలి. అందుకోసం ఖాళీ సమయాల్లో ఆ ఫ్యాక్టరీల సామర్థ్యానికి పదును పెడుతూ ఉండాలి. ఆ రకంగా జాతీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఈ తరహా పీఎస్‌యూలను పరిరక్షించుకోవడం చాలా అవసరం.

కార్గిల్ యుద్ధ సమయంలో రూ.2,150 కోట్ల విలువైన ఆయుధ సరఫరాలకోసం దేశీయ, ప్రైవేటు కంపెనీలకు ఆర్డర్లు పెట్టగా- అందులో రూ.1,762 కోట్ల విలువైన సరఫరాలు 1999 జులై నాటికి సంఘర్షణలు సద్దుమణిగాక గాని అందుబాటులోకి రాలేదని కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక వెల్లడించింది. అత్యవసరం కాబట్టి ఆ సమయంలో ఆయుధాలు, ఇతర సామగ్రి నాణ్యతపై కొంత రాజీపడాల్సిన పరిస్థితులూ తలెత్తాయి. తద్వారా ప్రభుత్వానికి రూ.300 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు ఆ నివేదిక స్పష్టీకరించింది. మరోవంక- ఆ సందర్భంలో సుమారు రూ.350 కోట్ల మేర అవసరమైన దానికన్నా అధికంగా కొనుగోళ్లు జరిపారు. బయటినుంచి వచ్చిన ఆ సామగ్రి అంతా దేశీయ ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీల్లో బ్రహ్మాండంగా అందుబాటులో ఉన్నదే కావడం గమనించాల్సిన విషయం. నాణ్యత, సామర్థ్యాలపరంగా ప్రైవేటు రంగాన్ని నెత్తికెత్తుకునేవారు గమనించాల్సిన విషయాలివి. ఈ ఏడాది మొదట్లో హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సంస్థ తన ఉద్యోగులకు జీతాలు చెల్లించేందుకు సైతం అప్పులు చేయాల్సిన దుస్థితిని చరిత్రలో మొట్టమొదటిసారిగా ఎదుర్కొంది. దేశీయ బీమా రంగంలో మూడింట రెండొంతుల మార్కెట్ వాటా ఉన్న 'ఎల్ఐసీ'పై ఒత్తిడి తీసుకువచ్చి- 28 శాతం అప్పుల్లో మునిగి నిండా కష్టాల్లో ఉన్న ఐడీబీఐ వంటి ప్రభుత్వరంగ బ్యాంకును దాని చేత కొనుగోలు చేయించారు. ఫలితంగా 'ఎల్ఐసీ'పై ఆర్థికపరమైన ఒత్తిడి పెరిగింది. ఫలితంగా పెట్టుబడులను ఆకర్షించి ఆర్థిక సత్తువ పెంచుకునే క్రమంలో ఆ సంస్థ షేర్ మార్కెట్లోకి కాలుమోపింది. ప్రైవేటు పెట్టుబడులు ఆశించిన స్థాయిలో రానిపక్షంలో పీఎస్‌యూలపై భారం పెంచడం సరికాదు. ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణపై సహేతుక విధానాలను అందిపుచ్చుకోవాల్సిన తరుణమిది.

**- సందీప్ పాండే**

(రచయిత- రామన్ మెగసెసే పురస్కార గ్రహీత)

---

## ఈనాడు లేఖలు

### నకిలీ వైద్యులను అడ్డుకోవాలి

భారతీయులు తమ సంపాదనలో వైద్యానికే అధిక శాతం కేటాయిస్తున్నారని పలు సర్వేలు చెబుతున్నాయి. అయినా నాణ్యమైన వైద్యం మాత్రం అందడంలేదు. మరోవైపు అర్హత లేనివారు డాక్టర్లుగా చలామణీ అవుతున్నారు. గ్రామాల్లో రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్లు కూడా శస్త్రచికిత్సలు చేస్తున్న సందర్భాలున్నాయి. పరిస్థితి వారి చేయి దాటిపోయినప్పుడు ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లాల్సిందిగా రోగులకు సూచిస్తారు. నకిలీ సర్టిఫికెట్లతో వైద్యం అందించేవారు, అరకొర వసతులతో ఆస్పత్రులను నిర్వహించేవారిని అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టంలో సవరణలు తేవడం ముదావహం. ఈ చట్టాన్ని పటిష్ఠంగా అమలు పరచి, వైద్యరంగంలో నెలకొన్న పెడధోరణులకు కళ్లెం వేస్తే ఎందరో పేదలకు న్యాయం జరుగుతుంది.

- మహమ్మద్ షరీఫ్, మెహిదీపట్నం, హైదరాబాద్

### అడవుల సంరక్షణ అనివార్యం

పుడమికి ఊపిరితిత్తుల్లా వ్యవహరించే అమెజాన్ అడవులను అగ్ని దహించివేస్తోంది. ప్రపంచ మానవాళికి అవసరమైన ప్రాణవాయువులో 20 శాతం అమెజాన్ అడవులే అందిస్తున్నాయి. వ్యవసాయం, పశువుల పెంపకం, గనుల తవ్వకం వంటి కార్యకలాపాలతో పాటు, ట్రాన్స్-అమెజానియన్ హైవే నిర్మాణంతో ఈ అటవీప్రాంతం అయిదోవంతు కుంచించుకుపోయింది. అడవులను నిర్లక్ష్యం చేయడంవల్ల ఎదురయ్యే తీవ్ర పరిణామాలను ప్రకృతి వైపరీత్యాల రూపంలో చవిచూస్తూ కూడా ఇంకా మానవ సమాజం ధోరణి మార్చుకోకపోతే, భావి తరాలకూ ముప్పు తప్పదు. రాష్ట్రంలోనూ నల్లమల అడవులకు 'యురేనియం అన్వేషణ, క్వార్ట్జ్ తవ్వకాల' పేరిట ముప్పు పొంచి ఉంది. ప్రభుత్వం ఈ ప్రయత్నాలను వెంటనే ఉపసంహరించుకుని, అడవుల పరిరక్షణకు పూనుకోవాలి.

- కె.రాజ్‌కుమార్, జనగామ

---

## వేద సందేశం

శ్రీమన్నారాయణుడు తన నాభీకమలం నుంచి జన్మించిన బ్రహ్మకు వేదాలను అందించాడని, పరమాత్మ నిశ్వాసం నుంచి వేదాలు ఆవిర్భవించాయని పురాణ కథనం. అందుకే వేదాలను 'అపౌరుషేయాలు' అన్నారు. వ్యక్తి నిర్మాణం, బుద్ధివికాసం, తపోసాధన, యంత్రాంగం మొదలైన వివరాలు వేదాల్లో ఉన్నాయి. వేదాల్లో లేనిది ఎక్కడా లేదు. చరాచర జగత్తు మనుగడకు ఆధారభూతమైనవి వేదాలే. అసంఖ్యాకంగా ఉన్న వేదాలను వేదవ్యాస మహర్షి అధ్యయన సౌలభ్యం కోసం రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణవేదం అనే పేర్లతో నాలుగుగా రూపొందించాడు.

'రుక్' అనే శబ్దానికి 'దేవతాస్తుతి' అని అర్థం. రుగ్వేదంలోని సూక్తాలన్నీ వివిధ దేవతలను ఉద్దేశించి చేసిన స్తుతులే. జగత్తు అంతా వివిధ రూపాల్లో ఉన్న పరమేశ్వర తత్వమేనని రుగ్వేదమంత్రం సుస్పష్టం చేస్తోంది. దీంతో పాటు మానవుడి ధర్మాచరణను గురించీ అనేక సూత్రాలను వ్యక్తం చేస్తోంది. గృహిణి చక్కని సతీలక్షణాలు కలిగి, పతితో విరోధించక ప్రసన్నురాలై ఉండాలని ప్రబోధించింది. దేశపరిపాలన, సామాజిక సంస్కరణలు, ప్రభుత్వ కార్యకలాపాలను నిర్వహించడంలో ముందుండాలని సూచిస్తోంది. పిత్రార్జితంలో పుత్రుడితోపాటు పుత్రికకూ సమాన హక్కుందని చెబుతోంది. మైత్రేయి, గార్గి, లోపాముద్ర వంటి దాదాపు 30 మందికి పైగా మంత్రద్రష్టలైన స్త్రీలను ఉదాహరించింది. సకల జీవకోటిని సంరక్షించాలని సూర్యచంద్రులను ఆరాధించాలని, సువృష్టి కలిగించమని ఇంద్రుణ్ని ప్రార్థించాలని, యాగాలను స్వీకరించి అనుగ్రహించాలని అగ్నిదేవుణ్ని అభ్యర్థించాలని, సప్తసింధు స్వరూపిణి అయిన సరస్వతిని విద్యను ప్రసాదించి, సమరంలో విజయాన్ని ప్రసాదించమని వేడుకోవాలని రుగ్వేదం బోధిస్తోంది.

రెండోది యజుర్వేదం. 'యజ్' అనే ధాతువుకు దేవపూజదానాదులని అర్థం. ఇది శుక్లయజుర్వేదం, కృష్ణయజుర్వేదం అని రెండు విభాగాలుగా ఉంది. యజుర్వేదం కర్మకాండకు ప్రాధాన్యమిస్తోంది. ఈ కర్మల్లో యజ్ఞం ప్రధానమైంది. యజ్ఞంద్వారా అగ్నిదేవుణ్ని సంతృప్తిపరచగలిగితే సకాలవృష్టి కలిగి పంటలు బాగా పండుతాయని, యజుర్వేద పండితులచేత వరుణజపం చేయించాలని ఈ వేదం సూచిస్తోంది.



'సామ'పదానికి 'గాన'మని అర్థం. రుగ్వేద మంత్రాలను గానఫణితిలో గానం చేసినప్పుడు వాటిని 'సామ'లంటారు. వేదాల్లో తాను సామవేదాన్ని అన్నాడు గీతాచార్యుడు. ఈ వేదంలో అగ్ని, ఇంద్ర, సోమ, ఉషస్సు, సూర్య, విష్ణువు, రుతువు, పురుషుడు (పరమాత్మ) స్తుత్యులు. సామగానం చాలా కష్టతరమైంది. ఎంతో సాధన, శ్రమ చేస్తేగానీ ఇది అలవడదు. సంగీతంతో ఆ స్తుత్యుల్ని సంతృప్తిపరచడం ఈ సామవేద లక్ష్యం. 'ఇంద్రుడు, గరుత్మంతుడు, బృహస్పతి సదా మమ్ము కాపాడుతూ, మాకు చల్లని చూపు ప్రసాదింతురు గాక!' అన్న శాంతి మంత్రంతో సామవేదం పరిసమాప్తమవుతుంది.

యజ్ఞనిర్వహణలో అథర్వవేదజ్ఞానిది ఉన్నత స్థానం. యజ్ఞాచరణకు ప్రధానంగా బ్రహ్మ, అధ్వర్యుడు, హోత, ఉద్గాత అనే నలుగురు రుత్విక్కులుంటారు. వీరిలో బ్రహ్మ అథర్వ వేదజ్ఞాతై ఉండాలి. రుగ్వేద యజుర్వేద సామవేదాల్లోని ప్రధాన దేవతల ప్రస్తావన ఇందులో ఉంది. ఆయుష్షును, కీర్తిని, తేజస్సును వృద్ధిపరచే మంత్రాలు, వివిధ వ్యాధులను నిర్మూలించే ఔషధాలు, చికిత్సలకు సంబంధించిన చిట్కాలు, శత్రుత్వ నివారణ, సంఘీభావ సాధన గ్రామస్థాయి నుంచి, దేశస్థాయి వరకు ప్రగతిని సాధించే ప్రణాళికలు ఈ వేదంలో ఉన్నాయంటారు. ఖగోళ, జ్యోతిశ్శాస్త్రాదులకు, వైద్యవిద్యకు పునాదివంటిది ఈ వేదం. ఇందులోని పృథ్వీసూక్తం దేశభక్తిని ప్రేరేపిస్తుంది. వేదాలందించే సందేశాలన్నీ విశ్వకల్యాణానికి మూలమంత్రాలు, మానవకోటికి అనుసరణీయాలు!

**- చిమ్మపూడి శ్రీరామమూర్తి**

అంతర్యామి

# క్యూనెట్ కథ ముగిసినట్లేనా?

- సంస్థ కార్యకలాపాల నివేదిక రూపొందించిన ఆర్వోసీ
- బెంగళూరు ఎన్‌సీఎల్‌టీలో పిటిషన్ దాఖలు
- సంస్థలో చేరి మోసపోవద్దంటున్న సైబరాబాద్ కమిషనర్

ఈనాడు - హైదరాబాద్

నిషేధిత గొలుసుకట్టు వ్యాపారం ద్వారా వినియోగదారులకు కుచ్చుటోపీ పెడుతోందనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రముఖ సంస్థ విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (క్యూనెట్ అనుబంధ సంస్థ) కథ ముగించే దిశగా యత్నాలు సాగుతున్నాయి. సంస్థ నిర్వాహకులు తమను మోసగించారని కొద్దిరోజుల క్రితం ఫిర్యాదులు అందుకున్న సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం పోలీసులు తీగ లాగడంతో అక్రమ డొంక కదిలిన విషయం తెలిసిందే. 38 కేసుల దర్యాప్తు క్రమంలో 70 మందిని అరెస్టు చేసిన పోలీసులు బెంగళూరులోని సంస్థ గోదామును జప్తు చేయడంతో పాటు



కమిషనర్ వీసీ సజ్జనార్ నుంచి ప్రశంస పత్రం అందుకుంటున్న క్యూనెట్ కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన ఏసీపీ రాఘవేంద్రరెడ్డి. చిత్రంలో క్రైమ్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని

సంస్థ బ్యాంకు ఖాతాల్లోని రూ.2.7 కోట్ల నగదును స్తంభింపజేశారు. మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ (ఎంసీఏ) తదితర కీలక సంస్థలకు సమాచారం అందించడంతో కదలిక వచ్చింది. ఎంసీఏ ఆదేశాలతో రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్వోసీ) ఇటీవల తనిఖీ నివేదిక రూపొందించింది. దీని ఆధారంగా సంస్థ కార్యకలాపాలకు ముగింపు పలికేందుకు బెంగళూరులోని జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)లో పిటిషన్ దాఖలు చేయాలని బెంగళూరు ఆర్వోసీని.. ఎంసీఏ ఆదేశించింది. కొందరు సంస్థ కీలక ప్రతినిధులు దేశం విడిచి వెళ్లకుండా లుక్ అవుట్ నోటీసులు జారీ చేసింది. సైబరాబాద్ కమిషనర్ వీసీ సజ్జనార్ మంగళవారం విలేకరుల సమావేశంలో సంస్థ పూర్వాపరాలు, తనిఖీ నివేదికలోని అంశాలను వెల్లడించారు.

**హైదరాబాద్ ఆర్వోసీ తనిఖీ నివేదిక ప్రకారం**

- విహాన్ డైరెక్ట్ సెల్లింగ్స్ సంస్థ నిషేధిత గొలుసుకట్టు వ్యాపారాన్ని నిర్వహిస్తోంది. గోల్డ్‌క్వెస్ట్, క్వెస్ట్‌నెట్ సంస్థల తాజా అవతారమే విహాన్. పిరమిడ్ స్కీముల పేరుతో లాభాలు ఇస్తామంటూ ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించింది. బహుమతులు, ఈ-కూపన్లు, విహారయాత్రల పేరిట పెట్టుబడులు తీసుకుని హామీ నెరవేర్చలేదు.
- క్యూనెట్.. భారత్‌లో 2001 నుంచి గోల్డ్‌క్వెస్ట్, క్వెస్ట్‌నెట్, పల్లవ రిసార్ట్స్ పేర్లతో వ్యాపారాలు నిర్వహించింది. 2011 నుంచి విహాన్, ట్రాన్స్‌వ్యూ ఎంటర్‌ప్రైజెస్, వనమాల హోటల్స్, ట్రావెల్స్, టూరిజం సర్వీసెస్ పేర్లతో కార్యకలాపాలు సాగిస్తోంది.
- క్యూనెట్ తన డిపాజిట్‌దారులకు అంటగడుతున్న వస్తువుల ధరల్ని అపరిమితంగా పెంచేసింది. వైరోస్ ది రేసర్ వాచ్ బ్లాక్‌ను సంస్థ రూ.10,856కు కొన్నట్లు కార్యాలయ రికార్డుల్లో ఉంది. అదే వాచ్‌ను సభ్యులకు ఇచ్చినప్పుడు రూ.56,049గా పేర్కొంది.
- సంస్థలో సభ్యులుగా చేరినవారు నెలలోపు సభ్యత్వం రద్దు చేసుకుంటే డబ్బు తిరిగివ్వాలనే నిబంధనను సంస్థ ఉల్లంఘించింది.

**ఆర్థిక వ్యవస్థ ధ్వంసం: వీసీ సజ్జనార్, సైబరాబాద్ కమిషనర్**

విహాన్ సంస్థ కార్యకలాపాల్ని నిలిపేసేందుకు ఎంసీఏ ప్రొసీడింగ్స్ ప్రారంభించింది. డైరెక్ట్ సెల్లింగ్, మల్టీ లెవల్ మార్కెటింగ్, నెట్‌వర్క్ మార్కెటింగ్, రెఫరల్ మార్కెటింగ్, ఇంట్రొడక్షన్ మార్కెటింగ్.. తదితర పథకాల పేరుతో కొనసాగే పథకాల్లో ఎవరూ చేరొద్దు. ఈ తరహా అక్రమ వ్యాపారాలు దేశ ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేస్తాయి.

**ఆర్వోసీ నివేదికను సవాల్ చేస్తాం: రిషీ చండియాక్, దక్షిణాసియా ప్రాంతీయ సంచాలకుడు, క్యూనెట్**

క్యూనెట్ కార్యకలాపాలపై కర్ణాటక ఆర్వోసీ ఇచ్చిన నివేదికను న్యాయస్థానంలో సవాల్ చేస్తాం. మా సంస్థలో డిస్ట్రిబ్యూటర్లు తప్ప పెట్టుబడిదారులు లేరు. ఎంసీఏ మార్గదర్శకాల ప్రకారమే డైరెక్ట్ సెల్లింగ్ కార్యకలాపాల్ని నిర్వహిస్తున్నాం.

## పేరుకే నౌకరి.. చేసేది చాకిరీ!

- 5 నెలలుగా వేతనాలులేని విద్యా వాలంటీర్లు
- రాష్ట్రవ్యాప్తంగా 15 వేల మంది ఎదురుచూపులు

ఈనాడు, హైదరాబాద్: సర్కారు పాఠశాలల్లో విద్యా వాలంటీర్లుగా పని చేస్తున్న వేలాది మంది వేతనాల కోసం నెలల తరబడి ఎదురుచూస్తున్నారు. ఫిబ్రవరి నుంచి జులై వరకు జీతాలు అందకపోవడంతో వాలంటీర్లు అప్పులు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. వేతనాలు ఇప్పండి మహాప్రభో అంటూ వారు జిల్లా విద్యాశాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం ఉండటం లేదు. ఎదురుచూసి విసిగిపోయిన విద్యా వాలంటీర్లు సోమవారం జోగులాంబ గద్వాల కలెక్టరేట్ ఎదుట ధర్నా సైతం చేశారు. విద్యా వాలంటీర్లు లేకుంటే చాలా పాఠశాలలు నడవని పరిస్థితి ఉన్నా.. వారికి వేతనాలు మాత్రం సక్రమంగా చెల్లించడం లేదు.

**ఏటా ఇదే తంతు..**

ఏటా విద్యా వాలంటీర్లకు వేతనాల చెల్లింపులో తీవ్ర జాప్యమవుతున్నా విద్యాశాఖ మాత్రం నిర్లక్ష్యం వహిస్తోంది. వారికి మూడు నెలలకోసారి బడ్జెట్ వస్తుండటం.. ఆ తర్వాత మళ్లీ బడ్జెట్‌కు రాష్ట్ర ప్రభుత్వానికి దస్త్రం పంపించడం.. ఈ తతంగమంతా జాప్యానికి కారణమవుతోంది. తీరా విద్యాశాఖ కమిషనర్ డీఈవోల ఖాతాలకు పంపినా అక్కడి నుంచి ఎంఈవోలు అందుకోవడం, వారు విద్యావాలంటీర్లకు చెల్లించేరికి మరింత ఆలస్యమవుతోంది. వేతనాలు నేరుగా వాలంటీర్ల ఖాతాలో వేసేలా గ్రీన్ ఛానెల్ విధానాన్ని అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం గత మూడునాలుగేళ్లుగా కేంద్రానికి హామీ ఇస్తున్నా ఇప్పటివరకు అది నెరవేరలేదు. సుమారు 2 వేల మంది శాశ్వత ఉపాధ్యాయుల(ఎస్‌జీటీ)ను ఇటీవల నియమించిన సంగతి తెలిసిందే. దాంతో విద్యా వాలంటీర్లుగా పనిచేస్తున్న దాదాపు 1980 మందిని విధుల నుంచి తొలగించారు. అయితే, వారికీ బకాయిలు చెల్లించకపోవడం గమనార్హం. 'ఆదిలాబాద్, వరంగల్, నిజామాబాద్ జిల్లాల్లో 2018 డిసెంబరు నుంచి వేతనాల బకాయి ఉంది. తొలగించిన వారిని ఆయా బడుల్లో సర్దుబాటు చేయకపోతే హైదరాబాద్‌లో నిరాహార దీక్ష చేస్తాం' అని రాష్ట్ర విద్యా వాలంటీర్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కన్నెబోయిన సత్తయ్య హెచ్చరించారు. మరోవైపు వేతనాల బడ్జెట్ కోసం ప్రభుత్వానికి లేఖ రాశామని.. త్వరలో వస్తాయని విద్యాశాఖ అధికారి ఒకరు చెప్పారు.

**ఇదీ పరిస్థితి..**

- మొత్తం విద్యా వాలంటీర్లు: సుమారు 15 వేలు
- నెల వేతనం: రూ.12 వేలు
- వేతన బకాయిలు: 2018 ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ 12 వరకు, జూన్ 12 నుంచి జులై నెల వేతనం వరకు

## రాష్ట్రపతిని కలిసిన గవర్నర్

### గవర్నర్ల సదస్సుపై చర్చ!

ఈనాడు, దిల్లీ: రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను తెలంగాణ గవర్నర్ నరసింహన్ మంగళవారం కలిశారు. త్వరలో దిల్లీలో నిర్వహించనున్న గవర్నర్ల సమావేశానికి సంబంధించిన అంశాలపై ఆయనతో చర్చించినట్లు తెలిసింది. ఉదయం రాష్ట్రపతి భవన్‌కు వెళ్లిన గవర్నర్ మధ్యాహ్నం వరకు అక్కడే ఉన్నారు. మధ్యాహ్నం ఏపీ భవన్‌కు వచ్చి.. కొద్దిసేపటి తర్వాత తిరిగి రాష్ట్రపతి భవన్‌కు వెళ్లారు. సాయంత్రం వరకు రాష్ట్రపతితో సమావేశమై తిరిగి ఏపీ భవన్‌కు చేరుకున్నారు.

## జీపీఎఫ్ ఖాతాలను విభజించాలి

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో తొమ్మిది జిల్లా పరిషత్తులు 32 జిల్లా పరిషత్తులుగా మారినందున జీపీఎఫ్ ఖాతాలను ఆ జిల్లాల వారీగా మార్చాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పంచాయతీరాజ్ కార్యదర్శికి వారు వినతిపత్రం అందజేశారు.

## 11,505 మందికి బీఈడీ సీట్ల కేటాయింపు

ఎడ్‌సెట్ కౌన్సెలింగ్‌లో పాల్గొన్న 11,505 మందికి సోమవారం రాత్రి సీట్లు కేటాయించారు. కన్వీనర్ కోటాలో 13,455 సీట్లు అందుబాటులో ఉన్నాయని, మొదటి విడత సీట్ల కేటాయింపు తర్వాత 1930 సీట్లు మిగిలిపోయాయని ప్రవేశాల కన్వీనర్ ఆచార్య రమేష్ బాబు తెలిపారు. మొత్తం 27,516 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చుకున్నారు. సీట్లు పొందిన వారు ఈనెల 31వ తేదీలోపు కళాశాలల్లో చేరాలి. సెప్టెంబరు 4 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని కన్వీనర్ పేర్కొన్నారు.

## 29 నుంచి దోస్త్ అంతర్గత కోర్సుల మార్పునకు ఆప్షన్లు

ఈనాడు, హైదరాబాద్: డిగ్రీ కళాశాలల్లో చేరిన వారు కోర్సు, మాధ్యమాలను మార్చుకోవడానికి ఈనెల 29 నుంచి 30వ తేదీ వరకు ఇంట్రా కాలేజ్ (కళాశాలలో) స్లైడింగ్ కోసం వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని దోస్త్ కన్వీనర్ ఆచార్య ఆర్.లింబాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. వారికి ఈనెల 31న కేటాయింపులు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

## రేపు అల్పపీడనం

ఈనాడు, హైదరాబాద్: బంగాళాఖాతం ఉత్తర ప్రాంతంలో గురువారం అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని వాతావరణ అధికారి రాజారావు తెలిపారు. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌పై 900 మీటర్ల ఎత్తున ఉపరితల ఆవర్తనం ఉంది. బుధ, గురువారాల్లో రాష్ట్రంలో ఒక మాదిరి వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశాలున్నాయని ఆయన వివరించారు. మంగళవారం రాష్ట్రంలో 37 ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి. ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి.

## విమానంలో పొగలు.. అత్యవసర ల్యాండింగ్

శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: దిల్లీ నుంచి వస్తున్న ఓ విమానంలో పొగలు రావడంతో అత్యవసరంగా శంషాబాద్ విమానాశ్రయంలో కిందకు దించిన సంఘటన ఇది. ఇండిగో ఎయిర్‌లైన్స్(6ఈ-6679) విమానం దిల్లీలో 155 మంది ప్రయాణికులతో మంగళవారం మధ్యాహ్నం 3:20 గంటలకు హైదరాబాద్ బయలుదేరింది. మరో 15 నిమిషాల్లో గమ్యం చేరుతుందనగా విమానం కాక్‌పిట్(పైలట్ కూర్చునే ప్రదేశం)లో పొగలు వచ్చాయి. గమనించిన పైలట్ శంషాబాద్ విమానాశ్రయ ఏటీసీ అధికారులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన విమానాశ్రయ అధికారులు వెంటనే విమానాన్ని అత్యవసర ల్యాండింగ్ చేశారు. సురక్షితంగా కిందకి దిగడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

## పాకిస్థాన్‌కు దీటుగా సమాధానమిస్తాం

- నాటి అసమంజస నిర్ణయాలతోనే ఆర్టికల్ 370
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అమీర్‌పేట, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం చేతులు ముడుచుకొని కూర్చోలేదని, అవినీతిపరులు మింగిన మొత్తాన్ని కక్కిస్తుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. జమ్మూ-కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు నిర్ణయాన్ని వ్యతిరేకించేవారు ఒకసారి అక్కడికి వెళ్లి చూస్తే వాస్తవ పరిస్థితులు తెలుస్తాయని పేర్కొన్నారు. పాకిస్థాన్ కాల్పులకు దిగితే చూస్తూ ఊరుకోబోమని.. దీటుగా స్పందిస్తామని హెచ్చరించారు. 'ఎండ్ ఆఫ్ ఆర్టికల్ 370- ఇంపాక్ట్ ఆన్ ఎమర్జింగ్ ఇండియా' అనే అంశంపై మంగళవారం సాయంత్రం హైదరాబాద్ అమీర్‌పేటలోని సెస్ సమావేశ మందిరంలో జరిగిన చర్చా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

విశ్రాంత మేజర్ జనరల్ సంజయ్ సోయ్ మాట్లాడుతూ 370 అధికరణ రద్దు చేయడం మోదీ సాహసోపేత నిర్ణయాల్లో ఒకటని పేర్కొన్నారు. దీన్ని అన్ని



చర్చా కార్యక్రమంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

దేశాలు సమర్థించిన విషయాన్ని గుర్తు చేశారు. కశ్మీరీ పండిట్‌ల ప్రతినిధి సునీల్ సరాఫ్ మాట్లాడుతూ దేశానికి ఆగస్టు 15న స్వాతంత్ర్యం లభిస్తే, కశ్మీరీలకు ఆగస్టు 5న వచ్చిందన్నారు. జమ్మూ కశ్మీర్ స్టడీ సర్కిల్ ప్రతినిధి రాక సుదర్శన్, ప్రజ్ఞా భారతి ప్రతినిధి మామిడి గిరిధర్ తదితరులు మాట్లాడారు. 'భారత్-2025' సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాజపా క్రమశిక్షణ సంఘం రాష్ట్ర కన్వీనర్ బూర్గుల శ్యామ్‌సుందర్, భాజపా మైనారిటీ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు ఎఫ్.ఎస్.లాయ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి వామపక్ష ఉద్యమాన్ని నిర్మిస్తాం

### సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

ఈనాడు, అమరావతి: జాతీయస్థాయిలో సీపీఐ, సీపీఎం సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించాయని, ఉమ్మడి కమ్యూనిస్టుల ఉద్యమాన్ని ఎలా నిర్మించాలన్నదానిపై చర్చిస్తున్నామని సీపీఐ ప్రధానకార్యదర్శి డి.రాజా వెల్లడించారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన 'మీట్ ద ప్రెస్'లో ఆయన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. జాతీయభావం తమ రక్తంలోనే ఉందని, స్వాతంత్ర్య ఉద్యమంలో వామపక్ష నేతల పాత్ర ఉందని, ఆర్‌ఎస్‌ఎస్ వారు ఎక్కడున్నారని ప్రశ్నించారు. దేశంలో అధ్యక్షపాలన వచ్చే అవకాశం లేదని, భిన్న సంస్కృతులు, సంప్రదాయాలు ఉన్నచోట ఇది సాధ్యం కాదన్నారు. రాజ్యాంగ ముసాయిదా కమిటీ ఛైర్మన్ అంబేడ్కర్ అధ్యక్షపాలన, రెండుపార్టీల విధానాన్ని తిరస్కరించారని గుర్తుచేశారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థలపై దాడి జరుగుతోందన్నారు. కేంద్రం ఎయిర్ ఇండియా, రైల్వేలు, రక్షణ కర్మాగారాల్లోనూ ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహిస్తోందని, ఇది మంచి పరిణామం కాదని తెలిపారు.

# దివ్యాంగ అభ్యర్థి ఇంటర్వ్యూకు ప్రత్యేక సాయం

- సైగలను వివరించడానికి అనువాదకుడి ఏర్పాటు
- ముగిసిన గ్రూప్-2 ముఖాముఖి

ఈనాడు, హైదరాబాద్, ఈనాడు డిజిటల్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) తొలిసారిగా గ్రూప్-2 మౌఖిక పరీక్షలో దివ్యాంగ అభ్యర్థికి అనువాదకుడిని ఏర్పాటు చేసింది. సదరు అభ్యర్థి సైగలను అనువాదకుడు బోర్డు అధికారులకు వివరించారు. కేవలం 60 నిమిషాల్లో కమిషన్ ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు చేసింది. తెలంగాణ ప్రభుత్వ విభాగంలో చేస్తూ మంగళవారం ఇంటర్వ్యూకు హాజరైన ఒక దివ్యాంగ అభ్యర్థికి మాటలు స్పష్టంగా రావని, గట్టిగా మాట్లాడితే కొంత వరకే వినబడుతోందని కమిషన్ సిబ్బంది గుర్తించారు. అనువాదకుడు ఉంటే అభ్యర్థి చెప్పే విషయం బోర్డు సభ్యులకు అర్థమవుతుందని ఛైర్మన్ ఘంటా చక్రపాణి భావించారు. వెంటనే నగరంలోని దివ్యాంగ విద్యాలయాల్ని సంప్రదించారు. అప్పటికప్పుడు ఎవరూ అందుబాటులో లేరని తెలిసింది. చివరకు టాకింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధిని సంప్రదించగా అనువాదకున్ని పంపించారు. ఈ అనువాదకుడి సహాయంతో దివ్యాంగ అభ్యర్థి ఇంటర్వ్యూ పూర్తయింది. కమిషన్‌కు దివ్యాంగ అభ్యర్థి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఇంటర్వ్యూలకు వెళ్లినప్పుడు కూడా అనువాదకుడిని పెట్టలేదని పేర్కొన్నారు.

**అభ్యర్థులు వెబ్‌సైట్‌ను అనుసరించాలి**

గ్రూప్-2 ముఖాముఖిలు నిర్వహణ పూర్తయ్యింది. ఈ నెల 1 నుంచి మంగళవారం వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. మొత్తం 1032 పోస్టులకు 1:2 నిష్పత్తిలో 2,064 మంది ముఖాముఖికి హాజరయ్యారు. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖలో సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు ఐచ్ఛికాలు (వెబ్ ఆప్షన్లు) ఇచ్చిన 1300 మంది అభ్యర్థులను వైద్య పరీక్షల నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి పంపారు. అలాగే జీఏడీ, న్యాయ, ఆర్థిక శాఖల్లో ఏఎస్‌వో పోస్టులకు ఐచ్ఛికాలు ఇచ్చిన వారికి త్వరలోనే కంప్యూటర్ నైపుణ్య పరీక్ష నిర్వహించనున్నారు. ఈ రెండు పరీక్షలకు సంబంధించిన రిపోర్టులు వచ్చాక ఎవరైనా అనర్హులైన పక్షంలో, తరువాతి స్థానంలో నిలిచిన అభ్యర్థులను 1:2 నిష్పత్తిలో ముఖాముఖిలకు పిలవనున్నారు. ఈ విషయంలో అభ్యర్థులకు ఎలాంటి వ్యక్తిగత సమాచారం అందించమని, ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌ను అనుసరిస్తూ సమాచారం తెలుసుకోవాలని టీఎస్‌పీఎస్సీ ఒక ప్రకటనలో పేర్కొంది.

## యాదాద్రిలో ప్రసాదాలు లేవు

### మరో రెండు, మూడ్రోజులు ఇలాగే

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రిలో మంగళవారం లడ్డూ, పులిహోర ప్రసాదాలు నిలిచిపోయాయి. అనుబంధంగా కొనసాగుతున్న పాతగుట్టలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఆలయ విస్తరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టే దశలో పాత భవనాలను తొలగించాలన్న సీఎం నిర్ణయంతో ప్రసాదాల తయారీ, గోదాం, వ్రతాల మండపం, అన్నదానం విభాగాలను, సామగ్రిని పాతగుట్టకు తరలించారు. దీంతో ప్రసాదాల తయారీ, విక్రయాలు ఆగిపోయాయి. ప్రసాదాల తయారీకి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. సామగ్రి, యంత్రాల బిగింపునకు సమయం పడుతుందని, రెండు మూడు రోజులపాటు పరిస్థితులు ఇలాగే ఉండొచ్చని ప్రసాదాల తయారీ విభాగం ఇన్‌ఛార్జి, ఏఈవో చంద్రశేఖర్ 'న్యూస్‌టుడే'తో అన్నారు. శ్రీస్వామి నిత్యకల్యాణం నిర్వహించే ఆర్జిత భక్తులకు మాత్రం ప్రసాదాలను అందజేసే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

## 'సాహో' టికెట్ ధరల పెంపును నిలువరించండి

ఈనాడు, అమరావతి: 'సాహో' సినిమా టికెట్ ధరలను పెంచకుండా థియేటర్ యాజమాన్యాలను నిలువరించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యంపై ఏపీ హైకోర్టు విచారణ జరిపింది. ప్రతివాదులుగా ఉన్న సాహో చిత్ర పంపిణీదారు శ్రీవెంకటేశ్వర ఫిలిమ్స్ అధినేత దిల్‌రాజుతో పాటు హోంశాఖ ముఖ్య కార్యదర్శి, తదితరులకు నోటీసులు జారీచేసింది. విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది.

# అపనిందలు సరికాదు

- పారదర్శకంగా కరెంటు కొని నాణ్యతతో సరఫరా చేస్తున్నాం
- ఎన్టీపీసీ తక్కువకు కరెంటు ఇస్తామని ఎన్నడూ చెప్పలేదు
- లక్ష్మణ్ ఆరోపణలపై ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు వివరణ

ఈనాడు, హైదరాబాద్: "పెద్దలు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ నా పేరు ప్రస్తావిస్తూ తెరాస కండువా కప్పుకొన్నానని ఆరోపించారు. దానికి నేను చాలా బాధపడ్డా. అపనిందలు వేయడం సరికాదు. గతంలో తెదేపా, కాంగ్రెస్ ప్రభుత్వాల్లోనూ పనిచేశాను. నేను ఎప్పుడూ ఏ పార్టీ కండువా వేసుకోలేదు.. వేసుకోను. గత ఐదేళ్లుగా ప్రొఫెషనల్‌గా విద్యుత్ సంస్థలను నడుపుతున్నాం. మాకు ఎలాంటి దురుద్దేశాలు లేవు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రావు. పక్కన డిస్కంల సీఎండీలు రఘుమారెడ్డి, గోపాలరావు

ఎలాంటి ఒత్తిళ్లు లేవు. ఈ విషయాన్ని లక్ష్మణ్‌కు వినమ్రంగా చెబుతున్నా" అని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందా(పీపీఏ)ల్లో అవినీతి జరిగిందని లక్ష్మణ్ చేసిన ఆరోపణలపై వివరణ ఇచ్చేందుకు మంగళవారం ఆయన విద్యుత్ సౌధలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. "దేశంలో ఒక్క తెలంగాణ రాష్ట్ర డిస్కంలే నష్టాల్లో ఉన్నట్లు.. మిగతావి లాభాల్లో ఉన్నట్లు మాట్లాడుతున్నారు. మేం ఇంత కష్టపడి పనిచేస్తున్నా ఏం జరుగుతోందనే అపోహలో మా సిబ్బంది కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో అపోహలు తొలగించేందుకు వివరణ ఇస్తున్నాం. ఈ ప్రభుత్వం 24 గంటల కరెంటు ఇవ్వాలనే నిర్ణయం తీసుకున్నందున పారదర్శకంగా కరెంటు కొని నాణ్యతతో సరఫరా చేస్తున్నాం. విద్యుత్కేంద్రాల నిర్మాణ కాంట్రాక్టుల కోసం మేం భెల్(బీహెచ్‌ఈఎల్)తో ఒప్పందం చేసుకున్నాం. మా కాంట్రాక్టులన్నీ భెల్‌కే ఇచ్చాం. ఎన్టీపీసీ ఎప్పుడూ తక్కువ ధరకు కరెంటు ఇస్తామని చెప్పలేదు. ఎన్టీపీసీ, భెల్ రెండు సంస్థలు కేంద్ర ప్రభుత్వానివే. మేం చెప్పేది తప్పని భావిస్తే.. కేంద్రం ద్వారా తనిఖీ చేయించుకోవచ్చు. విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్‌సీ) ఆమోదం లేకుండా ఏ నిర్ణయం తీసుకోలేదు. ఎప్పుడు అవసరం ఉంటే అప్పుడు ప్రభుత్వం రాయితీకన్నా అదనంగా నిధులు ఇస్తున్నందునే ఛార్జీలు పెంచకుండా నాణ్యమైన విద్యుత్ ఇవ్వగలుగుతున్నాం" అని ప్రభాకర్‌రావు వివరించారు. ఈ సమావేశంలో ఉత్తర, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)ల సీఎండీలు ఎ.గోపాలరావు, రఘుమారెడ్డి, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఎరువు కాదు.. బరువు!



చూర్ణం చేయడానికి యూరియాను బండకేసి కొడుతున్న రైతు

యూరియా కొరత అన్నదాతలను వేధిస్తోంది. ఎట్టకేలకు నిజామాబాద్ జిల్లా మాక్లూర్ సహకార సంఘానికి మూడు రోజుల క్రితం మార్క్‌ఫెడ్ సంస్థ 400 బస్తాల యూరియా సరఫరా చేసింది. అది 2015 నాటిది. బస్తాలు గడ్డ కట్టినట్లు ఉన్నాయి. అయినా రైతులు ఏదో ఒకటి దొరికిందని కొనుగోలు చేశారు. ఇప్పుడు పొలాల్లో చల్లేందుకు అవస్థలు పడుతున్నారు. చాకిరేవు దగ్గర బట్టలు ఉతికినట్లు.. బండకేసి బాదుతున్నా యూరియా గడ్డలు చూర్ణం కావడం లేదు. "బస్తాలో సగమే చల్లేందుకు ఉపయోగపడుతోంది. ఎరువు చాలక దిగుబడి తగ్గుతుందేమో" అని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. - న్యూస్‌టుడే, మాక్లూర్

# ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు తీసుకోలేదు

- ప్రభుత్వ వాదనలో వాస్తవం లేదు
- వార్డుల విభజన అంశంపై హైకోర్టుకు నివేదించిన పిటిషనర్
- అఫిడవిట్లు ఇచ్చిన ముగ్గురు ఎంపీలు
- తన సంతకం ఫోర్జరీ చేశారన్న సంజయ్

ఈనాడు, హైదరాబాద్: మున్సిపల్ వార్డుల విభజన ప్రక్రియలో చట్టసభల ప్రతినిధుల అభిప్రాయాలు తీసుకున్నామన్న ప్రభుత్వ వాదనలో వాస్తవం లేదని పిటిషనర్ హైకోర్టుకు నివేదించారు. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియకు గడువు కుదించడాన్ని సమర్థిస్తూ ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్‌లో.. వార్డుల విభజన ప్రక్రియలో ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను అన్ని మున్సిపాలిటీల కమిషనర్లు తీసుకున్నారని పేర్కొందన్నారు. దానికి ఆధారాలు చూపాల్సి ఉందన్నారు. తమ అభిప్రాయాలను తీసుకోలేదంటూ ఎంపీలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎ.రేవంత్‌రెడ్డి, బండి సంజయ్ లిఖిత వాంగ్మూలం (అఫిడవిట్లు) ఇచ్చారన్నారు. మున్సిపల్ ఎన్నికల ముందస్తు ప్రక్రియను నిబంధనలకు విరుద్ధంగా చేపట్టారంటూ నిర్మల్ జిల్లాకు చెందిన కె.అంజుకుమార్‌రెడ్డి ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన విషయం విదితమే. దీనిపై.. అంతా చట్టబద్ధంగా చేశామని గత వారం పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి కౌంటర్ దాఖలు చేశారు. ఇందులోని అంశాలకు పిటిషనర్ సమాధానమిస్తూ మంగళవారం రిప్లై కౌంటర్ దాఖలు చేశారు. "వార్డుల విభజన సమాచారం, మ్యాప్‌లు, తేదీలు ఇవ్వలేదు. కౌన్సిల్ తీర్మానాలను నిబంధనలకు విరుద్ధంగా తీసుకున్నారు. అభ్యంతరాలపై పూర్తి వివరాలు లేవు. వాటిని యాంత్రికంగా పరిష్కరించారు. ఎలాంటి కారణాలు చెప్పకుండా ఒకే రోజు తిరస్కరించినట్లు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ప్రక్రియను నిలిపివేయాలి. మా అభ్యంతరాలను పరిష్కరించాక ఎన్నికలకు వెళ్లేలా ఆదేశించాలి" అని కోరారు. ఇప్పటికే సింగిల్ జడ్జి 50కి పైగా మున్సిపాలిటీల్లో ఎన్నికలపై స్టే ఇచ్చారన్నారు. ఈ అంశంపై బుధవారం విచారణ జరగనుంది.

**నా అభిప్రాయం సేకరించలేదు: సంజయ్**

వార్డుల విభజనపై తన అభిప్రాయాన్ని సేకరించినట్లుగా పేర్కొన్న పేపర్‌లో తాను సంతకం చేయలేదని, ఫోర్జరీ చేశారని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పిటిషనర్‌కు ఇచ్చిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తన నియోజకవర్గం పరిధిలో సిరిసిల్ల సహా 7 మున్సిపాలిటీలు ఉండగా ఒక్క కమిషనరూ తన అభిప్రాయం తీసుకోలేదన్నారు. ఆరు మున్సిపాలిటీల్లో వార్డుల విభజనకు సంబంధించి మ్యాప్‌లతో సహా సరైన సమాచారం ఇవ్వకపోవడంతో తన అభిప్రాయాలు ఇవ్వలేదని మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డి పిటిషనర్‌కు అఫిడవిట్ ఇచ్చారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 6 మున్సిపాలిటీలు సరైన మ్యాప్‌లు ఇవ్వకపోవడంతో సూచనలు ఇవ్వలేదని ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.

## ఆర్బీఐ నిధులను దొడ్డిదారిన మళ్లించారు: అసదుద్దీన్



ఆబిడ్స్, న్యూస్‌టుడే: రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) నిధులను దొడ్డిదారిన కేంద్ర ప్రభుత్వానికి మళ్లించిన ఘనత మోదీ సర్కార్‌కే దక్కుతుందని ఏఐఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం అసదుద్దీన్ విలేకరులతో మాట్లాడారు. ఎన్డీయే సర్కారు ప్రజలకు చేసిన వాగ్దానాలను పక్కనబెట్టి స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగపడే పనులను చేపడుతోందని విమర్శించారు. ఎంఐఎం పార్టీని దేశవ్యాప్తంగా విస్తరించడంలో భాగంగా ఝార్ఖండ్, గుజరాత్ తదితర రాష్ట్రాల ఎన్నికల్లోనూ పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం అసమర్థతను ఎప్పటికప్పుడు ఎండగడుతూ దేశ ప్రజలకు మేలు జరిగేలా తమవంతు పాత్ర పోషిస్తామని ఒవైసీ స్పష్టం చేశారు.

**ANDHRA PRADESH STATE SKILL DEVELOPMENT CORPORATION (APSSDC)**

Andhra Pradesh State Skill Development Corporation (APSSDC) invites RFP for Selection of Consulting Agency for Adoption & Implementation of Indian Accounting Standards (IND AS) for the Financial Year 2018-19 and restating the financial statements of Financial Year 2017-18 for APSSDC.
The RFP document can be downloaded from: apssdc.in website.
Any further updates will be posted in www.apssdc.in

Sd/- MD & CEO, APSSDC, Vijayawada.

DIPR 108PP/CL, Dt. 27/08/2019

# రాజధానిలో.. గంజాయ్





హైదరాబాద్‌లో గంజాయి ఘాటెత్తుతోంది. దీనికి ప్రధాన అడ్డాగా పేరొందిన ధూల్‌పేట, సీతాఫల్‌మండి మాత్రమే కాకుండా మరిన్ని ప్రాంతాలకు ఎలా విస్తరించిందో గుట్టు విప్పేందుకు గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అలిజాపూర్ ప్రాంతానికి 'ఈనాడు-ఈటీవీ' ప్రతినిధులు విద్యార్థుల మాదిరిగా వెళ్లి వాస్తవ చిత్రాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేయగా అక్కడ అంతా బహిరంగంగానే సాగుతున్నట్లు అర్థమైంది.

కిరాణ దుకాణానికి వెళ్లి బిస్కెట్ ప్యాకెట్లు కొన్నంత మామూలుగా నలుగురు విద్యార్థులు ఓ ఇంటికి వెళ్లి డబ్బులిచ్చి గంజాయి ప్యాకెట్లు తెచ్చుకుంటూ కనిపించారు. 'కొత్త వారిలా ఉన్నారు... ఏం భయం లేదు మీరూ వెళ్లి డబ్బులిచ్చి తెచ్చుకోవచ్చు' అని వారు 'ఈనాడు-ఈటీవీ' ప్రతినిధులతో అనడాన్ని బట్టి ఈ వ్యాపారం సాగే రీతుల్లో మరీ గోప్యతేదీ లేదని స్పష్టమైంది. ఈ ఇంటికి వంద అడుగుల దూరంలో మరో ఇంట్లో గంజాయి విక్రయాలు బహిరంగంగా కొనసాగుతున్నాయి. అలాగే ఇక్కడ ఓ ఆలయం వద్ద ఓ ద్విచక్రవాహనం కనిపించింది. దానివద్దకు కొనుగోలుదారులు రాగానే ఆ వ్యక్తి వచ్చి డబ్బు తీసుకుని చేతుల్లో గంజాయి పొట్లాలు పెడుతున్నాడు. ఈ ఆలయానికి 300 మీటర్ల దూరంలోని ఓ కిరాణా దుకాణంలోనూ అమ్ముతున్నారు. స్థానికులతో మాట కలపగా రాత్రి వేళల్లో ఇక్కడికి నైజీరియన్లు వచ్చి బ్రౌన్ షుగర్, కొకైన్ విక్రయిస్తారని చెప్పారు. అప్పుడు విద్యార్థులు, యువకులు ఎక్కువగా వస్తారని వివరించారు. ఇక్కడ గంజాయి విక్రయాల గురించి ఎక్సైజ్, శాంతిభద్రతలు, టాస్క్‌ఫోర్స్ పోలీసులకు తెలుసని, వారెవరూ ఇటు రాకుండా ఎప్పటికప్పుడు అన్ని ఏర్పాట్లు జరిగిపోతాయని వివరించారు.

## ఒడిశా... విశాఖపట్నం... వరంగల్..

యువత నుంచి డిమాండ్ పెరుగుతుండడంతో గంజాయి విక్రయాలు కొనసాగిస్తున్న మాఫియా ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లోని ఏజెన్సీ ప్రాంతాలు... విశాఖపట్నంలోని ఏజెన్సీ ప్రాంతాల నుంచి రోజుకు వందల కిలోల గంజాయిని హైదరాబాద్‌కు తెప్పిస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల నుంచి కూడా కొంత సరకు వస్తోంది. దాన్ని రహస్య ప్రాంతాలకు తరలించి మాఫియా.. రిటైల్ వ్యాపారులకు కిలో రూ.3 వేలకు అమ్ముతోంది. కూకట్‌పల్లి, హబ్సిగూడ, మలక్‌పేట, ఎల్బీనగర్ ప్రాంతాల్లో ఉంటున్న ఈ ముఠాల సభ్యులు ఎప్పటికప్పుడు కొత్త పద్ధతులను అమలు చేస్తున్నారు. హైదరాబాద్ తెచ్చాక ఇళ్లు, గోదాంలలో సరకును దాచి బీదర్, నాందేడ్... ముంబయిలకు కూడా గుట్టుగా తరలిస్తున్నారు. ఒకసారి పాలిథిన్ కవర్లలో వాసన రాకుండా ప్యాక్ చేసి వాటిపై సెంటు సీసాల కంపెనీల అట్టపెట్టెలను పెట్టి గుట్టుగా రవాణా చేశారు. బిల్లులన్నీ పక్కాగా ఉండడంతో తనిఖీల్లో పట్టుబడలేదు. ఆ సరకును విడిగా అమ్ముతున్నప్పుడు పట్టుకుని విచారిస్తే ఇదంతా బయటపడింది. అలాగే ఖరీదైన కార్లు, సరకు రవాణా వాహనాల్లో రవాణా చేస్తుండడంతో పోలీసులకు అనుమానాలు రావడం లేదు. రెండేళ్ల నుంచి ఎక్సైజ్ పోలీసులతో పాటు డెరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు దృష్టి కేంద్రీకరించారు. వైజాగ్ సమీపంలో రూ.కోటి విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.










### గంటకు కనీసం పది పొట్లాల విక్రయం

*గంజాయి విక్రయిస్తున్న ఇళ్లు, పరిసర ప్రాంతాలను గమనించగా.. నిముషాల వ్యవధిలో క్రయ విక్రయాలు పూర్తవుతున్నాయి. అక్కడకు వచ్చిపోతున్న వారిని గమనిస్తే గంటకు కనిష్ఠంగా పది పొట్లాలు విక్రయించే వాతావరణం కనిపించింది. దాదాపు రోజుకు రూ.10వేల దాకా సంపాదిస్తారు. పొట్లాల్లో నింపేందుకు మూడు కిలోల గంజాయి అవసరం అనుకున్నా... వారి పెట్టుబడి నెలకు రూ.10వేల నుంచి రూ.15 వేల వరకు మాత్రమే.*

### రెండు రకాలుగా పొడి గంజాయి



**గ్రీన్:** పొడి గంజాయిలో రెండు రకాలు ఇప్పుడు నగరంలో దొరుకుతున్నాయి. చీతా, గ్రీన్ అంటూ వ్యాపారులే పేర్లు పెట్టారు. చీతా నుంచి వచ్చే మత్తు కంటే గ్రీన్ మత్తు ఎక్కువ. పచ్చి గంజాయి పూతతో గ్రీన్ తయారుచేయడం వల్ల గాఢత ఎక్కువగా ఉంటుంది.

**ఖరీదు:** గ్రీన్ ఒక పొట్లం ధర సుమారు రూ.200 నుంచి రూ.300 వరకు ఉంటుంది. అమ్మే ప్రాంతాన్ని బట్టి ధర మారుతుంది. ఒక పొట్లంతో ఆరు సిగరెట్లకు దమ్ము వస్తుంది. ఒక సిగరెట్ మత్తు దాదాపు గంట నుంచి రెండుగంటల వరకు ఉంటుంది.

**చీతా..:** ఒక పొట్లం ధర సుమారు రూ.150 నుంచి రూ.400 వరకు ఉంది. ఇది ఐదారు సిగరెట్లకు సరిపోతుంది. సిగరెట్ ప్రభావం గంటసేపు ఉంటుంది.



| గంజాయి స్వాధీనం... (కిలోలు) | హైదరాబాద్ పోలీస్ | సైబరాబాద్ పోలీస్ | రాచకొండ పోలీస్ | డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ |
|---|---|---|---|---|
| 2017 | 1124 | 186 | 863 | 11,587 |
| 2018 | 519 | 160 | 748 | 18,900 |
| 2019 | 307 | 105 | 307 | 4,302 |

(జూన్ వరకూ)

### ద్రావణమైతే రూ. 2000కు పైనే

నగరంలో గంజాయి ద్రావణం రూపంలో కూడా లభిస్తోంది. ఖరీదు ఎక్కువ. పరిమాణాన్ని బట్టి రూ.2వేలకు పైగానే పలుకుతుంది. ద్రావణాన్ని తేనెడబ్బాలు, ఆహారం రంగు డబ్బాల రూపంలోకి మార్చి ఇక్కడికి తీసుకొస్తున్నారు. ఈ ద్రావణంలోని ఒకటి, రెండు చుక్కలను సిగరెట్‌పై వేసి తాగుతుంటారు. రెండు చుక్కల మత్తు దాదాపు రెండుగంటలు పనిచేస్తుంది.

గంజాయి విక్రయాల్లో లాభాలొస్తుండడంతో గోల్కొండ పోలీస్ ఠాణా పరిధిలో నివాసముంటున్న ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నవంబరు, 2017లో కోకాపేటలో ఓ ఫ్లాట్ తీసుకుని అక్కడ కృత్రిమంగా గంజాయి మొక్కలను పెంచాడు. చుట్టుపక్కల వారికి గంజాయి వాసన రాకుండా పరిమళాలను పిచికారీ చేశాడు. ఎట్టకేలకు బయటకు పొక్కి టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు.

గంజాయి మత్తుకు అలవాటు పడిన ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థినులు తాము గంజాయి పీల్చడమే కాకుండా విక్రయాల ద్వారా ఖర్చులకు వస్తాయని గ్రహించారు. సింగపూర్ టౌన్‌షిప్‌లో తాముంటున్న ఫ్లాట్‌లోనే గంజాయి పొడిని తెచ్చుకుని విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.

హిమాయత్‌నగర్‌లో ఉంటున్న ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు రెండేళ్ల క్రితం ధూల్‌పేటకు వెళ్లి గంజాయి సిగరెట్లు కొనేవారు. వైజాగ్ నుంచి గంజాయి వస్తుందని తెలుసుకుని అక్కడకెళ్లి గంజాయిని కిలో రూ.2వేలకు కొని ఇక్కడికి తెచ్చి రూ.5వేలకు విక్రయించేవారు. స్నేహితులకు విక్రయిస్తుండగా పోలీసులు ఇద్దరినీ కొద్దినెలల క్రితం అరెస్ట్ చేసి జైలుకు పంపించారు.

– ఈనాడు, హైదరాబాద్

# దేశం అబ్బురపడేలా తెలంగాణ అభివృద్ధి

## తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: అయిదేళ్లలో దేశం అబ్బురపడేలా కేసీఆర్ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, బహుళార్థ సార్థక ప్రాజెక్టులను చేపట్టిందని.. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా తెలంగాణ అభివృద్ధి చెందుతోందని తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారకరామారావు పేర్కొన్నారు. హైదరాబాద్.. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ ఆధ్వర్యంలో మంగళవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గ సభ్యత్వ నమోదు విజయోత్సవ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో నగరంలో తీవ్ర నీటి ఇబ్బంది ఉండగా.. నేడు శివారు ప్రాంతాలతో సహా పుష్కలంగా నీరు అందిస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రైతుల పొలాలు పచ్చగా పెరుగుతుంటే కాంగ్రెస్ నాయకుల కళ్లు ఎర్రబడుతున్నాయని.. లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌ను సురక్షితమైన నగరంగా మార్చటానికి 6 లక్షల సీసీ కెమెరాలు అమర్చామని.. మరో 4 లక్షల కెమెరాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. తెరాస ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో 50 లక్షల మంది పింఛనర్లకు నెలకు రూ.వెయ్యి కోట్ల చొప్పున ఏడాదికి రూ.12 వేల కోట్లు ఇస్తున్నామని.. ఇందులో కేంద్రం వాటా రూ.200 కోట్లు మాత్రమేనన్నారు. రెండు పడకల గదుల నిర్మాణం శరవేగంగా పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు తలసాని, మహమూద్ అలీ పాల్గొన్నారు.

### మలేసియాలోని ప్రవాసులను ఆదుకుంటాం

మలేసియాలో ఇబ్బందుల్లో ఉండి స్వదేశానికి తిరిగి రావాలనుకునే ప్రవాస తెలంగాణ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాల సాయం అందించేందుకు కృషి చేస్తామని కేటీఆర్ తెలిపారు. అక్కడికి ప్రభుత్వం తరఫున ప్రత్యేక బృందాన్ని పంపించాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరతామన్నారు. తెరాస ప్రవాస విభాగం సమన్వయకర్త మహేశ్ బిగాల మంగళవారం కేటీఆర్‌ను ఆయన నివాసంలో కలిసి మలేసియాలోని ప్రవాస తెలంగాణ కార్మికుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. వీసాలు, పాస్‌పోర్టులు లేకుండా అక్రమంగా నివసిస్తున్న వారికి మలేసియా ప్రభుత్వం క్షమాభిక్ష పథకాన్ని ప్రకటించిందని, దానికి వచ్చే డిసెంబరు 31 వరకు గడువు ఉందని చెప్పారు.



హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన సభ్యత్వ నమోదు విజయోత్సవ సభలో ప్రసంగిస్తున్న తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్. వేదికపై ఎమ్మెల్యే గోపీనాథ్, మంత్రులు తలసాని, మహమూద్ అలీ

## కాళేశ్వరంతో విపక్షాల గుండెలదురుతున్నాయి

### మంత్రి కొప్పుల ఈశ్వర్

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్, భాజపాలు విషం కక్కుతున్నాయని, అసత్య ప్రచారంతో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజమెత్తారు. ప్రాజెక్టులో గంగ పొంగుతుంటే ప్రతిపక్ష పార్టీల గుండెలు అదురుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. తెరాస శాసనసభాపక్ష కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యేలు నోముల నర్సింహయ్య, కోరుకంటి చందర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావుతో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడారు. తుమ్మిడిహట్టి పేరిట కాంగ్రెస్ నేతలు విహారయాత్రకు వెళ్లారన్నారు. అక్కడ ఆశించిన స్థాయిలో నీటి లభ్యత లేదని కేంద్ర జల సంఘం గతంలోనే చెప్పినా ఏ ఒక్క అనుమతి లేకుండా నాటి కాంగ్రెస్ ప్రభుత్వం పనులు మొదలుపెట్టిందన్నారు. గోదావరి నీళ్లను హైదరాబాద్‌కు తీసుకుపోతున్నారంటూ భాజపా నేతలు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. కాళేశ్వరానికి జాతీయ హోదా ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతున్నామని, దీనికి విపక్షాలు కలిసి రావడం లేదని కొప్పుల విమర్శించారు.

### మిడిమిడి జ్ఞానంతో కాంగ్రెస్ విమర్శలు: వినోద్

కాళేశ్వరంపై కాంగ్రెస్ పార్టీకి కళ్లమంటగా ఉందని, ఆ ప్రాజెక్టు గొప్పతనాన్ని అంగీకరించే దమ్ము లేక దానిపై ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఆ పార్టీ నేతలు యత్నిస్తున్నారని.. మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. కాళేశ్వరం నుంచి మధ్యమానేరుకు గోదావరి నీరు చేరుకున్న సమయంలో ఏమి చేయాలో తెలవక దిక్కు తోచని స్థితిలో కాంగ్రెస్ నాయకులు ఈ నాటకాలు వేశారన్నారు. గోదావరి జలాల వినియోగంలో కాంగ్రెస్ పాలకులు విఫలమయ్యారని, వాటిని కప్పిపుచ్చుతూ టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో నేతలు తుమ్మిడిహెట్టి సందర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

## కోనేరు కృష్ణకు షరతులతో కోర్టు బెయిలు

ఈనాడు, హైదరాబాద్: అటవీ అధికారిణిపై కాగజ్‌నగర్ వద్ద దాడి కేసులో నిందితుడైన ఎమ్మెల్యే సోదరుడు కోనేరు కృష్ణతో పాటు 16మంది నిందితులకు మంగళవారం హైకోర్టు షరతులతో కూడిన బెయిలు మంజూరు చేసింది. ఆయన పిటిషన్‌పై విచారించిన జస్టిస్ గండికోట శ్రీదేవి.. రూ.15,000 వంతున వ్యక్తిగత పూచీకత్తు, అంతే మొత్తంలో మరో ఇద్దరి పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించారు. కోర్టులో ప్రతి విచారణకు హాజరుకావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## దిల్లీలో దోస్తీ.. గల్లీల్లో కుస్తీ!

### భాజపా-తెరాస తీరుపై మండిపడ్డ ఎంపీ రేవంత్‌రెడ్డి

ఉప్పల్, న్యూస్‌టుడే: భాజపా, తెరాస నేతలు దిల్లీలో అలయ్‌బలయ్ చేసుకుంటూ గల్లీల్లో తొడలు కొట్టుకుంటున్నారని మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఉప్పల్‌లో పర్యటించిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. పార్లమెంటులో ఏ బిల్లు వచ్చినా భాజపా కంటే ముందే తెరాస వాళ్లే బటన్‌నొక్కి మోదీకి మద్దతు ఇస్తున్నారన్నారు. ఎంపీ నామా నాగేశ్వరరావు భాజపా నాయకుల కంటే ఎక్కువగా మోదీ, అమిత్‌షాలను ఇంద్రుడు, చంద్రుడు అంటూ పొగిడారని ఎద్దేవా చేశారు. "ముఖ్యమంత్రి కేసీఆర్ అవినీతికి పాల్పడ్డారని భాజపా నేతలు నడ్డా, లక్ష్మణ్ ఇటీవల పదే పదే ఆరోపిస్తున్నారు. మీ చేతిలో(భాజపా) అధికారం ఉన్నప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదు? విద్యుత్తు, సోలార్ పవర్ మీద జరిగిన అవినీతిపై లక్ష్మణ్ పైపైన మాట్లాడుతున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బ్లాక్‌మెయిల్ చేసి లొంగదీసుకోవాలని చూస్తున్నారు. ఇదంతా భాజపా రాజకీయ ఎత్తుగడ. ఆధారాలతో కూడిన ఫిర్యాదులు చేసేందుకు సిద్ధంగా ఉన్నాను.. నడ్డా, లక్ష్మణ్, కిషన్‌రెడ్డి, అమిత్‌షాలకు బహిరంగ లేఖలు రాస్తా.. ఏ విధమైన చర్యలు తీసుకుంటారో చూస్తా" అని రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు.



ఉప్పల్ భరత్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల బకాయిపడ్డ రూ.30 వేల విద్యుత్తు బిల్లు చెల్లించేందుకు సొంత డబ్బులు అందజేస్తున్న ఎంపీ రేవంత్‌రెడ్డి

# ప్రేమ గొంతు నులిమాడు

- అనుమానంతో ప్రియురాలి హత్య
- బంధువుతో మాట్లాడుతోందన్న సంశయంతో ప్రేమికుడి ఘాతుకం



కావిటి తేజస్వి



నిందితుడు నితిన్

పెనుబల్లి, న్యూస్‌టుడే: ప్రేమోన్మాదానికి ఓ యువతి బలైంది. అనుమానం పెనుభూతంగా మారి ప్రేమికుడు రాక్షసుడయ్యాడు. మాట్లాడుకుందామని పిలిస్తే.. అమాయకంగా వచ్చిన ఆ యువతిని క్రూరంగా మట్టుబెట్టాడు. అనంతరం పెట్రోల్ పోసి తగలబెట్టేందుకూ సిద్ధమయ్యాడు. తల్లిదండ్రులకు గర్భశోకం మిగిల్చిన ఓ ఉన్మాది వికృతక్రీడ ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం కొత్త లంకపల్లి వద్ద చోటుచేసుకుంది. పెనుబల్లి మండలం కుప్పెనకుంట్లకు చెందిన కావిటి తేజస్వి(19) తన స్నేహితుడైన సత్తుపల్లికి చెందిన బొల్లెద్దు నితిన్ చేతిలో హత్యకు గురైన ఘటన ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. తేజస్వి వరుసకు బావ అయిన వ్యక్తితో మాట్లాడుతోందన్న అనుమానాన్ని పెంచుకున్న నితిన్ పథకం ప్రకారం హత్యకు పాల్పడ్డాడని పోలీసులు భావిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. తేజస్వి సత్తుపల్లి మండల గంగారం పాలిటెక్నిక్ చదివింది. నితిన్ కూడా అదే కళాశాలలో చదివాడు. ఆ సమయంలో వీరిద్దరూ ప్రేమించుకున్నారు. తేజస్వి ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటుండగా.. నితిన్ ఖమ్మంలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ఈ నెల 25న రాత్రి 8 గంటల సమయంలో నితిన్ కుప్పెనకుంట్లకు ద్విచక్ర వాహనంపై వచ్చాడు. తేజస్వికి ఫోన్‌చేసి మాట్లాడాలని బయటకు రమ్మని పిలవడంతో ఆమె వచ్చింది. ఆమెను ద్విచక్ర వాహనం ఎక్కించుకొని కొత్త లంకపల్లి వద్ద ఉన్న గుట్టల వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో నితిన్.. తేజస్వి మెడకు చేతిరుమాలును బిగించి హత్య చేసినట్లు తెలుస్తోంది. ప్రియురాలిని హత్య చేసి దహనం చేయాలనే ఆలోచనతో నితిన్ ముందుగా రెండు లీటర్ల పెట్రోల్‌నూ తన వెంట తీసుకొచ్చినట్లు పోలీసులు గుర్తించారు. అయితే, రహదారి సమీపంలోనే ఉండటం.. తరచూ పోలీసు వాహనాలు తిరుగుతుండటంతో భయపడి పెట్రోల్ అక్కడే వదిలేసి పరారయ్యాడని భావిస్తున్నారు. తమ కూతురు కనపడటంలేదని సోమవారం తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో వీఎం బంజర్ ఎస్సై తోట నాగరాజు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తేజస్వి సెల్‌ఫోన్ ఇంట్లో ఉండటంతో కాల్ రికార్డులను పరిశీలించిన పోలీసులు నితిన్‌పై అనుమానంతో సత్తుపల్లిలోని అతని స్నేహితులను ఆరా తీశారు. ఈ సమాచారం తెలుసుకున్న నితిన్ సత్తుపల్లి నుంచి ఖమ్మంలోని వసతిగృహానికి వెళ్లిపోయాడు. దీంతో పోలీసులు సోమవారం అర్ధరాత్రి తరువాత ఖమ్మం వెళ్లి అతడ్ని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. తానే చేతి రుమాలుతో గొంతు నులిమి తేజస్విని హత్య చేసినట్లు నితిన్ అంగీకరించాడు.

## రాష్ట్రంలో నేటి నుంచి జాతీయ ఎస్టీ కమిషన్ పర్యటన

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: జాతీయ ఎస్టీ కమిషన్ బుధవారం నుంచి మూడు రోజులపాటు రాష్ట్రంలో పర్యటించనుంది. బృందం మహబూబ్‌నగర్ జిల్లా సింగన్నగూడెం తండాను సందర్శించిన అనంతరం అక్కడి కలెక్టర్, ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులతో సమావేశం కానుంది. మరుసటి రోజున రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలతో పాటు రెవెన్యూ, హోం, అటవీ, విద్యా, గిరిజన సంక్షేమ శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో సమావేశమవుతారు. షెడ్యూల్డ్ తెగల అభ్యున్నతి, సంక్షేమ పథకాలపై సమీక్షిస్తారు. అదే రోజు ముఖ్యమంత్రి, గవర్నర్‌లతో సమావేశం; 30వ తేదీన ఆర్టీసీ ఎండీతో భేటీ ఉంటాయి. తర్వాత గిరిజన తెగల సంక్షేమ సంఘాలతో కమిషన్ చర్చిస్తుంది.

## వచ్చే ఏడాది నుంచి ఎమ్మెస్సీ ఫారెస్ట్ కోర్సు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: అటవీ కళాశాల-పరిశోధన కేంద్రం (ఎఫ్‌సీఆర్ఐ)లో వచ్చే ఏడాది నుంచి ఎమ్మెస్సీ ఫారెస్ట్ కోర్సును ప్రవేశపెట్టాలని పాలక మండలి తీర్మానించింది. ఇందుకోసం ప్రత్యేక కమిటీని సైతం ఏర్పాటు చేసింది. అరణ్యభవన్‌లో ఛైర్మన్ రాజేశ్వర్ తివారీ అధ్యక్షతన సమావేశమైన మండలి పలు నిర్ణయాలు తీసుకుంది. బీఎస్సీ ఫారెస్ట్ విద్యార్థులకు అటవీశాఖ కొలువుల్లో రిజర్వేషన్లు కల్పించాలని, హైదరాబాద్ శివారు దూలపల్లిలో ఉన్న ఎఫ్‌సీఆర్ఐని సిద్దిపేట జిల్లా ములుగుకు తరలించాలని నిర్ణయించింది. కొత్త లేదా ఇప్పటికే ఉన్న ప్రాజెక్టులు, విద్యా సందర్శనల్లో పరస్పరం సహకరించుకోవాలంటూ సెంట్రల్ రీసెర్చి ఇనిస్టిట్యూట్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సమాఖ్య ఎండీ రఘువీర్, ప్రధాన అటవీ సంరక్షణ అధికారిణి (పీసీసీఎఫ్) శోభ, ముఖ్యమంత్రి ఓఎస్డీ ప్రియాంక వర్గీస్ పాల్గొన్నారు.

## యూరియా కొరతకు బాధ్యుల్ని శిక్షించాలి: తెదేపా

ఈనాడు, హైదరాబాద్: వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉమ్మడి కార్యాచరణతో ముందుకు కదలాలని తెలంగాణ తెలుగుదేశం పార్టీ నిర్ణయించింది. పార్టీ రాష్ట్ర నాయకుడు రమణ అధ్యక్షతన మంగళవారం ఎన్టీఆర్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాల్లో ప్రభుత్వ జాప్యంపై..సోమవారం ఇందిరాపార్కు వద్ద మహాధర్నాను విజయవంతం చేసినందుకు కార్యకర్తలకు ఆయన అభినందన తెలిపారు. యూరియా కొరత సృష్టిస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ పార్టీ తరఫున వినతిపత్రాన్ని వ్యవసాయశాఖ కమిషనర్ రాహుల్ బొజ్జాకు సమర్పించామన్నారు.

## బీఈడీకీ జాతీయస్థాయి ప్రవేశ పరీక్ష!

ఈనాడు, హైదరాబాద్: ఉపాధ్యాయ విద్య (బీఈడీ)లో ప్రవేశానికి జేఈఈ తరహాలో జాతీయస్థాయి పరీక్ష ప్రవేశపెట్టేలా జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి(ఎన్‌సీటీఈ) కసరత్తు చేస్తోంది. దీనివల్ల ఉపాధ్యాయ విద్యపై శ్రద్ధ ఉన్నవారే చేరతారని భావిస్తోంది. ప్రస్తుతం బీఈడీ కోర్సులో ప్రవేశానికి ఆయా రాష్ట్రాలు పరీక్షలు జరుపుతున్నాయి. దేశవ్యాప్తంగా బీఈడీ, డీఈడీ కోర్సులను అందించే సంస్థలు దాదాపు 19,000 ఉన్నాయి. ఏటా దేశానికి 3 లక్షల మంది ఉపాధ్యాయులు అవసరం. ప్రస్తుతం ఈ సంస్థల్లో 19 లక్షలమంది ఏటా ప్రవేశాలు పొందుతున్నారు. నాణ్యత పెంచాలంటే మొదట ప్రవేశ స్థాయిలోనే మార్పులు చేయాలన్నది ఎన్‌సీటీఈ ఆలోచన. తుది నిర్ణయం తీసుకుంటే, బాధ్యతను జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థ(ఎన్‌టీఏ)కి అప్పగించే అవకాశం ఉంది.'వృత్తివిద్యా కోర్సులను గాడిన పెట్టాలని సుప్రీంకోర్టు ఆదేశాలున్నాయి. ఈ క్రమంలో జాతీయస్థాయి పరీక్ష యోచనను ఇకనైనా పట్టాలెక్కించాలని చూస్తున్నారు. కాకపోతే ఇతర రాష్ట్రాలకు వెళ్లి బీఈడీ చదివేవారు తక్కువ' అని ఎన్‌సీటీఈ సదరన్ రీజియన్ సభ్యుడు ఆచార్య ఘంటా రమేష్ అన్నారు.

## దిల్లీలో సభాపతుల సమావేశానికి హాజరు కానున్న పోచారం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ శాసనసభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి బుధవారం దిల్లీలో జరిగే శాసనసభాపతుల సమావేశంలో పాల్గొంటారు. పార్లమెంటు ప్రధాన కమిటీ హాలులో ఓం బిర్లా అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమం కోసం ఆయన, శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులు మంగళవారం పయనమయ్యారు.

# వ్యాపారి ఇంట్లో రూ. 2 కోట్ల భారీ చోరీ

- హైదరాబాద్‌లో ఘటన
- బాధితులు ఎంపీ సుబ్బరామిరెడ్డికి బంధువులు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: రెక్కీ నిర్వహించి ఓ ఆగంతకుడు హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఓ వ్యాపారి ఇంట్లో భారీ చోరీకి పాల్పడిన సంఘటన ఇది. ఈ చోరీలో దాదాపు రూ.కోటి నుంచి రూ.2 కోట్ల విలువైన బంగారు వజ్రాభరణాలు మాయమయ్యాయి. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 2లోని జపనీస్ గార్డెన్ వెనుక ప్రాంతంలో ఎంపీ టి.సుబ్బరామిరెడ్డి బంధువైన గుత్తేదారు, వ్యాపారి ఉత్తమ్‌రెడ్డి(52) ఇంట్లోకి మంగళవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో ఓ ఆగంతకుడు ప్రవేశించాడు. కింది అంతస్తులోని డిజిటల్ లాకర్‌ను స్క్రూ డ్రైవరుతో తొలగించి మొదటి అంతస్తులో ఉత్తమ్‌రెడ్డి నిద్రిస్తున్న పడకగదిలోకి వెళ్లాడు. ఆ సమయంలో ఉత్తమ్‌రెడ్డి దంపతులు గాఢనిద్రలో ఉండగా వారి పక్కనే ఉన్న అల్మారాను తెరిచి అందులోని ఉన్న విలువైన బంగారు వజ్రాభరణాలను దొంగిలించాడు. దాదాపు అరగంట పాటు తాపీగా సర్దుకుని.. వచ్చిన దారి నుంచే తిరిగి వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం నిద్రలేచి చూసిన ఉత్తమ్‌రెడ్డి కుటుంబ సభ్యులు దొంగతనం జరిగినట్లు గుర్తించి బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లోని దృశ్యాలను పరిశీలించారు. ఆగంతకుడు ఒక్కడే వచ్చినట్లు గుర్తించారు. ముఖానికి కర్చీఫ్ కట్టుకున్న అతడు పక్కా రెక్కీ నిర్వహించి చోరీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసు జాగిలాలు ఇంట్లో నుంచి నేరుగా జపనీస్ గార్డెన్ వరకు, అక్కడి నుంచి రోడ్డు వరకు వెళ్లి ఆగిపోయాయి. దొంగను పట్టుకొనేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఉత్తమ్‌రెడ్డి సతీమణి లతారెడ్డి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



సీసీ కెమెరాలో చిక్కిన ఆగంతకుడు

## లింగయ్య సంతాప సభను అనుమతించండి: హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: గత జులై 31న కొత్తగూడెం జిల్లా గుండాల మండలం రాళ్లగడ్డ అటవీ ప్రాంతంలో..ఎన్‌కౌంటర్ మృతుడైన లింగయ్య (లింగన్న) సంతాప సభను పోలీసులు అనుమతించాలని మంగళవారం హైకోర్టు పేర్కొంది. వారు విధించిన షరతులకు అనుగుణంగా తాజాగా దరఖాస్తు చేసుకోవాలని పిటిషనర్లను ఆదేశించింది. సభకు అనుమతించకపోవడాన్ని సవాలు చేస్తూ సీపీఎం (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వి.రఘునాథ్ వాదన వినిపిస్తూ, పోలీసులు అనుమతించకపోవడం రాజ్యాంగ విరుద్ధమన్నారు.


**TSRTC**
**ఈ- టెండరు ప్రకటన**
నెం C2/10(17)/2019-OPD(M&C), Dt. 26.08.2019
తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వివిధ మాధ్యమాల ద్వారా (1) వరంగల్, కరీంనగర్ మరియు మెదక్ రీజియన్ బస్ స్టేషన్స్‌లో ప్రకటనలు (2) సికింద్రాబాద్ రీజియన్ సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సుల పైన ప్రకటనలు, (3) వివిధ రీజియన్ల బస్సుల్లో గ్రాబ్ హ్యాండిల్స్ అమర్చి తద్వారా ప్రకటనలు (4) వరంగల్, మెదక్ మరియు మహబూబ్ నగర్ రీజియన్ బస్ స్టేషన్స్ లో డిజిటల్ టి.వి.లను అమర్చి తద్వారా ప్రకటనలు (5) జూబ్లీ బస్ స్టేషన్ లో డిజిటల్ టి.వి.లను అమర్చి తద్వారా ప్రకటనలు మరియు (6) గ్రేటర్ హైదరాబాద్ మరియు హైదరాబాద్ జోన్ల బస్సుల్లోని టైమింగ్ బోర్డ్స్ (సమయసూచిక బోర్డ్స్) పైన ప్రకటనల కొరకు కాంట్రాక్టర్ల నియామకానికి ఆన్‌లైన్ విధానంలో టెండర్లు కోరుచున్నది. మరిన్ని వివరాలకు మా వెబ్‌సైట్ www.tsrtc.telangana.gov.in లేదా https//:www.tender.telangana.gov.in దర్శించగలరు. సందేహ నివృత్తి కొరకు CTM(M&C) & DIR(CP) వారిని. ఫోన్ నెం. 9959225400 పై సంప్రదించగలరు.
సం/- చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (M&C) డైరెక్టర్ (CP)

ఇంధనంగా మారి వాహనాలని పరుగులు పెట్టిస్తుంది.. కానీ పెట్రోల్ కాదు
మెత్తని వస్త్రంగా మారి హాయిగా సేద తీరుస్తుంది... అలాగని కాటన్ కాదు
ప్రొటీన్లని నిండుగా అందిస్తుంది.. పొరపాటున కూడా మాంసం కాదు
భవన నిర్మాణాల్లో కాంక్రీట్‌లా ఉపయోగపడుతుంది...
ఆఁ సిమెంటే కదా అనుకుంటే తప్పులో కాలేసినట్టే!
మరి ఏంటది? ఈ ప్రశ్నలకు సమాధానం హెంప్!
ఈ హెంప్ మనకు తెలిసిన గంజాయి మొక్కకి కజిన్‌లాంటిది.
అదే కుటుంబానికి చెందినా... భిన్నమైన లక్షణాలున్న ఈ మొక్కతో లెక్కకు మించిన ప్రయోజనాలు ఉండటంతో ప్రపంచం మొత్తం దీనివైపు తొంగిచూస్తోంది...



# అన్నిటికీ ఒకటే మంత్రం..
# హెంఫట్

అంతకంతకు పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగానికి చెక్ పడేదెప్పుడు? భూఉష్ణోగ్రతలని పెంచుతున్న హరితవాయువులని అదుపు చేయలేమా?... పెరుగుతున్న జనాభా ఆహార అవసరాలని తీర్చడానికి మన దగ్గరున్న వనరులు సరిపోతాయా? ఇవేకాదు... ఇలాంటి వందల ప్రశ్నలకు హెంప్‌ను మించిన సమాధానం లేదని అంటున్నారు శాస్త్రవేత్తలు. మత్తు ప్రభావాన్ని కలిగించే కన్నాబిస్ మొక్కల కుటుంబానికే చెందినా.. హెంప్‌లో అటువంటి దుష్ప్రభావాలని కలిగించే రసాయనాల శాతం చాలా చాలా తక్కువ. దానికితోడు పారిశ్రామిక ప్రయోజనాలు లెక్కకుమించి ఉండటంతో అనేక దేశాల్లో ఈ మొక్కలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసి సాగుచేస్తున్నారు. ఇప్పటికే అమెరికా, లండన్, రష్యా, ఫ్రాన్స్ దేశాల్లో ఈ పంటని పండిస్తున్నారు.

- ఒమెగా-3, ఒమెగా-6 పోషకాలని పొందడానికి ఇంతవరకూ చేపలపైనే ఆధారపడ్డాం. ఇందుకోసం చేపలని విచక్షణారహితంగా వలవేసి పడుతున్నాం. మెదడుని చురుగ్గా ఉంచే ఒమెగా ఆమ్లాలని పొందడానికి వేరే సరైన ప్రత్యామ్నాయం లేకపోవడం కూడా ఇందుకు కారణం. హెంప్ గింజల్లో చేపల్లో కంటే అధికంగా ఒమెగా ఆమ్లాలు ఉండటంతో వాటి నుంచే ఒమెగా ఉత్పత్తులని తయారుచేస్తున్నారు.
- హెంప్ గింజల నూనెల్లో ఉండే కన్నాబిడాల్ లేదా సీబీడీ అనే ప్రత్యేక రసాయనం చర్మానికి మేలు చేస్తుంది. మాయిశ్చరైజర్ గుణాలు అధికంగా ఉండటంతో చర్మం మృదువుగా మారుతుంది. శిరోజాలని బలంగా ఉంచుతుంది.
- హెంప్ సాగు మీద అవగాహన వస్తే అటు రైతులకి... ఇటు వ్యాపారులకీ కూడా మేలే జరుగుతుంది. 100 శాతం ఆర్గానిక్ దుస్తులని తక్కువ ధరలో అందుకోవచ్చు. శీతాకాలంలో వెచ్చగా, వేసవిలో చల్లగా ఉండే ఈ బట్టని ఇతర రకాల వస్త్రాలతో కలిపి ఆఫీస్ వేర్, క్యాజువల్ వేర్‌గా తయారుచేయాలని, ఆ దిశగా ప్రభుత్వంతో కలిపి అడుగులు వేస్తున్నాను. ఆస్పత్రుల్లో వాడే బెడ్‌షీట్స్ , స్కూల్ పిల్లలకు అవసరం అయిన దుస్తులు, అప్పుడే పుట్టిన పిల్లలకు కావాల్సిన దుస్తులు తయారుచేయాలనేది నా లక్ష్యం.

– దివ్యజారాజ్,
హెంప్ పరిశోధకురాలు



**వస్త్రాల తయారీలో..**
ఒక కిలో పత్తి పండటానికి తొమ్మిదివేల లీటర్ల నీరు అవసరం అయితే... అంతే బరువున్న హెంప్‌పోచల తయారీకి రెండువేల లీటర్లు సరిపోతాయి. దాంతో ఆయా ప్రాంతాల్లో భూగర్భజలాల కొరత ఏర్పడకుండా ఉంటుంది. మూడు ఎకరాల్లో పత్తినుంచి వచ్చే ఉత్పత్తిని హెంప్ పంట కేవలం ఒక ఎకరం నుంచే అందిస్తుంది. మిగిలిన భూమిని ఆహారపంటల పెంపకానికి వాడుకోవచ్చు. ప్రపంచం మొత్తం మీద ఉత్పత్తిచేస్తున్న పురుగుమందులు, రసాయనాల్లో ... 25 శాతం వరకూ పత్తిపంటని కాపాడుకోవడం కోసమే వినియోగిస్తున్నారు. ఆ రసాయనాల కారణంగా భూమి, జల కాలుష్యం విపరీతంగా పెరుగుతోంది. కొన్ని రకాల జీవజాతులు అంతర్థానమవుతున్నాయి. అదే హెంప్ విషయానికొస్తే... పురుగులమందుల అవసరంకానీ, రసాయనాల అవసరం కానీ ఉండదు. అందుకే దీనిని ఆర్గానిక్ పంటగా చెప్పుకోవచ్చు. తక్కువ కాలంలోనే పంట చేతికొస్తుంది. దీంతో తయారయ్యే వస్త్రాలని పసిపిల్లల కోసం, ఆస్పత్రుల్లో ఎక్కువగా వినియోగిస్తారు. దీని దారపుపోగులు బలంగా ఉండటంతో షూస్, కాన్వాస్, వలలు, కార్పెట్ల తయారీలోనూ ఎక్కువగా వాడుతున్నారు.

**ఆటోమొబైల్ రంగంలో..**
ప్లాస్టిక్‌కి ప్రత్యామ్నాయంగా తయారుచేసిందే హెంప్‌ప్లాస్టిక్. భూమిలో కలిసే ఈ ప్లాస్టిక్‌ని స్కూటర్లు, డిజైనర్ కుర్చీలు, ఎలక్ట్రిక్ గిటార్ వంటి సంగీత పరికరాల తయారీలో వాడుతున్నారు. హెంప్ మొక్క కాండం నుంచి తీసిన ఫైబర్‌పోగులని కార్లలోని బూట్‌లైనింగ్స్, డోర్‌పానెల్స్ తయారీలో ఉపయోగిస్తున్నారు. ఫోర్డ్, బీఎమ్‌డబ్ల్యూ, మెర్సిడెజ్‌బెంజ్ వంటి కార్ల తయారీలో ఈ పోగులని ఇప్పటికే వాడుతున్నారు. తేలికపాటి విమానాల తయారీలో కూడా వాడే ఆలోచనలున్నాయి.

**భవన నిర్మాణంలో:** హెంప్, సున్నంతో కలిపి తయారుచేసే ఇటుక దిమ్మెలు ఉత్తమ ఉష్ణనిరోధకంగా పనిచేయడంతోపాటు, చెక్కకు ప్రత్యామ్నాయంగా మారడంతో భవన నిర్మాణాల్లో హెంప్ పాత్ర రోజురోజుకి పెరుగుతోంది. హెంప్‌క్రీట్‌గా పిలుచుకునే ఈ దిమ్మెలు ఆధునికతరం ఆర్కిటెక్ట్‌లకు అనుకూలంగా ఉండటంతో నయాతరం నిర్మాణాలకు ఈ హెంప్ అడ్రస్‌గా మారింది.

**కాగితం పరిశ్రమలో..**
రోజురోజుకి పెరుగుతున్న కాగితం అవసరాలకి హెంప్ సరైన సమాధానం ఇస్తుంది. దినపత్రికలకు కావాల్సిన న్యూస్‌ప్రింట్, ప్యాకేజింగ్ పరిశ్రమలకు అవసరం అయిన మందపాటి అట్టలని దీని నుంచి విరివిగా తయారుచేసుకొనే అవకాశం ఉంది.

**వ్యాధుల నివారణలో..**
హెంప్‌లోని ప్రత్యేకమైన ఫైటోకెమికల్స్‌కి వివిధ రకాల వ్యాధులని నయం చేసే గుణం ఉందని ఇప్పటికే నిరూపితం అయ్యింది. క్యాన్సర్, మల్టిపుల్‌స్క్లెరోసిస్, ఆస్తమా, పార్కిన్‌సన్, అల్జీమర్స్, నీటికాసులు, మూర్ఛ, ఆటోఇమ్యూన్ వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తుంది. వికారం, కీమోథెరపీ కారణంగా తలెత్తే దుష్ప్రభావాల నుంచి రక్షణ కలిగిస్తుంది.

**ఇంధన తయారీలో:** చెట్లని పులియబెట్టి చేసే హెంపోలైన్ నూనెలని వాతావరణాన్ని కలుషితం చేయని జీవ ఇంధనాలుగా వాడటం మొదలుపెట్టారు.



గ్యాడ్జెట్ గురూ

## గుండెకు తోడుగా..



సరికొత్త లుక్‌తో, మంచి ఫీచర్‌లతో సామ్‌సంగ్ స్మార్ట్‌వాచ్‌ని దేశీయ మార్కెట్‌లో అందుబాటులోకి తెచ్చింది. పేరు గెలాక్సీ వాచ్ యాక్టివ్ 2. ఎలక్ట్రోకార్డియోగ్రాం(ఈసీజీ) దీని ప్రత్యేకత. నిత్యం గుండె లయని మానిటర్ చేస్తూ ఆరోగ్య పరిరక్షణకు తోర్పడుతుంది. రెండు వేరియంట్స్‌లో ఈ వాచ్ అందుబాటులో ఉంది. తెర పరిమాణం 1.2(40ఎంఎం), 1.4అంగుళాలు(44ఎంఎం). 768 లేదా 1.5జీబీ ర్యామ్. 4జీబీ స్టోరేజీ. 9110 డ్యుయల్ కోర్ ప్రాసెసర్. 39వర్కవుట్స్ ట్రాక్ చేయడానికి ఇది ఉపయోగపడుతుంది. బ్లూటుత్ 5.0వి, వైఫై సదుపాయం ఉంది. బ్యాటరీ సామర్థ్యం 247ఎంఏహెచ్, 340ఎంఏహెచ్.

విడ్డూరం



## డ్రోన్ రక్షణ దళం..

ఇప్పటి వరకు మనం అనేక రకాల డ్రోన్ల గురించి విన్నాం.. వస్తువులను షిప్పింగ్ చేసే డ్రోన్‌లు.. విపత్తుల సమయంలో సహాయపడే డ్రోన్‌లు.. జియోగ్రాఫిక్ మ్యాపింగ్, వైల్డ్‌లైఫ్ మానిటరింగ్ డ్రోన్లు.. ఇలా అనేక రకాలుగా వాటిని వినియోగిస్తున్నారు. ఇప్పుడు కొత్తగా ఏఐ టెక్నాలజీతో తయారు చేసిన మినీ డ్రోన్లు వస్తున్నాయ్.. చూడ్డానికి చిన్న పిల్లలు ఆడుకునే వస్తువులా ఉన్నా అవి చేయగలిగే పనులు మాత్రం అన్నీ ఇన్నీ కాదు. అసలేంటి వీటి ప్రత్యేకత అంటారా? ఇవో రక్షణ సైన్యంలా రణరంగంలోకి దిగుతాయ్. సైనికులకు తోడుగా నిలిచేందుకు సిద్ధం అవుతున్నాయి. గురి పెట్టి ఫైరింగ్ మొదలెట్టాయంటే.. శత్రువులు అంతం అవ్వాల్సిందే. 'ఏఐ' టెక్నాలజీ తోడుగా ఇవి చేసే సాహస విన్యాసాలు అబ్బురపరుస్తున్నాయి. ఈ మైక్రో డ్రోన్‌లకు లక్ష్యాన్ని సెట్ చేసి వదిలితే చాలు. ట్రిగ్గర్ నొక్కాల్సిన పనిలేదు. పని పూర్తి చేస్తాయి. దీని సహాయంతో ఉగ్రవాదులను, వారి స్థావరాలను గుర్తించి అంతం చేయొచ్చు. మన స్మార్ట్‌ఫోన్‌లలో ఉంటున్న ఫేస్ రికగ్నిషన్ సిస్టం ఈ డ్రోన్‌లలోనూ అమర్చారు.



### ఎలా పని చేస్తాయి?

ఈ డ్రోన్‌కి ఫీల్డ్ కెమెరాలు, సెన్సర్లు, మరోవైపు ఫేస్ రికగ్నిషన్ సిస్టం అమర్చారు. దీని లోపలి భాగంలో మూడు గ్రాముల పేలుడు పదార్థం ఉంటుంది. ముందుగా టార్గెట్‌ని ఎంచుకొని ప్రోగ్రాంను కోడ్ చేయాలి. ఆ వ్యక్తి లేదా స్థావరానికి సంబంధించిన సమాచారం ఈ మైక్రో డ్రోన్‌కి తెలియజేస్తే చాలు ఇచ్చిన టార్గెట్ మిస్ అవకుండా పక్కాగా పనిపూర్తి చేస్తాయి స్టింగర్ మినీ వెపన్స్. ఇది మనుషుల కంటే 100రెట్ల వేగంతో పనిచేస్తుంది. జీపీఎస్ సిస్టం ద్వారా ఎంచుకున్న టార్గెట్‌పై దాడి చేస్తాయి. పని పూర్తిచేసే సమయంలో ఎలాంటి అడ్డంకి వచ్చినా వాటిని తప్పించి దూసుకుపోతోందీ డ్రోన్. ఫేస్ రికగ్నిషన్‌తో పాటు ఒక జీవి జెండర్, జాతి, నడక తదితర అంశాలను గుర్తిస్తుంది. ఇప్పటికే దీనిపై అనేక రకాల ప్రయోగాలు జరుగుతున్నాయి.

## జిఫ్ తయారు చేద్దాం

ఈ-కబుర్లు మీవే

సామాజిక మాధ్యమాల్లో GIF(జిఫ్) ట్రెండ్ తెగ హల్ చల్ చేస్తుంది. జీఐఎఫ్ అంటే గ్రాఫిక్ ఇంటర్‌ఫేస్ ఫార్మాట్. కావాల్సిన జీఐఎఫ్‌ని సెర్చ్ చేసుకొని సామాజిక మాధ్యమాల్లో ఉంచడం సులభమే. కానీ దాన్ని మీరే తయారు చేయాలంటే.. దీనికి కొన్ని వెబ్‌సైట్స్, యాప్స్ అందుబాటులో ఉన్నాయి. వాటిని ఉపయోగించి సులభంగా జిఫ్ ఫైల్స్‌ని తయారుచేయవచ్చు. అవే Ezgif, makeagif.com ఈ వెబ్‌సైట్లలో వీడియోని అప్‌లోడ్ చేసి జిఫ్‌గా మార్చవచ్చు. దాన్ని సోషల్ మీడియాలోనూ నేరుగా షేర్ చేయొచ్చు. అలాగే ప్రస్తుతం ఛాట్ చేయడానికి, షేర్ చేయడానికి, ఎడిటింగ్‌కి ఇలా ప్రతీ పనికీ ఓ యాప్ అందుబాటులో ఉంది. అలాగే జీఐఎఫ్ క్రియేట్ చేయడానికి కూడా ఒక యాప్ ఉంది. అదే GIPHY. ఈ యాప్ ద్వారా మనకు కావాల్సిన వీడియోను ఎంచుకొని దాన్ని జిఫ్‌గా మార్చుకోవచ్చు. సామ్‌సంగ్ సంస్థ తన గెలాక్సీ ఫోన్లకు బిల్ట్‌ఇన్‌గా ఈ జిఫ్ తయారు చేసుకునే సదుపాయం కల్పించింది.




– సాయి అఖిల్, హైదరాబాద్

## 'స్మార్ట్'గా ఎంచుకోండి

స్మార్ట్‌టీవీల వాడకం రోజురోజుకీ పెరుగుతుంది. అందుకు తగ్గట్టుగానే సాధారణ ప్రజలను దృష్టిలో ఉంచుకొని తక్కువ బడ్జెట్‌లో స్మార్ట్ టీవీలను తయారు చేస్తున్నాయి కంపెనీలు. మరి రూ. 15,000లోపు ధరల్లో స్మార్ట్‌టీవీ కొనాలనుకుంటున్నారా? అయితే ఈ టీవీలపై ఓ లుక్కేయండి.

బడ్జెట్‌లో...

**● షింకో ఎస్ఓ328ఏఎస్**
- తెర పరిమాణం: 32 అంగుళాలు
- రిజల్యూషన్: 1,366 x 768
- ప్రత్యేకతలు: ఆండ్రాయిడ్ ఇంటర్‌ఫేస్‌తో 10000లోపు దొరికే బడ్జెట్ టీవీ. ఆండ్రాయిడ్ 8.0తో పనిచేస్తుంది. ఆప్‌టాయిడ్ టీవీ యాప్ స్టోర్, వైఫై, రెండు హెచ్‌డీఎంఐ, రెండు యూఎస్‌బీ పోర్టులు.
- ధర: రూ. 9,999



**● ఎంఐ ఎల్ఈడీ టీవీ 4సీ ప్రో:**
- తెర పరిమాణం: 32 అంగుళాలు
- రిజల్యూషన్: 1,366 x 768
- ప్రత్యేకతలు: ఆండ్రాయిడ్ టీవీ. వైఫై, బ్లూటూత్, మూడు హెచ్‌డీఎంఐ, రెండు యూఎస్‌బీ పోర్టులు. డాల్బీ ఆడియో సపోర్టు.
- ధర: రూ. 12,499



**● డిటెల్ డీఐ32ఎస్ఎఫ్ఏ**
- తెర పరిమాణం: 32 అంగుళాలు
- రిజల్యూషన్: ఫుల్ హెచ్‌డీ
- ప్రత్యేకతలు: ఆండ్రాయిడ్ 6.0, 1జీబీ ర్యామ్, 8జీబీ స్టోరేజీతో డ్యుయల్ కోర్ ప్రాసెసర్, డాల్బీ ఆడియో, వైఫై, రెండు హెచ్‌డీఎంఐ, రెండు యూఎస్‌బీ పోర్టులు.
- ధర: రూ. 9,999






**● వీయూ అల్ట్రాస్మార్ట్ టీవీ**
- తెర పరిమాణం: 32 అంగుళాలు
- రిజల్యూషన్: 1,366 x 768
- ప్రత్యేకతలు: యూట్యూబ్, హాట్‌స్టార్, నెట్‌ఫ్లిక్స్ వంటి ప్రీలోడెడ్ యాప్స్, కీ బోర్డు, మౌస్ కనెక్ట్ సదుపాయం, వైఫై, మూడు హెచ్‌డీఎంఐ, రెండు యూఎస్‌బీ పోర్టులు. డాల్బీ ఆడియో సపోర్టు.
- ధర: రూ. 10,999

# ఈనాడు సినిమా

## రామోజీ ఫిలింసిటీలో ఛేజింగు.. ఫైటింగు.. లాఫింగు!


విజయ్ దేవరకొండ

రామోజీ ఫిలింసిటీలో విజయ్ దేవరకొండ కారు వేగంగా నడుపుతున్నారు. వెనక రౌడీలు వెంటాడుతున్నారు. అలా ఛేజింగ్ ఉత్కంఠగా కొనసాగుతుండగా అనూహ్యంగా విజయ్ కారు యాక్సిడెంట్‌కు గురైంది. ఆ తర్వాత ఏం జరిగిందన్నది తెరపైనే చూడాలి. విజయ్ కథానాయకుడిగా క్రాంతి మాధవ్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. క్రియేటివ్ కమర్షియల్స్ పతాకంపై కె.ఎస్.రామారావు నిర్మిస్తున్నారు. ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రలో నటిస్తోంది. ఈ సినిమా చిత్రీకరణ నాలుగు రోజుల పాటు రామోజీ ఫిలింసిటీలో జరిగింది. విజయ్ దేవరకొండ, మరికొంత మంది జూనియర్ ఆరిస్టులపై యాక్షన్ కొరియోగ్రాఫర్ కనల్ కణ్నన్ నేతృత్వంలో ఛేజింగ్, యాక్సిడెంట్ సన్నివేశాలను తెరకెక్కించారు. మరో వైపు నాని కథానాయకుడిగా ఇంద్రగంటి మోహనకృష్ణ తెరకెక్కిస్తున్న 'వి' సినిమా చిత్రీకరణ కూడా రామోజీ ఫిలింసిటీలో జరుగుతోంది. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమాకు సంబంధించి హాస్య సన్నివేశాలను ఇక్కడ తెరకెక్కిస్తున్నారు. వచ్చే నెల 6 వరకూ ఈ షెడ్యూల్ కొనసాగనుంది. ప్రముఖ నటుడు అర్జున్ మేనల్లుడు ధ్రువ క్లైమాక్స్ ఫైట్‌కు రెడీ అయ్యాడు. ఆయన ఢీకొట్టబోతున్నది ఆషామాషీ వ్యక్తి కాదు.. ప్రముఖ అమెరికన్ బాడీబిల్డర్ కై గ్రీనీ. వారిద్దరిపై గణేష్ మాస్టర్ నేతృత్వంలో పోరాట సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్నారు. మరికొంత మంది విదేశీ ఫైటర్లు కూడా పాల్గొంటున్నారు. ఇదంతా 'పొగరు' చిత్రం కోసం. ధ్రువ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రమిది. రష్మిక మందన్నా కథానాయిక. నందకిషోర్ దర్శకత్వం వహిస్తున్నారు. బికె గంగాధర్ నిర్మాత. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ భాషల్లో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు తెలిపారు నిర్మాత.


ధృవ


వరుణ్‌తేజ్

## బల్గేరియాలో భీమ్


ఎన్టీఆర్

కొమరం భీమ్, అల్లూరి సీతారామరాజు... వీరిద్దరూ వేర్వేరు ప్రాంతాలకు చెందిన పోరాట యోధులు. వీరిద్దరూ కలిసినట్లు నిరూపించే చారిత్రక ఆధారాలు లేవు. కానీ కొమరం భీమ్, అల్లూరి కలిస్తే ఎలా ఉంటుంది? అనే వినూత్న ఆలోచనకు తెరరూపం ఇస్తున్నారు రాజమౌళి. ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఆర్ ఆర్ ఆర్'. కొమరం భీమ్‌గా ఎన్టీఆర్, అల్లూరిగా రామ్‌చరణ్ నటిస్తున్నారు. ఆలియా భట్ కథానాయిక. డీవీవీ దానయ్య నిర్మాత. ప్రస్తుతం బల్గేరియాలో చిత్రీకరణ జరుగుతోంది. మంగళవారం నుంచి ఎన్టీఆర్ తదితరులపై ఓ యాక్షన్ ఘట్టాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ పోరాట సన్నివేశం కోసం ఎన్టీఆర్ ప్రత్యేకంగా ముందస్తు శిక్షణ కూడా తీసుకున్నారు. హాలీవుడ్ యాక్షన్ నిపుణుల ఆధ్వర్యంలో ఈ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్నారు. సెప్టెంబరు తొలి వారం వరకూ చిత్రబృందం అక్కడే ఉంటుంది. 'ఆర్ ఆర్ ఆర్' కోసం హైదరాబాద్‌లో ఓ ప్రత్యేకమైన సెట్‌ని తీర్చిదిద్దిన సంగతి తెలిసిందే. అక్కడ కొంతమేర షూటింగ్ జరిగింది. 2020 జులై 30న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

## గ్యాంగ్ లీడర్‌కి దారిచ్చిన వాల్మీకి

సెప్టెంబరు 13న రెండు చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రావాల్సింది. 'గ్యాంగ్ లీడర్', 'వాల్మీకి' అదే రోజున విడుదలకు సిద్ధమయ్యాయి. అయితే... ఇప్పుడు 'వాల్మీకి' మనసు మార్చుకున్నాడు. సెప్టెంబరు 20న ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి దర్శక నిర్మాతలు నిర్ణయించుకున్నారు. వరుణ్‌తేజ్ కథానాయకుడిగా నటించిన చిత్రమిది. పూజా హెగ్డే నాయిక. హరీష్ శంకర్ దర్శకుడు. 14 రీల్స్ ప్లస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించింది. మంగళవారం హైదరాబాద్‌లో ప్రొడ్యూసర్స్ గిల్డ్ ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో 'వాల్మీకి' కొత్త విడుదల తేదీని ప్రకటించారు.

### మంచి సంప్రదాయం: దిల్‌రాజు

ఒకేరోజు రెండు సినిమాలు విడుదల అవ్వడం మంచి పద్ధతి కాదని, రెండు చిత్రాలూ నష్టపోకుండా నిర్మాతలిద్దరూ మాట్లాడుకుని ఈ నిర్ణయం తీసుకోవడం మంచి సంప్రదాయమని నిర్మాత దిల్ రాజు అన్నారు. "సాహో" ఈనెల 15న విడుదల కావాల్సింది. కానీ 30కి వెళ్లింది. దాంతో సెప్టెంబరు 13 తేదీన రెండు సినిమాలు విడుదలకు సిద్ధమయ్యాయి. అయితే 'గ్యాంగ్ లీడర్', 'వాల్మీకి' నిర్మాతలిద్దరూ ఓ అభిప్రాయానికి రావడంతో 'వాల్మీకి' 20కి వెళ్లింది. పండగ రోజులు మినహా మిగతా రోజుల్లో సినిమాల మధ్య ఈతరహా పోటీ మంచిది కాదు. నిర్మాతలిద్దరూ ప్రొడ్యూసర్ గిల్డ్ సభ్యులే. విడుదల తేదీ మార్చుకోమని గిల్డ్ ఎవ్వరినీ బలవంతం చేయదు. ఇది నిర్మాతలు తీసుకున్న నిర్ణయమే" అన్నారు. ఈ కార్యక్రమంలో గోపీ ఆచంట, రామ్ ఆచంట, నవీన్ ఎర్నేని, దామోదర ప్రసాద్, రవి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## గురుశిష్యుల సవాల్


టైగర్ ష్రాఫ్, హృతిక్ రోషన్

బాలీవుడ్ కథానాయకులు హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న భారీ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'వార్'. వాణీ కపూర్ కథానాయిక. 'బ్యాంగ్ బ్యాంగ్' దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ తెరకెక్కిస్తున్నారు. యష్‌రాజ్ ఫిలింస్ నిర్మిస్తున్న ఈ సినిమా ట్రైలర్‌ను తాజాగా హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లో విడుదల చేశారు. కబీర్ అనే రెబల్ ఆర్మీ అధికారిగా హృతిక్, అతణ్ని పట్టుకొని మట్టుబెట్టడానికి ప్రయత్నించే మరో సైనికాధికారి ఖలీల్‌గా టైగర్ ష్రాఫ్ నటిస్తున్నారు. యుద్ధవిద్యల్లో టైగర్‌కు శిక్షణ ఇచ్చిన గురువుగా హృతిక్ కనిపించనున్నట్లు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. అయితే ఆ తర్వాత వారిద్దరే ప్రత్యర్థులుగా తలపడాల్సి వస్తుంది. గురుశిష్యులు పరస్పరం విసురుకునే సవాళ్లు, ఇద్దరి మధ్య వచ్చే పోరాట సన్నివేశాలు సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాయి. అక్టోబరు 2న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు.

## పల్లెలు బాగుంటేనే...


జె.ఎల్.శ్రీనివాస్

జె.ఎల్.శ్రీనివాస్ కథానాయకుడిగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఝాన్సీరెడ్డి నిర్మాత. ప్రముఖ దర్శకుడు కె.విశ్వనాథ్ సమక్షంలో, పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది చిత్రం. "పల్లె సంస్కృతి గొప్పదని చాటి చెప్పే చిత్రమిది. పల్లెలు బాగుంటేనే పట్టణాలు బాగుంటాయి. అందరూ పట్టణాలకొస్తే పల్లెల బాగోగులు ఎవరు పట్టించుకుంటారని ప్రశ్నించే కథ, కథనాలు ఇందులో ఉంటాయి. కోనసీమ, అరకుతోపాటు తెలంగాణలోని కొన్ని ప్రదేశాల్లో చిత్రీకరణ జరపబోతున్నాం. నటీనటులు, సాంకేతిక బృందం వివరాల్ని త్వరలోనే వెల్లడిస్తాం" అన్నారు జె.ఎల్.శ్రీనివాస్.

## వారధులు... రథసారధులు


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సినీ ప్రముఖులు

"దర్శకనిర్మాతల మధ్య వారధిగా నిలుస్తూ... సినీ రూపకల్పనలో రథసారథులుగా వ్యవహరించేవారే ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్. సినీ మహోత్సవం పేరిట వాళ్లు జరుపుతున్న వేడుకని పరిశ్రమంతా కలిసి జయప్రదం చేయాల"ని పలువురు సినీ ప్రముఖులు పిలుపునిచ్చారు. తెలుగు సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ యూనియన్ ఏర్పాటై 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సెప్టెంబరు 8న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో రజతోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కర్టెన్ రైజర్ కార్యక్రమం జరిపారు. టి.సుబ్బరామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బ్రోచర్‌ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ రజతోత్సవాన్ని జరుపుకోనుండడం సంతోషంగా ఉంది" అన్నారు. "పరిశ్రమ ఈ వేడుకకి సహకారం అందిస్తుంది. ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్, మేనేజర్లు లేకుండా సినీ నిర్మాణం పూర్తి కాదు" అన్నారు సి.కల్యాణ్. "పరిశ్రమలో జరిగిన ప్రతి వేడుకకీ ముందుండి విజయవంతం చేశారు ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్" అన్నారు రాజశేఖర్. బ్రోచర్‌లో కొద్దిమంది తారల ఫొటోలు మాత్రమే ఉండటంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ యూనియన్ అధ్యక్షుడు అమ్మిరాజు మాట్లాడుతూ "కార్యక్రమంలో చిన్న పొరపాట్లు ఏమైనా ఉంటే పెద్ద మనసుతో క్షమించాలి. వేడుకకి అందరి సహకారం అందుతోంది" అన్నారు. ఈ కార్యక్రమంలో వి.కె.నరేష్, జీవిత, హేమ, అల్లరి నరేష్, సందీప్‌కిషన్, రెజీనా, ప్రగ్యా జైశ్వాల్, శివ బాలాజీ, రాజీవ్ కనకాల, వెన్నెల కిషోర్, బొమ్మరిల్లు భాస్కర్, బాబీ, ఉత్తేజ్, సంపూర్ణేష్ బాబు, దామోదర్‌ప్రసాద్, ఎమ్.ఎల్. కుమార్ చౌదరి, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**పంచ్ డైలాగ్**

పవర్ ఉంటే సరిపోదు. అది ఎవరి మీద ఉపయోగించాలో కూడా తెలుసుకో.
చిత్రం: రణరంగం
– పంపినవారు: బి.ప్రసాద్, బాగల్లు

## ఫాల్కే మనవడు ముఖ్య అతిథిగా..

"భారతీయ చిత్ర పరిశ్రమ ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చుకోవడంలో దక్షిణాది చిత్ర పరిశ్రమ కృషి ఎంతో ఉంద"న్నారు దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ సీఈవో అభిషేక్ మిశ్రా. దాదాసాహెబ్ ఫాల్కే దక్షిణాది పురస్కారాలు - 2019 వేడుకని హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. వచ్చే నెల 20న జరిగే ఈ వేడుకకి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ ఇ.ఎస్.ఎల్.నరసింహన్‌తో పాటు దాదాసాహెబ్ ఫాల్కే మనవడు సి.ఎస్. పుసాల్కర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని అభిషేక్ తెలిపారు. ఈ వేడుకల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ "పురస్కార వేడుకకి దక్షిణాదికి చెందిన నాలుగు భాషల సినీ ప్రముఖులు హాజరవుతారు. 15 విభాగాల్లో పురస్కారాలు అందిస్తాం" అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌రావ్, వినయ్, యశ్, రాకేష్, పవన్, సిమ్రన్ ఆహూజా తదితరులు పాల్గొన్నారు.


తమన్నా

## కాస్త ఆలస్యమైనా కానీ..

"కలలు కనడంలో తప్పు లేదు. కానీ అంతే వేగంగా ఫలితాలు రావాలని మాత్రం ఆశపడకూడదు" అంటోంది తమన్నా. పదిహేనేళ్ల వయసులోనే చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన కథానాయిక ఈమె. అంచెలంచెలుగా స్టార్ కథానాయిక స్థాయికి ఎదిగింది. దక్షిణాదితో పాటు హిందీలోనూ చిత్రాలు చేస్తోంది. చిన్నప్పట్నుంచే సినిమా కలలు కన్నానని, వాటిని సాకారం చేసుకోవడమే లక్ష్యంగా చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టానని చెబుతోంది తమన్నా. "చాలామందిలాగే నేనూ బోలెడన్ని కలల్ని మోసుకొని వచ్చా. కానీ ఏ రోజూ అతిగా ఆశ పడలేదు. రాత్రికి రాత్రే అద్భుతాలు జరిగిపోవాలనే ఆలోచనలు నాకెప్పుడూ రాలేదు. నా తపన, ఆత్రుతని పని వరకే చూపించా. ఫలితాల గురించి ఓపికతోనే ఎదురు చూశా. కాస్త ఆలస్యమైందేమో కానీ... నేను ఊహించిన విజయాలు, అవకాశాలన్నీ చేతికందాయి. ఏ రంగంలో ఉన్నా సరే... ఫలితాల గురించి మరీ ఎక్కువగా ఆలోచిస్తూ కూర్చోకూడదు. నిరాశ, నిస్పృహల్ని దరిచేరనీయకుండా కష్టపడితేనే మన కలలు సాకారం అవుతాయ"ని చెప్పింది తమన్నా. త్వరలో ఆమె 'సైరా నరసింహారెడ్డి' చిత్రంతో సందడి చేయబోతోంది.

## భామ కాదు... బాంబు!


పాయల్ రాజ్‌పుత్

'ఆర్.ఎక్స్ 100'తో తొలి చూపులోనే ఆకట్టుకుంది పాయల్ రాజ్‌పుత్. ఆ సినిమాతో ఆమెకు వరుసగా అవకాశాలు అందాయి. దాదాపుగా అన్నీ గ్లామర్ పాత్రలే. 'ఆర్.డి.ఎక్స్'లో మాత్రం వాటికి విభిన్నంగా కనిపించబోతోంది. తేజస్ కథానాయకుడిగా నటించిన చిత్రమిది. పాయల్ నాయిక. భాను శంకర్ దర్శకుడు. సి.కల్యాణ్ నిర్మాత. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. "సరికొత్త కథ కథనాలతో సాగే చిత్రమిది. పాయల్ పాత్ర ఆశ్చర్యపరుస్తుంది. సినిమాకి ఈ పేరు ఎందుకు పెట్టామన్నది తెరపైనే చూడాలి. ప్రేమ, వినోదం, సెంటిమెంట్‌తో పాటు మరో ఆసక్తికరమైన అంశం కూడా కథలో ఉంది. అదే ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ. త్వరలోనే టీజర్‌ని విడుదల చేస్తామ"న్నారు దర్శక నిర్మాతలు.

## రాజకీయ వ్యంగ్యాస్త్రం


ఈస్టర్ అనిల్

ఈస్టర్ అనిల్, రోహిణి, శుభలేఖ సుధాకర్, ఈశ్వరీరావు ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'జోహార్'. తేజ మార్ని దర్శకుడు. భాను సందీప్ నిర్మాత. ప్రీ లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "రాంగోపాల్ వర్మ దగ్గర 'వంగవీటి' చిత్రానికి దర్శకత్వ శాఖలో పనిచేశాను. విజయేంద్ర ప్రసాద్‌గారి దగ్గర రచనలో మెలకువలు తెలుసుకున్నాను. ఆ అనుభవంతో తెరకెక్కించిన చిత్రమిది. ఐదు పాత్రల చుట్టూ సాగే రాజకీయ వ్యంగ్యాస్త్రం 'జోహార్'. ప్రస్తుత రాజకీయ, సామాజిక పరిస్థితులకు అద్దం పడుతుంది. వారణాసి, రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్నం తదితర ప్రదేశాల్లో చిత్రీకరణ జరిపామ"న్నారు. సంగీతం: ప్రియదర్శన్.



అలంకరణలో గోళ్లూ ఓ భాగమే. అవి ఆరోగ్యంగా ఉంటేనే అందంగా కనిపిస్తాయి. మేనిక్యూర్, పెడిక్యూర్‌లు చేయించుకోవడమే కాదు... వాటి విషయంలో రోజూ తగినంత శ్రద్ధ తీసుకోవాలి. నెయిల్ ఆర్ట్ వేసుకోవడంలో సులువైన మెలకువలు పాటించాలి.

# గోళ్లపై రంగుల హంగామా







## గోళ్లకూ క్లెన్సింగ్...

ముందుగా చేతుల్ని కాస్త వంటసోడా వేసిన నీళ్లతో శుభ్రపరుచుకోవాలి. గోరువెచ్చని నీళ్లల్లో కాస్త పంచదార, గులాబీ రేకలు, ఏదైనా ఎసెన్షియల్ ఆయిల్, రెండు చుక్కల లిక్విడ్ సోప్ వేసి అందులో చేతివేళ్లను ఐదు నిమిషాలు ఉంచాలి. తరువాత చల్లటి నీళ్లతో కడిగేసి పొడివస్త్రంతో తుడవాలి. ఈ ప్రక్రియ అయ్యాక రెండు చుక్కల బాదం నూనెను వేళ్లకు రాసుకుని మృదువుగా మర్దన చేసి, గోళ్లు కత్తిరించుకోవాలి. అవి తేమను కోల్పోకుండా ఉంటాయి. గోళ్లచుట్టూ ఉన్న చర్మానికి కొద్దిగా మాయిశ్చరైజర్ రాసుకోవాలి.

## రంగు వేసే పద్ధతి...

మొదట బేస్‌కోట్ వేసుకోవాలి. ఇది గోళ్లపై మరకలు పడకుండా కాపాడుతుంది. ఆరాక మీకు నచ్చిన రంగుని పల్చగా వేసుకోవాలి. అది ఆరాక మరో పొర వేయాలి. చివరిగా టాప్ కోట్ వేసుకోవాలి. రంగు ఎక్కువ కాలం నిలిచి ఉంటుంది. ఈ రోజుల్లో అమ్మాయిలు నెయిల్ ఆర్ట్‌ని ఇష్టపడుతున్నారు. దాన్ని ఇంట్లోనే సులువుగా ప్రయత్నించవచ్చు. ఎలాగంటే...

**రంగులతో:** ముదురు, లేత ఛాయల్లో రంగులు తీసుకోవాలి. మీకు నచ్చిన వర్ణాన్ని గోళ్లకు వేసుకోవాలి. అది ఆరాక మరో రంగుతో అక్కడక్కడా చుక్కలు లేదా నిలువు గీతల్ని గీయాలి. లేదంటే నచ్చిన ఆకృతిలో మైక్రో స్టెన్సిల్ అంటించి దానిపై రంగు వేస్తే చాలు. మెరుపుల్నీ జతచేస్తే గోళ్లు జిగేల్‌మంటాయి.

**పూసలు, రాళ్లు:** బజారులో మైక్రోబీడ్స్ దొరుకుతాయి. గోళ్లరంగు, పూసలు ఒకే రంగులో ఉండేలా చూసుకోవాలి. ముందుగా రెండు కోట్‌లు వేసుకుని వేలిని పూసలున్న సీసాలో ముంచండి. అవి చక్కగా అమరిపోతాయి. ఆరాక పైన పారదర్శకంగా ఉండే మరో నెయిల్‌పాలిష్ కోట్‌ని వేస్తే చాలు. గమ్‌లో ముంచిన స్టోన్, చిప్స్ వంటివీ అతికించుకోవచ్చు.

## ఈ చిట్కాలూ తప్పనిసరి...

గోళ్లపై క్రిములు, బ్యాక్టీరియా వృద్ధి చెందకుండా ఉండాలంటే... వాటిని శుభ్రంగా, పొడిగా ఉంచుకోవాలి. ఎక్కువ సేపు నీళ్లల్లో నానితే అవి విరిగిపోయే ప్రమాదం ఉంది. బట్టలు ఉతికినా, గిన్నెలు తోమినా... గ్లవుజులు వేసుకోవడం మంచిది. టూత్‌బ్రష్‌పై కాస్త ఉప్పు వేసి గోళ్ల చుట్టూ మృదువుగా రుద్దితే మురికి, మట్టి వంటివి వదిలిపోతాయి.

- క్యాల్షియం, బయోటిన్, విటమిన్ ఇ, ఇనుము, మాంసకృత్తులు, జింక్ వంటి పోషకాలన్నీ గోళ్ల ఆరోగ్యానికి అవసరం. మీ ఆహారంలో సోయా, బీట్‌రూట్, తృణధాన్యాలు, ఆకుకూరలు... వంటివన్నీ భాగం చేసుకోవాలి.



- జెల్స్, అక్రిలిక్స్ రంగులు చూడ్డానికి బాగున్నా... వీటికి వీలైనంత దూరంగా ఉండటమే మంచిది. లేదంటే ఇవి గోళ్లను పొడిబారేలా చేస్తాయి. పారాబిన్, సల్ఫేట్, ఎసిటోన్ వంటి రసాయనాలు లేని రంగుల్ని వాడాలి. వాటివల్ల గోళ్లు పేలవంగా, పెళుసుగా మారతాయి. పొడిబారి త్వరగా చిట్లిపోతాయి.

# కాళ్లు బొబ్బలెక్కినా పరుగు ఆపలేదు!

ఆమె జడ్పీ ఛైర్‌పర్సన్... భర్త ఎమ్మెల్యే. రాజకీయాల్లో క్షణం తీరికలేకపోయినా... తనకు ఇష్టమైన పరుగును వదలడంలేదు. మారథాన్‌లలో పరుగులు తీస్తూ... జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో గుర్తింపు తెచ్చుకుంటోంది. ఆమే వరంగల్ రూరల్ జిల్లా జడ్పీ అధ్యక్షురాలు 49 ఏళ్ల గండ్ర జ్యోతి. తాజాగా హైదరాబాద్‌లో 10కె రన్ పూర్తి చేసిన సందర్భంగా ఆమె తన గురించి చెప్పుకొచ్చిందిలా...





చాలామంది మహిళలు ముప్పైలు దాటగానే తాము ఏదీ సాధించలేమని అనుకుంటారు. వయసుతో సంబంధం లేకుండా ఏదైనా సాధించొచ్చని మారథాన్‌లు మొదలు పెట్టాకే తెలుసుకున్నా. ఆరోగ్యం, ఆనందం, ఆత్మవిశ్వాసం... అన్నీ నాకు పరుగుతోనే సాధ్యమయ్యాయని ధైర్యంగా చెప్పగలను. మూడేళ్లుగా ఈ మారథాన్‌లలో పాల్గొంటున్నా. తాజాగా హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో జరిగిన హాఫ్ మారథాన్‌లో పాల్గొన్నా. ఇంత కష్టపడటానికి కారణం లేకపోలేదు.

**థైరాయిడ్ తగ్గించుకున్నా:** కొన్నాళ్లక్రితం మేం హైదరాబాద్‌లో ఉండేవాళ్లం. కాసుబ్రహ్మానందరెడ్డి పార్కులో రోజూ వ్యాయామం చేసేదాన్ని. అక్కడే నాకు మారథాన్ సంఘం గురించి తెలిసింది. ఏ మాత్రం ఆలోచించకుండా సాధన మొదలుపెట్టా. పాప పుట్టినప్పుడు థైరాయిడ్ వచ్చింది. దాన్ని తగ్గించుకోవడానికి యోగా, వ్యాయామం చేసేదాన్ని. మందుల్లేకుండానే థైరాయిడ్ తగ్గింది. మొదట్లో రెండు కిలోమీటర్లు సైతం పరుగెత్తలేకపోయేదాన్ని. క్రమంగా 21 కిలోమీటర్ల హాఫ్ మారథాన్, 42 కిలోమీటర్ల ఫుల్ మారథాన్ చేసే స్థాయికి చేరుకున్నా. నాతోపాటు పరుగు మొదలుపెట్టిన కొందరు కీళ్లు, ఒళ్లు నొప్పులు భరించలేక మానేశారు. నేను సమస్యలెన్ని ఎదురైనా వెనకడుగు వేయలేదు. పరుగు మొదలుపెట్టిన ఏడాదిలోనే విశాఖపట్నంలో జరిగిన హాఫ్ మారథాన్ పూర్తి చేశా. కొన్నాళ్లకే ముంబయిలో జరిగిన 42.2 కిలోమీటర్ల మారథాన్‌ను 4.55 గంటల్లో పూర్తిచేయగలిగా. వెంటనే హైదరాబాద్‌లోని జరిగిన 55 కిలోమీటర్ల పోటీల్లో పాల్గొన్నా. ఆ రోజు నా రెండు కాలివేళ్ల గోళ్లు ఊడిపోయాయి. బొబ్బలెక్కాయి. చాలా కష్టంగా అనిపించినా సాధించగలిగా. వీటన్నింటి తరువాత నా దృష్టి విదేశాల్లో జరిగే మారథాన్‌లపై పడింది. దుబాయ్ మొదలు మరికొన్నింటికి వెళ్లా. దుబాయ్‌లో విపరీతమైన వేడి ఉంటుంది. ఉదయం 10 గంటలకు పరుగు ప్రారంభించినా తట్టుకుని సాధించా. కాకపోతే 5 గంటలకు పైగానే పట్టింది. ఇప్పుడైతే గంటకు 8 కిలోమీటర్ల వేగంతో పరుగెత్తగలను.

**ఎన్నో ప్రయోజనాలు :** శారీరక శ్రమ లేకపోవడంతో మనలో చాలామంది అనారోగ్యాల బారిన పడుతున్నారు. పిల్లలు చిరుతిళ్లు తిని ఊబకాయం బారిన పడుతున్నారు. ఇలాంటివారు కాసేపు నడిచినా, పరుగు పెట్టినా మంచిదే. ఎన్ని పనులున్నా సరే... నేను రోజూ గంటసేపు పరుగెత్తుతా. అదే నా ఆరోగ్య రహస్యం.

**ఆరింటినీ పూర్తిచేయాలని...**

ప్రపంచంలో ఆరు పెద్ద మారథాన్లు ఉంటాయి. జర్మనీలో బెర్లిన్, అమెరికాలో బోస్టన్, షికాగో, న్యూయార్క్, లండన్, జపాన్‌లోని టోక్యోలో జరుగుతాయవి. నా లక్ష్యం వాటిని పూర్తిచేయడం. బెర్లిన్, బోస్టన్ మారథాన్‌లు పూర్తి చేశా. బోస్టన్‌లో ఏకంగా 37 వేల మంది పాల్గొన్నారు. వారందరితో కలిసి పరుగెడుతుంటే చాలా ఉత్సాహంగా అనిపించింది. అదే సమయంలో జడ్పీ ఎన్నికలు. అంత ఒత్తిడిలోనూ పరుగుకు దూరం కాలేదు. త్వరలో మిగతా నాలుగు అంతర్జాతీయ మారథాన్‌లూ పూర్తిచేసే ప్రయత్నంలో ఉన్నా.

**- జి.పాండురంగ శర్మ,** ఈనాడు, వరంగల్




## నజరానా

కూరలో ఉప్పు ఎక్కువైందా... కొద్దిగా గోధుమపిండిని తీసుకుని చపాతీపిండిలా కలుపుకోవాలి. దీన్ని చిన్నచిన్న ఉండల్లా చేసుకుని కూరలో వేసి కాసేపయ్యాక తీసేయాలి. అవి అధిక ఉప్పును పీల్చేస్తాయి.

# దుస్తుల్ని అద్దెకు ఇవ్వాలనుకుంటున్నా ఎలా?

? వేడుక చిన్నదైనా ఖరీదైన డిజైనర్ దుస్తులకే ప్రాధాన్యం ఇస్తున్నారు చాలామంది. ఆపై వాటిని ఒకటి రెండుసార్లు వాడి పక్కన పడేస్తున్నారు. దీనివల్ల డబ్బు వృథా. ఇది గమనించాకే తక్కువ ధరలో సందర్భాలకు తగినట్లుగా వేసుకునేలా డిజైనర్ దుస్తులు అద్దెకు ఇవ్వాలనుకుంటున్నా. నా ప్రణాళిక ఎలా ఉండాలి... తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి? పెట్టుబడి ఎంత అవసరం?

**- ప్రేరణ,** బెంగళూరు

డియర్ వసుంధర



మోజేష్ కుమార్
బ్రాండ్ కన్సల్టెంట్



✔ మీరన్నది నిజమే! గంటా, రెండుగంటల పాటు జరిగే ఓ చిన్న వేడుకకి సైతం వేల రూపాయల దుస్తుల్ని కొంటున్నారు. ఆపై పక్కన పెట్టేస్తున్నారు. తరువాత డబ్బుల్ని వృథా చేశామని బాధపడుతున్నారు. ఈ పరిస్థితికి చెక్ పెట్టేందుకు ఇప్పటికే కొన్ని సంస్థలు తక్కువ ధరకే డిజైనర్ దుస్తుల్ని అద్దెకిస్తున్నాయి. ఈ పద్ధతి విదేశాల్లో ఎప్పటి నుంచో ఉంది. మెట్రో నగరాల్లో యువత ఇప్పుడిప్పుడే వీటిని వినియోగించుకుంటున్నారు. ముందు మీరో చిన్నపాటి అధ్యయనం చేయండి. ఇప్పటికే దుస్తులు అద్దెకు ఇస్తోన్న సంస్థల పనితీరుని గమనించండి. కొన్ని దుస్తుల్ని ప్రత్యేకంగా డిజైన్ చేయించి అందుబాటులో ఉంచుకోండి. ఒక్కోదానికి ఒక్కోధరను నిర్ణయించండి. ఓ వాట్సాప్ గ్రూప్‌ని ప్రారంభించి దాని ద్వారా దుస్తుల్ని అద్దెకు ఇవ్వడం మొదలుపెట్టండి. ఇలా ఓ ఆరునెలలు చేయగలిగితే...ఆ వ్యాపారంలోకి అడుగుపెట్టడం వల్ల ఎదురయ్యే కష్టనష్టాలు, లాభాలు తెలుస్తాయి. తరువాత పూర్తిస్థాయిలో వ్యాపారంగా మలచుకోవచ్చు. అప్పుడు ఓ బ్రాండ్‌నేమ్ తప్పనిసరి. మీ కంపెనీకి మీరు సోల్ ప్రొప్రయిటర్‌గా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఆన్‌లైన్ వ్యాపారం కాబట్టి జీఎస్టీ రిజిస్ట్రేషన్ తప్పనిసరి. కంపెనీ పేరుమీద ఒక కరెంట్ అకౌంట్ తీసుకుని సంస్థ లావాదేవీలు మొదలుపెట్టవచ్చు. సంస్థ పేరుమీద వెబ్‌సైట్, యాప్‌లను తయారు చేయించుకోవాలి. గూగుల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం వంటి వాటి ద్వారా ప్రచారం చేయడానికి తగిన ఆర్థిక వనరుల్ని సమకూర్చుకోవాలి. ఇందుకోసం కొన్నాళ్లపాటు కనీసం నెలకు పదిహేనువేల రూపాయలు ఖర్చవుతాయి. పూర్తిస్థాయిలో సంస్థ, వార్డ్‌రోబ్ సిద్ధం చేసుకునేందుకు దుస్తుల డిజైనింగ్ కోసం ఐదారులక్షల రూపాయలు, వెబ్‌సైట్, యాప్ డెవలప్‌మెంట్ కోసం మరో రెండు లక్షలు అవసరం. బొటిక్‌లతో ఒప్పందం కుదుర్చుకోవడం వల్ల కొంతమేర ఖర్చు తగ్గించుకోవచ్చు. వినియోగదారుల నుంచి తిరిగి వచ్చిన దుస్తుల్ని శుభ్రపరచడం, భద్రపరచడం వంటివాటికీ కొంత ఖర్చవుతుంది.

ఇంటి దగ్గరే ఉండి ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలనుకున్న మహిళలకు ఇది చక్కని అవకాశం. వ్యాపారం చేయాలనుకున్నా, మార్కెటింగ్‌లో మెలకువలు తెలుసుకోవాలనుకున్నా, కొత్త అంశాల్లో శిక్షణ తీసుకోవాలనుకున్నా... మీకున్న సందేహాలను మాకు పంపించండి. వాటికి సమాధానాలు అందించే ప్రయత్నం మేం చేస్తాం! మా చిరునామా... email: vasundhara@eenadu.net

## బంగారం-వెండి

**27న ముగింపు-క్రితం**

| | ముగింపు | క్రితం |
|---|---|---|
| **హైదరాబాద్** | | |
| బంగారం (24క్యా) | 39,850 | 39,940 |
| ఆర్నమెంట్ | 37,150 | 37,600 |
| వెండి (కిలో) | 46,730 | 46,840 |
| **విజయవాడ** | | |
| బంగారం (24క్యా) | 40,040 | 38,300 |
| ఆర్నమెంట్ | 37,080 | 35,600 |
| వెండి (కిలో) | 47,000 | 46,300 |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24క్యా) | 38,500 | 38,400 |
| ఆర్నమెంట్ | 35,450 | 35,460 |
| వెండి (కిలో) | 45,700 | 45,700 |
| **రాజమహేంద్రవరం** | | |
| బంగారం (24క్యా) | 39,720 | 39,930 |
| ఆర్నమెంట్ | 36,640 | 36,910 |
| వెండి (కిలో) | 47,000 | 46,700 |
| **విశాఖపట్నం** | | |
| బంగారం (24క్యా) | 39,620 | 39,980 |
| ఆర్నమెంట్ | 36,850 | 37,180 |
| వెండి (కిలో) | 47,500 | 47,000 |
| **తమిళనాడు** | | |
| బంగారం ఆర్నమెంట్ (గ్రా) | 3,680 | 3,685 |
| వెండి (గ్రా) | 50.00 | 49.80 |

(రూ. లలో)

# పజిల్‌తో పదును

మహిళల్లో ఒత్తిడి మామూలే. దీన్నుంచి బయటపడాలంటే... అప్పుడప్పుడూ రకరకాల పజిల్స్ పూర్తిచేసేందుకు ప్రయత్నించండి. వాటిని తరచూ సాధన చేస్తుంటే మరెన్నో ప్రయోజనాలూ ఉన్నాయి.

- ఏది ఎక్కడ అమరుతుందోనని పజిల్ గురించి ఆలోచించడం, ఒకేదానిపై ఎక్కువ సేపు దృష్టిపెట్టడం వల్ల ఇతర ఆలోచనలు మనసులోకి రావు. ఇదీ ధ్యానంలాంటిదే. దీనివల్ల ఎటువంటి లాభాలు ఉంటాయో



అవే ప్రయోజనాలు పజిల్స్‌తోనూ కలుగుతాయి. ఒత్తిడి, ఆందోళన తగ్గి మనసు ప్రశాంతంగా ఉంటుంది. మెదడు పనితీరు చురుగ్గానూ మారుతుంది.

- రకరకాల పదబంధాల వల్ల మెదడులోని కుడి, ఎడమల భాగాల పనితీరు మెరుగవుతుందట.

- చాలామంది అన్నింటినీ మరిచిపోతుంటారు. ఇలాంటి పజిల్స్ చేయడం వల్ల మెదడు కణాలు చురుగ్గా పనిచేస్తాయి. స్వల్పకాల జ్ఞాపకశక్తి పెరగడానికి ఇది ఉపయోగపడుతుంది.

- రోజూ పజిల్స్ సాధన చేయగలిగితే 'విజువల్ స్పాషియల్ రీజనింగ్' పెరుగుతుంది. పిల్లలతో సమానంగా పెద్దవాళ్లూ వీటికి సమయం కేటాయిస్తే మంచిదంటారు నిపుణులు.

- ఎవరైతే జిగ్‌సా, క్రాస్‌వర్డ్ పజిల్స్ చేస్తారో వారి జీవన ప్రమాణాలు మెరుగవుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. అల్జీమర్స్, మతిమరుపు, డిమెన్షియా వంటివి దరిచేరకుండా ఉంటాయి.

# ఆకుకూరలతో సన్నజాజిలా...

కొన్ని పదార్థాలు శరీరంలో పేరుకొన్న వ్యర్థాలను తొలగించడమే కాదు... బరువునూ అదుపులో ఉంచుతాయి. వాటిని తరచూ తీసుకోవడం వల్ల ఎంతో మార్పు కనిపిస్తుందని చెబుతున్నారు నిపుణులు.

**క్యాబేజీ:** దీంతోపాటు క్యాలీఫ్లవర్, బ్రకోలీ వంటివి తీసుకోవడం వల్ల పీచు ఎక్కువ మొత్తంలో అందుతుంది. కొద్దిగా తిన్నా పొట్ట నిండినట్లు అనిపిస్తుంది. క్యాన్సర్ కారకాలతో పోరాడే శక్తి ఉన్న ఈ కూరగాయలు వ్యర్థాలను తొలగించి, శరీరానికి అవసరమైన పోషకాలు అందిస్తాయి. కొవ్వునూ కరిగిస్తాయి.

**ఆకుకూరలు:** వీటిలో కెలోరీలు, పిండిపదార్థాలు తక్కువ, పీచు ఎక్కువ. ఆహారంలో తరచూ వీటిని భాగం చేసుకోవడం వల్ల పొట్ట నిండిన భావన కలుగుతుంది. దాంతో బరువు తగ్గుతారు. శరీరానికి అవసరమైన పోషకాలు అందడమే కాదు, శక్తీ లభిస్తుంది.

**ఉడికించిన బంగాళాదుంప:** పొటాషియం ఎక్కువ అందిస్తుందిది. ఒకటి తిన్నా పొట్టనిండినట్లుగా ఉంటుంది. ఇందులోని పీచు, గంజి పేరుకొన్న కొవ్వును కొంతవరకూ కరిగించడంతోపాటు బరువునూ అదుపులో ఉంచుతాయి.

**సూప్స్:** నీళ్లు, కూరగాయలు కలిపి చేసే సూప్స్ ఎంత మోతాదులో తీసుకున్నా మంచిదే. కూరగాయలు ఉడుకుతాయి కాబట్టి... అవసరమైన పోషకాలు అందుతాయి. కొద్దిగా తీసుకున్నా పొట్ట నిండిపోతుంది. భోజనానికి ముందు కప్పు సూప్ తాగినా చాలు... మిగిలిన ఆహారం చాలా తక్కువగా తీసుకునే అవకాశం ఉంటుంది.

**నట్స్:** ఇవి స్నాక్స్‌లా తీసుకునేందుకు సరైన ఎంపిక. అన్నీ కలిపి గుప్పెడు తీసుకున్నా... అవసరమైన పోషకాలతోపాటు మేలు చేసే కొవ్వు శరీరానికి అందుతుంది. వీటిని తరచూ తీసుకునేవారు సన్నగా ఉంటారని చెబుతున్నాయి అధ్యయనాలు.



## నోటీస్ బోర్డు

### ప్రభుత్వ ఉద్యోగాలు

**ఐఐటీ ధన్‌బాద్**

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఎస్ఎం) ధన్‌బాద్... నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
**పోస్టులు-ఖాళీలు:** డిప్యూటీ రిజిస్ట్రార్-03, అసిస్టెంట్ రిజిస్ట్రార్-08, జూనియర్ అసిస్టెంట్-74, జూనియర్ టెక్నీషియన్-106.
**మొత్తం ఖాళీలు:** 191 **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా, బీఎస్సీ, బ్యాచిలర్స్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ, అనుభవం.
**ఎంపిక:** రాతపరీక్ష, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ ఆధారంగా.
**ఆన్‌లైన్ దరఖాస్తు:** సెప్టెంబరు 2 నుంచి నవంబరు 4 వరకు.
**హార్డు కాపీలను పంపడానికి చివరితేది:** నవంబరు 11
**వెబ్‌సైట్:** www.iitism.ac.in

**కేంద్రీయ హిందీ సంస్థాన్**

ఆగ్రాలోని కేంద్రీయ హిందీ సంస్థాన్... అడ్మినిస్ట్రేటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
**పోస్టులు-ఖాళీలు:** అకడమిక్ అసిస్టెంట్-01, జూనియర్ స్టెనోగ్రాఫర్-01, ఆడిటర్-01, ప్రూఫ్ రీడర్-01, లైబ్రరీ క్లర్క్-03, లోయర్ డివిజన్ క్లర్క్-15, డ్రైవర్-05, మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంటీఎస్)-22, ఎంటీఎస్ (సఫాయివాలా)-05.
**మొత్తం ఖాళీలు:** 54 **అర్హత:** పదోతరగతి, ఐటీఐ, ఇంటర్, బీకాం, లైబ్రరీ సైన్సులో సర్టిఫికెట్, మాస్టర్స్ డిగ్రీ (హిందీ/ లింగ్విస్టిక్స్), టైపింగ్/ స్టెనోగ్రఫీ నైపుణ్యాలు, హిందీ/ ఇంగ్లిష్ పరిజ్ఞానం, అనుభవం. **ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్ ఆధారంగా.
**దరఖాస్తు:** ఆఫ్‌లైన్. **చివరితేది:** అక్టోబరు 11
**వెబ్‌సైట్:** http://khsindia.org/

**ఎస్‌బీఐలో మెడికల్ ఆఫీసర్లు**

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)... మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
**పోస్టు:** బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ **ఖాళీలు:** 56
**అర్హత:** ఎంబీబీఎస్‌తోపాటు ఐదేళ్ల అనుభవం లేదా మెడికల్ పీజీతోపాటు మూడేళ్ల అనుభవం. **వయసు:** 35 సంవత్సరాలు మించకూడదు. **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా.
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** సెప్టెంబరు 19
**వెబ్‌సైట్:** www.sbi.co.in

**రూరల్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం**

హైదరాబాద్‌లోని మహాత్మా గాంధీ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రూరల్ ఎడ్యుకేషన్... 2019-20 సంవత్సరానికిగానూ ఉన్నత విద్య విభాగంలో ఇంటర్న్‌షిప్ ఖాళీలకు దరఖాస్తులు కోరుతోంది.
● మేనేజ్‌మెంట్ ట్రైనీ (ఇంటర్న్)
గరిష్ఠ కాలవ్యవధి: 6 నెలలు **ఖాళీలు:** 30
ప్రతిఫలం: నెలకు రూ.25,000 **అర్హత:** ఎంఈడీ/ ఎంటెక్/ ఎంబీఏ ఉత్తీర్ణత, కమ్యూనికేషన్ స్కిల్స్ **దరఖాస్తు:** ఈమెయిల్
**చివరితేది:** సెప్టెంబరు 1 **ఈమెయిల్:** internsmg19@gmail.com
**వెబ్‌సైట్:** www.mgncre.org

### స్కాలర్‌షిప్స్

**విదేశీ విద్య ఉపకారవేతనాలు**

తెలంగాణ మైనారిటీల సంక్షేమ శాఖ... విదేశీ విద్యనభ్యసించే రాష్ట్ర మైనారిటీ విద్యార్థులకు ఉపకారవేతనాలు అందిస్తోంది. 2019 (స్ప్రింగ్ సీజన్) ప్రకటన జారీ చేసింది.
**అర్హత:** విదేశీ వర్సిటీల్లో పీజీ/ డాక్టోరల్ కోర్సుల్లో జనవరి 2019-జులై 2019 మధ్య ప్రవేశం పొంది ఉండాలి.
ఎంపిక: స్టేట్ లెవెల్ స్క్రీనింగ్ కమిటీ ద్వారా.
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** సెప్టెంబరు 27
**వెబ్‌సైట్:** https://telanganaepass.cgg.gov.in/

### వాక్-ఇన్స్

**ఐకార్-సీఏఎఫ్ఆర్ఐ**

ఝాన్సీ (ఉత్తర్‌ప్రదేశ్)లోని ఐకార్ - సెంట్రల్ ఆగ్రోఫారెస్ట్రీ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఏఎఫ్ఆర్ఐ)... తాత్కాలిక ప్రాతిపదికన ప్రాజెక్టు పర్సనల్ భర్తీకి వాక్ఇన్ నిర్వహిస్తోంది.
**పోస్టులు-ఖాళీలు:** సీనియర్ రిసెర్చ్ ఫెలో (ఎస్ఆర్ఎఫ్)-05, ఫీల్డ్ అసిస్టెంట్-05. **అర్హత:** పదోతరగతి, సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ, యూజీసీ/ సీఎస్ఐఆర్/ ఐకార్ నెట్, అనుభవం. **గరిష్ఠ వయఃపరిమితి:** ఎస్ఆర్ఎఫ్-35 ఏళ్లు, ఫీల్డ్ అసిస్టెంట్-45 ఏళ్లు. **వాక్ఇన్ తేది:** సెప్టెంబరు 4, 5.
**వేదిక:** ఐకార్-సీఏఎఫ్ఆర్ఐ, ఝాన్సీ-గ్వాలియర్ రోడ్, ఝాన్సీ-284003 (యూపీ). **వెబ్‌సైట్:** http://cafri.res.in/

---



పరిశోధనల కోసం అనువైన పరిస్థితులు, ఉద్యోగాలకు ఉన్న అవకాశాలు, ఎక్కువ మంది ఏయే దేశాలకు ఎందుకు వెళుతున్నారు తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని కొన్ని దేశాలు కొన్ని కోర్సులకు ప్రసిద్ధి చెందినట్లు గమనించవచ్చు. విదేశాల్లో ఉన్నత విద్య చదవాలని నిర్ణయించుకున్న తర్వాత ఈ సమాచారం ఆధారంగా ఏ కోర్సుకి ఏ దేశానికి వెళ్లాలి అనే ప్రశ్నకు సమాధానం దొరుకుతుంది.

విదేశీ విద్య

# కోరుకుంటే... కోర్సుకో దేశం!



ప్రపంచవ్యాప్తంగా విదేశాల్లో చదువుకునే మన విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ఎక్కువమంది పీజీ కోర్సుల కోసం పరాయి దేశాలకు పయనమవుతున్నారు. ఈ నేపథ్యంలో నాణ్యమైన బోధనను అందించే యూనివర్సిటీల సమాచారం కోసం అభ్యర్థులు అన్వేషిస్తున్నారు. అగ్రగామి అమెరికా మొదలు చిన్న దేశమైన సింగపూర్ వరకూ ఎన్నో రకాల కోర్సులను అందిస్తున్నాయి. ఒక్కోదేశం ఒక్కో తరహా కోర్సులకు ప్రసిద్ధి చెందాయి. ఎక్కడ ఏ కోర్సులు బాగుంటాయో తెలుసుకొని అడుగేస్తే గరిష్ఠ ప్రయోజనం ఉంటుంది.

## స్టెమ్, మేనేజ్‌మెంట్, మాస్ కమ్యూనికేషన్ : అమెరికా

సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్.. వీటిని స్టెమ్ కోర్సులంటారు. యూఎస్ వెళ్లే భారతీయ విద్యార్థుల్లో 80 శాతం ఈ కోర్సుల్లోనే చేరుతున్నారు. ఇంజినీరింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్...ఒక్కో కోర్సులోనూ ఏటా రెండేసి లక్షల మంది చొప్పున విదేశీ విద్యార్థులను అమెరికా ఆకర్షిస్తోంది. ఫీజు అధిక మొత్తంలో ఉన్నప్పటికీ విదేశీయులు అమెరి



కాలో చదవడానికే ప్రాధాన్యమిస్తున్నారు. ఉన్నత విద్యా ప్రమాణాలతోపాటు మంచి కెరియర్ సొంతం కావడమే దీనికి కారణం. అమెరికాలో బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సులు చదువుతున్న మొత్తం విద్యార్థుల్లో 20 శాతం విదేశీయులే. ఎఫ్‌టీ సహా, పలు సర్వేల ప్రకారం టాప్ బిజినెస్ స్కూళ్లలో సింహభాగం అమెరికాలోనే ఉన్నాయి. అలాగే ఇంజినీరింగ్‌లోనూ సత్తా చాటుతోంది. సోషల్ సైన్సెస్ కోర్సులు చదవాలనుకునే విద్యార్థులూ యూఎస్‌కే తొలి ప్రాధాన్యమిస్తున్నారు. ఈ కోర్సుల్లో పరిశోధనకు అవకాశాలు లభించడం, సులువుగా ఉద్యోగాలు దొరకడం కారణాలు.

ఇంటర్నెట్, డిజిటల్ ప్రభావంతో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలను మించి ఆన్‌లైన్ మీడియా పుంజుకుంటోంది. దీంతో న్యూ మీడియా కోర్సులకు డిమాండ్ పెరుగుతోంది. ఇందులోనూ అగ్రరాజ్యం అమెరికాదే పైచేయి. ప్రపంచంలో మాస్ కమ్యూనికేషన్ కోర్సులకు న్యూయార్క్‌లోని కొలంబియా యూనివర్సిటీ ప్రసిద్ధి. దీని తర్వాత కాలిఫోర్నియా యూనివర్సిటీ-బెర్క్‌లీ, టెక్సాస్ యూనివర్సిటీ, స్టాన్‌ఫర్డ్ పేరున్న సంస్థలు. అధిక సంఖ్యలో పులిట్జర్ అవార్డులు అందుకున్నది అమెరికా వాళ్లే.

## ఆర్ట్స్, హ్యుమానిటీస్ : అమెరికా, యూకే

ఆంగ్లం, సాహిత్యం, చరిత్ర, తత్వశాస్త్రం...తదితర కోర్సులకు అమెరికా, యూకేలు పేరుపొందాయి. ప్రపంచ అత్యుత్తమ సంస్థల జాబితాలో స్థానం పొందిన విశ్వవిద్యాలయాల్లో అధిక శాతం ఈ రెండు దేశాల్లోనివే. లైఫ్ సైన్సెస్‌లోనూ యూఎస్, యూకేలే అగ్రగాములు. పురాతన ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ విఖ్యాత హార్వర్డ్, స్టాన్‌ఫర్డ్ అన్ని కోర్సుల్లోనూ తిరుగులేని సంస్థలు. ఇవే కాకుండా వివిధ విశ్వవిద్యాలయాలు మేటి విద్యను అందిస్తున్నాయి.

## సివిల్, ఆర్కిటెక్చర్ : దుబాయ్

దుబాయ్ పేరెత్తగానే గుర్తొచ్చేది ఆకాశహర్మ్యాలు, ఆకర్షణీయ డిజైన్‌లే. ఆర్కిటెక్చర్, సివిల్ ఇంజినీరింగ్ చదవాలనుకునే విద్యార్థులు తొలి ప్రాధాన్యం దుబాయ్‌కి ఇవ్వడం సముచితం. ఇక్కడి బుర్జ్ ఖలీఫా, మరీనా 101, ది పామ్.. లాంటి నిర్మాణాలు ప్రపంచంలోనే విశిష్టమైనవిగా పేరొందాయి. విశ్వవిఖ్యాత నిర్మాణ సంస్థల కార్యాలయాలన్నీ దుబాయ్‌లో నెలకొన్నాయి. అయిదారేళ్ల పని అనుభవం ఉన్న సీనియర్ ఆర్కిటెక్చర్లు ఏటా సగటున కోటి రూపాయల వేతనం పొందుతున్నారు. ప్రతి కట్టడానికీ ఆర్కిటెక్చర్లతోపాటు సివిల్ ఇంజినీర్ల సేవలూ కీలకం. అందువల్లే సివిల్‌కు దుబాయ్‌లో గిరాకీ ఉంది. ఇక్కడి సివిల్ ఇంజినీర్లు కెరియర్ ఆరంభంలో ఏడాదికి రూ.20 లక్షలు ఆర్జిస్తున్నారు. ప్రపంచంలో ఆర్కిటెక్చర్, సివిల్ ఇంజినీరింగ్ విద్యలో దుబాయ్ తర్వాతే ఏ దేశమైనా అనే స్థాయికి చేరుకుంది. భారత్‌కు చెందిన అమిటీ, మణిపాల్ యూనివర్సిటీలు ఇక్కడ సివిల్/ ఆర్కిటెక్చర్ ఇంజినీరింగ్ కోర్సులు నిర్వహిస్తున్నాయి. ఈ రెండూ దుబాయ్‌లో మేటి కళాశాలలుగా పేరొందాయి. వీటితోపాటు అమెరికన్ యూనివర్సిటీ, హెరొట్ వాట్ యూనివర్సిటీ సివిల్‌కు ప్రాధాన్యమున్న విద్యాసంస్థలు.

## ఆటోమొబైల్, మెకానికల్ : జర్మనీ

ఆడి, బీఎండబ్ల్యూ, బెంజ్, పోర్షే, ఫోక్స్ వ్యాగన్...ఇలా ప్రముఖ కార్ల తయారీ కంపెనీలకు పుట్టినిల్లు జర్మనీ. ఆటోమొబైల్, మెకానికల్ ఇంజినీరింగ్ విద్యలో ఈ దేశం తర్వాతే ఏదైనా. అందువల్లే ప్రపంచవ్యాప్తంగా ఈ రెండు బ్రాంచీల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకుంటున్న విద్యార్థులు జర్మనీ బాట పడుతున్నారు. మేటి చదువులతోపాటు ఉన్నత అవకాశాలూ సొంతం చేసుకుంటున్నారు. ఇక్కడ మోటారు వాహనాలతోపాటు భారీ యంత్రాలు సైతం ఎక్కువగా తయారవుతున్నాయి. జర్మనీలోని విదేశీ విద్యార్థుల్లో భారతీయులు రెండో స్థానంలో ఉన్నారు. నాణ్యమైన జీవనప్రమా



ణాలు, తక్కువ ఫీజు వీరిని ఆకర్షిస్తున్నాయి. బయో టెక్నాలజీ, స్టెమ్ కోర్సుల్లోనూ ఎక్కువమంది చేరుతున్నారు. ఇక్కడ పరిశోధనలకు ప్రాధాన్యం ఇస్తారు. వివిధ రంగాల్లో వందకుపైగా నోబెల్ విజేతలను ఈ దేశం అందించింది. ఈ దేశంలో మూనిచ్ టెక్నికల్ విశ్వవిద్యాలయం ప్రసిద్ధ సంస్థ. ఏటా పదివేల మందికి పైగా భారతీయ విద్యార్థులు జర్మనీ వెళ్తున్నారు.

### విదేశీ విద్యార్థుల ప్రాధాన్యం ఇలా..

**ఏటా పది లక్షల మందికి పైగా విదేశీ విద్యార్థులు యూఎస్‌లో చదువులకు వెళ్తున్నారు. ఈ విద్యార్థుల్లో చైనాది ప్రథమ స్థానం కాగా భారత్ రెండో స్థానంలో ఉంది. ఎక్కువమంది ఇంజినీరింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్, మ్యాథ్స్ అండ్ కంప్యూటర్ సైన్సెస్, సోషల్ సైన్సెస్, ఫిజికల్ అండ్ లైఫ్ సైన్సెస్ కోర్సుల్లో చేరుతున్నారు.**

బిజినెస్ మేనేజ్‌మెంట్, కంప్యూటర్ సైన్సెస్, లైఫ్ సైన్సెస్, హోటల్ మేనేజ్‌మెంట్, లిబరల్ ఆర్ట్స్ కోర్సులకు కెనడా ప్రసిద్ధి. చైనా, భారత్‌ల నుంచి ఎక్కువమంది చేరుతున్నారు. ఫ్యాషన్ డిజైనింగ్, యానిమేషన్, గేమింగ్, జర్నలిజం, హోటల్ మేనేజ్‌మెంట్ కూడా ఈ దేశంలో ప్రాధాన్యమున్న కోర్సులు..

న్యూజిలాండ్ చదువులకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. బిజినెస్ మేనేజ్‌మెంట్, ఇంజినీరింగ్, సోషల్ సైన్సెస్, ఫిజికల్ అండ్ లైఫ్ సైన్సెస్, మ్యాథ్స్ అండ్ కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో ఎక్కువమంది చేరుతున్నారు.

అయిదు లక్షలమందికి పైగా విద్యార్థులు యూకే చదువులకు వెళ్తున్నారు. వీరిలో ప్రథమ స్థానం చైనా. తర్వాత అమెరికా. భారతీయులు మూడో స్థానంలో ఉన్నారు. విదేశీ విద్యార్థుల్లో ఎక్కువ మంది బిజినెస్ మేనేజ్‌మెంట్, ఇంజినీరింగ్, సోషల్ సైన్సెస్, ఫిజికల్ అండ్ లైఫ్ సైన్సెస్, ఫైన్ అండ్ అప్లైడ్ ఆర్ట్స్ కోర్సుల్లో చేరుతున్నారు.

**సింగపూర్‌లో లక్ష మందికి పైగా విదేశీ విద్యార్థులు చేరుతున్నారు. బిజినెస్ మేనేజ్‌మెంట్, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్, ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్, లా కోర్సులకు ఈ దేశం ప్రసిద్ధి. ఆర్ట్స్ అండ్ డిజైన్, హాస్పిటాలిటీ, మాస్ కమ్యూనికేషన్, లాజిస్టిక్స్, ఏవియేషన్‌లు సైతం ఈ దేశంలో పేరున్న కోర్సులు.**

దాదాపు 3 లక్షల మంది విదేశీ విద్యార్థులు ఆస్ట్రేలియాలో చదువుతున్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో చైనా, భారత్‌లు ఉన్నాయి. ఎక్కువ మంది బిజినెస్ మేనేజ్‌మెంట్, ఇంజినీరింగ్, మ్యాథ్స్ అండ్ కంప్యూటర్ సైన్సెస్, సోషల్ సైన్సెస్, హాస్పిటాలిటీ, పర్సనల్ సర్వీసెస్, కామర్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ కోర్సులకు ఆస్ట్రేలియాకు ప్రాధాన్యమిస్తున్నారు.



వైద్య విద్య నిమిత్తం ఎక్కువ మంది భారతీయులు చైనా వెళ్తున్నారు. అన్ని కోర్సుల్లో కలుపుకుని ఏటా పదిహేను వేల మందికి పైగా భారతీయులు చైనాలో చేరుతున్నారు. హ్యుమానిటీస్, బిజినెస్ అండ్ మేనేజ్‌మెంట్, ఇంజినీరింగ్, సోషల్ సైన్సెస్ కోర్సులకు ఈ దేశం ప్రసిద్ధి. ఏటా 4 లక్షల మంది విదేశీ విద్యార్థులను ఆకర్షిస్తోంది.

**ఇటీవలి కాలంలో కొంతమంది ఐర్లాండ్ వెళుతున్నారు. ఇక్కడి ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్సెస్, డేటా సైన్స్ అండ్ ఎనలిటిక్స్, ఫిజిక్స్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ కోర్సుల్లో మన వాళ్లతోపాటు అమెరికా, చైనా, ఫ్రాన్స్‌ల విద్యార్థులూ చేరుతున్నారు.**

### మరికొన్ని...

- లా, ఆర్ట్, డిజైన్ కోర్సులకు యూకే ప్రసిద్ధి చెందింది.
- మెడిసిన్, డెంటిస్ట్రీ కోర్సుల కోసం రష్యాను పరిశీలించవచ్చు. ఈ దేశం హ్యుమానిటీస్, బిజినెస్ ఎకనామిక్స్ కోర్సులకు పేరుపొందింది.
- పొలిటికల్ సైన్స్ కోర్సుల్లో ఫ్రాన్స్ అగ్రగామి.
- పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, అగ్రికల్చర్, మెడిసిన్ అండ్ హెల్త్ కోర్సులకు నెదర్లాండ్స్ ప్రసిద్ధి.
- అప్లయిడ్ సైన్సెస్, ట్రెడిషనల్ ఆర్ట్స్, మ్యూజిక్ కోర్సుల కోసం జపాన్‌ను ఎంచుకోవచ్చు.
- హోటల్ మేనేజ్‌మెంట్, హాస్పిటాలిటీ కోర్సులకు న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, యూకే, సింగపూర్, మలేసియా చెప్పుకోదగ్గవి.

---

# నెలనెలా రూ. నాలుగు వేలు!

**ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఓఎన్‌జీసీ 1000 స్కాలర్‌షిప్పులు**

**సుప్రసిద్ధ సంస్థ ఓఎన్‌జీసీ షెడ్యూల్డ్ కులాలు, తెగల విద్యార్థులు ఉన్నతవిద్యను అభ్యసించేలా ప్రోత్సాహాన్నిస్తూ ఆర్థికసాయం అందిస్తోంది.. ప్రొఫెషనల్ కోర్సుల్లో డిగ్రీ, పీజీ కోర్సులను చేస్తున్నవారు వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు. మెరిట్ ఆధారంగా అర్హులను ఎంపిక చేస్తారు.**

ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఓఎన్‌జీసీ) ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశం పొందిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను ప్రకటించింది. గ్రాడ్యుయేషన్ స్థాయిలో ఇంజినీరింగ్, మెడికల్ విభాగాలవారూ, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, జియాలజీ, జియో ఫిజిక్స్‌లో పీజీ ప్రవేశం పొందినవారూ వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు.

డిగ్రీ కోర్సులకు నాలుగేళ్లపాటు, పీజీ కోర్సులకు రెండేళ్లపాటు స్కాలర్‌షిప్ అందుతుంది. నెలకు రూ.4000 చొప్పున ఏడాదికి మొత్తంగా రూ. 48,000 చెల్లిస్తారు.

దేశవ్యాప్తంగా 1000 స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నారు. జోన్లవారీగా వీటిని అందజేస్తారు. మొత్తంగా అయిదింటిని ఎంపిక చేసి, ప్రతిజోన్‌కు 200 చొప్పున స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నారు. వీటిలో 50% స్కాలర్‌షిప్‌లను అమ్మాయిలకు కేటాయించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విద్యార్థులు సౌత్ (జోన్-5) జోన్ కిందకి వస్తారు.

### ఎంపిక విధానం

గత పరీక్షలో సాధించిన మార్కులను బట్టి ఎంపిక ఉంటుంది. మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారు. ఆ ఏడాదిలో పొందిన మార్కుల ఆధారంగానే తరువాతి ఏడాది స్కాలర్‌షిప్ కొనసాగడం, కొనసాగకపోవడం ఆధారపడి ఉంటుంది. ఫెయిల్ అయినవారికి స్కాలర్‌షిప్ నిలిపివేస్తారు. కనీసం 50% మార్కులు సాధించడం తప్పనిసరి.



### దరఖాస్తు విధానం

వెబ్‌సైట్ (www.ongcindia.com) నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. దానిని తగిన వివరాలతో నింపి, అడిగిన ధ్రువపత్రాలను జోడించి సంస్థ చిరునామాకు పంపాల్సి ఉంటుంది.
**చిరునామా:** ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్, గ్రీన్ హిల్స్ టెల్ భవన్, దేహ్రాదూన్- 248003.

దరఖాస్తు ఫీజు ఏమీలేదు. దరఖాస్తు చేసుకోవడానికి **చివరితేదీ:** అక్టోబరు 15, 2019.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల విద్యార్థులు దరఖాస్తులు పంపాల్సిన **చిరునామా:** DGM(HR), ONGC, 7th Floor, East Wing, CMDA Tower-I, No.1,Gandhi Irwin Road, Egmore, Chennai - 600 008.

### అర్హతలు

- గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి రెగ్యులర్ కోర్సుల్లో మొదటి ఏడాది ప్రవేశం పొంది ఉండాలి.
- గ్రాడ్యుయేషన్ కోర్సులకు ఇంటర్మీడియట్, పీజీ కోర్సులకు డిగ్రీ కనీసం 60% మార్కులతో పూర్తిచేసి ఉండాలి.
- కుటుంబ నెలవారీ ఆదాయం రూ. 37000 మించకూడదు.
- అక్టోబరు 1, 2019 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
- ఇతర స్కాలర్‌షిప్‌లు పొందుతున్నవారిని అనర్హులుగా ప్రకటిస్తారు. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్/ ఫీజులో తగ్గింపు పొందుతున్నవారు అర్హులే.

# ఛాంపియన్



## 60 ఏళ్ల కెరీర్.. 7 వేల వికెట్లు!

లండన్: క్రికెటర్లు సాధారణంగా 35-40 ఏళ్ల మధ్య రిటైరవుతుంటారు. ఒకవేళ అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమై దేశవాళీల్లో కొనసాగాలనుకున్నా గరిష్ఠంగా 45 ఏళ్ల వరకు క్రికెట్ ఆడితే గొప్ప. ఇలాంటి క్రికెటర్లు కూడా చాలా తక్కువమందే ఉంటారు. పాఠశాల స్థాయి నుంచి మొదలుపెట్టినా గరిష్ఠంగా ఓ 30 ఏళ్ల కెరీర్ ఉంటే గొప్ప. కానీ ఓ ఆటగాడు పోటీ క్రికెట్ కాకపోయినా 85 ఏళ్ల వరకు ఆటలో కొనసాగాడంటే.. అతడి కెరీర్ 60 ఏళ్ల పాటు సాగిందంటే నమ్మగలరా? వెస్టిండీస్‌కు చెందిన సెసిల్ రైట్ అనే క్రికెటర్ 85 ఏళ్ల వయసులో రిటైర్మెంట్ ప్రకటించాడు. అతను వెంటనే ఆట నుంచి తప్పుకోవట్లేదు. ఇంకో 10 రోజుల తర్వాత మ్యాచ్ ఆడి నిష్క్రమిస్తాడట. ఫాస్ట్‌బౌలర్ అయిన రైట్ 70, 80 దశకాల్లో స్థానిక జట్లలో వివియన్ రిచర్డ్స్, జోయెల్ గార్నర్ లాంటి దిగ్గజాలతో కలిసి క్రికెట్ ఆడాడట. జమైకాకు ప్రాతినిధ్యం వహించిన రైట్.. ఆ తర్వాత ఇంగ్లాండ్‌కు మకాం మార్చాడు. అక్కడే స్థానిక జట్లకు ఆడుతూ కెరీర్‌ను కొనసాగించాడు. సెప్టెంబరు 7న అప్పర్‌మిల్ జట్టు తరఫున అతను తన చివరి క్రికెట్ మ్యాచ్ ఆడబోతున్నాడు. అయితే సెసిల్ రైట్ తన కెరీర్ మొత్తంలో ఒక్క ఫస్ట్‌క్లాస్ మ్యాచే ఆడాడు. ఇన్నేళ్ల కెరీర్లో రైట్ 7 వేల వికెట్లు తీయడం విశేషం. కాకపోతే అతను కొన్ని దశాబ్దాల నుంచి సరదాకే మ్యాచ్‌లు ఆడుతున్నాడు.



## టాప్-10లో బుమ్రా

దుబాయ్: వెస్టిండీస్‌తో తొలి టెస్టులో నిప్పులు చెరిగే బంతులతో భారత్‌కు ఘన విజయాన్ని అందించిన స్టార్ పేసర్ బుమ్రా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో టాప్-10లో చోటు సంపాదించాడు. తాజాగా ప్రకటించిన జాబితాలో బుమ్రా.. తొమ్మిది స్థానాలు మెరుగుపరుచుకుని ఏడో స్థానంలో నిలిచాడు. టాప్-10లోకి రావడం అతనికిదే తొలిసారి. వేగంగా 50 వికెట్లు సాధించిన భారత పేసర్‌గా కూడా బుమ్రా ఘనత సాధించిన సంగతి తెలిసిందే. బ్యాట్స్‌మెన్ జాబితాలో కోహ్లి అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.





## సింధు.. దేశానికి గర్వకారణం: ప్రధాని

దిల్లీ: భారత బ్యాడ్మింటన్ స్టార్ పి.వి.సింధుపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల జల్లు కురిపించారు. ఆమె దేశానికి గర్వకారణమన్నారు. ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలిచి మంగళవారం స్వదేశానికి చేరుకున్న సింధు.. దిల్లీలో మోదీని ఆయన కార్యాలయంలో కలిసింది. కోచ్‌లు గోపీచంద్, కిమ్‌లు కూడా ఆమె వెంట ఉన్నారు. తన ట్విటర్ ఖాతాలో సింధును అభినందిస్తున్న ఫొటోలు పంచుకున్న ప్రధాని.. "దేశానికి గర్వకారణమైన ఈ ఛాంపియన్ మన ఇంటికి స్వర్ణంతో పాటు సంతోషాన్ని తీసుకొచ్చింది. సింధును కలవడం సంతోషం కలిగించింది. ఆమెను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని అభిలషించా" అని పేర్కొన్నారు. ప్రధానిని కలిసే ముందు సింధు క్రీడల మంత్రి రిజిజుతో కలిసి అల్పాహారం విందు చేసింది. ఆమెను సత్కరించిన రిజిజు రూ.10 లక్షల నగదు బహుమతి అందజేశారు. అంతకుముందు దిల్లీ విమానాశ్రయంలో సింధుకు అభిమానులు ఘనస్వాగతం పలికారు.

ఒలింపిక్స్ స్వర్ణంపై గురి

# టార్గెట్ టోక్యో

ప్రపంచ ఛాంపియన్ సింధు

ఈనాడు - హైదరాబాద్

**2020 టోక్యో ఒలింపిక్సే తన లక్ష్యమని భారత స్టార్ షట్లర్, ప్రపంచ ఛాంపియన్ పి.వి.సింధు ప్రకటించింది. ఒలింపిక్స్‌కు సరికొత్త అస్త్రాలతో సిద్ధమవుతానని తెలిపింది. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించి మంగళవారం హైదరాబాద్‌కు తిరిగొచ్చిన సింధు.. గోపీచంద్ అకాడమీలో విలేకరులతో మాట్లాడింది. వివరాలు ఆమె మాటల్లోనే..**

ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం కోసం ఎప్పట్నుంచో ఎదురుచూస్తున్నా. ఇన్నాళ్లకు నిరీక్షణ ఫలించింది. 2 కాంస్యాలు.. 2 రజతాలు.. చివరికి స్వర్ణం సాధించా. గర్వంగా అనిపించింది. మనసు తేలికగా ఉందిప్పుడు. కోచ్‌లు గోపీ సర్, కిమ్‌ల సహకారంతోనే ఈ పతకం సాధ్యమైంది. అందరం చాలా కష్టపడ్డాం. 2017, 2018లలో రజతాలు సాధించినా ఏదో వెలితిగా అనిపించింది. వచ్చేసారి తప్పకుండా స్వర్ణం గెలవాలని అనుకున్నా. ఆ లక్ష్యం నెరవేరినందుకు ఆనందంగా ఉంది. ఒలింపిక్స్‌కు మరో 11 నెలల సమయముంది. అంచనాలు భారీగా ఉంటాయని తెలుసు. ప్రపంచ టోర్నీ పతకం ఎంతో ఆత్మవిశ్వాసాన్నిచ్చింది. ఒలింపిక్స్‌లో రెట్టించిన ఉత్సాహంతో బరిలో దిగుతా. ఇక నా లక్ష్యం 2020 టోక్యో ఒలింపిక్సే. అంతకుముందు సూపర్ సిరీస్‌లలో కూడా నెగ్గాలి. మహిళల సింగిల్స్ చాలా మారిపోయింది. ప్రతి టోర్నీ భిన్నంగా సాగుతుంది. ప్రతి క్రీడాకారిణి భిన్నంగా ఆడుతుంది. ఒక్కో టోర్నీ తర్వాత క్రీడాకారిణుల శైలి మారుతుంది. అందుకు తగ్గట్లుగా వ్యూహాలు మార్చుకోవాలి. పరిస్థితులకు తగ్గట్లు ఆటలో మార్పులు చేసుకోవాలి. టాప్-10లో ఉన్న క్రీడాకారిణుల ఆట మరికొరికి తెలుసు. ఒలింపిక్స్ కోసం మరింత కష్టపడి సరికొత్త అస్త్రాలు సిద్ధం చేసుకోవాలి.

ఫైనల్‌ను క్వార్టర్స్, సెమీస్‌లాగే ఆడా. గతంలో ఓడిపోయాను.. ఈసారి బాగా ఆడాలని అనుకుంటే ఒత్తిడి పెరిగిపోయి ఆట మీద దృష్టిసారించలేను. అందుకే మామూలు మ్యాచ్‌లాగే ఆడా. 2017 ఫైనల్లో ఒకుహర, నేను సుదీర్ఘంగా తలపడ్డాం. ర్యాలీలు చాలా సేపు సాగాయి. ఈసారి కూడా అన్నిటికీ సిద్ధమయ్యే బరిలో దిగా. అయితే తొలి పాయింటు నుంచే దూకుడుగా ఆడటం కలిసొచ్చింది. 2, 3 పాయింట్లు ఇచ్చినా వెంటనే మళ్లీ సంపాదించగలిగా. ప్రత్యర్థికి ఒక్క పాయింటు కూడా సులువుగా ఇవ్వలేదు. చివరి పాయింటు వరకు నేను తీవ్రత తగ్గించలేదు. 'ఒక్కసారిగా అలా ఆడేశావ్.. మ్యాచ్‌కు ముందు ఏం తిన్నావ్' అని చాలామంది అడిగారు (నవ్వుతూ). గెలిచాక అలా నిల్చుండిపోయా. సంబరాలు కూడా చేసుకోలేదు. పోడియం మీద నిల్చున్నప్పుడు భావోద్వేగాలు తన్నుకొచ్చాయి.

సాయిప్రణీత్‌ది కూడా గొప్ప ఘనత. 36 ఏళ్ల తర్వాత పురుషుల సింగిల్స్‌లో పతకం గెలిచాడు. రాబోయే టోర్నీల్లో సత్తాచాటేందుకు అతడికి ఆత్మవిశ్వాసం లభించింది. పతకం గెలిచినందుకు ప్రధాని మోదీ కూడా ఎంతో సంతోషించారు.



### గోపీ అన్న చెప్పినట్లే..

"ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం ఎంతో ఆనందాన్నిచ్చింది. వ్యక్తిగతంగా నాకెంతో ప్రత్యేకం. చాలా ఏళ్ల తర్వాత భారత్‌కు పతకాన్ని అందించడం నా ఆనందాన్ని రెట్టింపు చేసింది. క్వార్టర్‌ఫైనల్లో తొలి గేమ్ గెలుపు పూర్తిగా గోపీ అన్న ఘనతే. ఆయన చెప్పినట్లే ఆడి మ్యాచ్ గెలిచా. ఆ మ్యాచ్‌ను ఎప్పటికీ మరిచిపోలేను. అర్జున అవార్డు ప్రకటించడం.. ఆ వెంటనే పతకం రావడం ఆనందాన్ని రెట్టింపు చేసింది"

– సాయిప్రణీత్



### ఘనస్వాగతం

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించి హైదరాబాద్‌కు చేరుకున్న పి.వి.సింధుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంగళవారం రాత్రి బేగంపేట విమానాశ్రయంలో క్రీడల శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఘనస్వాగతం పలికారు. ఆమెను, కోచ్ గోపీచంద్‌ను ఆయన అభినందించారు.

## ఐఎస్ఎల్‌లో హైదరాబాద్

దిల్లీ: హైదరాబాద్ ఫుట్‌బాల్ ప్రియులకు శుభవార్త. దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లోని సాకర్ అభిమానుల్ని ఐదేళ్లుగా అలరిస్తూ వస్తున్న ఇండియన్ సూపర్ లీగ్.. హైదరాబాద్‌లోనూ అడుగు పెట్టబోతోంది. అక్టోబరు 20న ఆరంభమయ్యే ఐఎస్ఎల్ ఆరో సీజన్లో హైదరాబాద్ ఫ్రాంఛైజీ అరంగేట్రం చేయబోతోంది. కొన్నేళ్లుగా ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న ఎఫ్‌సీ పుణె సిటీ స్థానంలో హైదరాబాద్ ఫ్రాంఛైజీని తీసుకొస్తున్నారు. అయిదో సీజన్‌కు సంబంధించి ఆటగాళ్లు, సిబ్బందికి ఆ క్లబ్ యాజమాన్యం జీతాలు కూడా ఇవ్వలేదు. దీంతో ఆ ఫ్రాంఛైజీని రద్దు చేయాలని ఐఎస్ఎల్ యాజమాన్యం నిర్ణయించింది. హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ పేరుతో నడవనున్న కొత్త ఫ్రాంఛైజీని విజయ్ మద్దూరి, వరుణ్ త్రిపురనేని కొనుగోలు చేశారు. గచ్చిబౌలిలోని ఫుట్‌బాల్ స్టేడియం కేంద్రంగా ఈ ఫ్రాంఛైజీ నడుస్తుంది.

### ప్రో కబడ్డీలో ఈనాడు

| | |
|---|---|
| గుజరాత్ × హరియాణా | (రా.7:30 నుంచి) |
| దిల్లీ × ముంబా | (రా.8:30 నుంచి) |



### మంచి భవిష్యత్తుంది: ఫెదరర్

తనకు గట్టి పోటీ ఇచ్చిన సుమిత్‌ను ఫెదరర్ మెచ్చుకున్నాడు. అతడికి మంచి భవిష్యత్తు ఉందని అన్నాడు. "తొలి సెట్ చాలా కష్టంగా సాగింది. సుమిత్‌కు మంచి కెరీర్ ఉంది. అతడు చాలా నిలకడగా ఆడాడు. మెరుగైన ప్రదర్శన చేశాడు. మైదానంలో చురుగ్గా కదులుతున్నాడు" అని ఫెదరర్ చెప్పాడు.

"చాలా గొప్పగా అనిపిస్తోంది. గ్రాండ్‌స్లామ్ అరంగేట్రంలో ఇంతకన్నా మంచి మ్యాచ్ ఏముంటుంది. ఈ కోర్టులో ప్రతి క్షణాన్ని ఆస్వాదించా. ప్రేక్షకులు ఎంతో ఉత్సాహంగా ఉన్నారు. ఫెదరర్ నుంచి చాలా నేర్చుకున్నా. భావోద్వేగాలను ఎలా నియంత్రించుకోవాలో తెలుసుకున్నా"

– సుమిత్ నాగాల్



యుఎస్ ఓపెన్

**ఏదో కష్టంగా క్వాలిఫయర్స్ ద్వారా యుఎస్ ఓపెన్‌కు అర్హత సాధించాడు. అదే అతడి మొట్టమొదటి గ్రాండ్‌స్లామ్. పైగా తొలి రౌండ్ ప్రత్యర్థి దిగ్గజ ఆటగాడు రోజర్ ఫెదరర్. మామూలుగానైతే సుమిత్ నాగాల్ నిష్క్రమణ లాంఛనమే. ఎవరూ పెద్దగా పట్టించుకునేవారు కాదు. కానీ తన ప్రదర్శనతో సుమిత్ కలకలమే రేపాడు. అద్భుత పోరాటంతో ఆకట్టుకున్నాడు. ఫెదరర్ లాంటివాడిపై ఒక్క గేమ్ గెలవడమే కష్టమనుకుంటే.. ఏకంగా సెట్ గెలిచి, మ్యాచ్‌లో ఆధిక్యం సంపాదించి ఆశ్చర్యపరిచాడు. చివరికి ఓడినా స్ఫూర్తిదాయక ప్రదర్శనతో అందరితో శభాష్ అనిపించుకున్నాడు.**

# సూపర్ సుమిత్

- ఓడినా ఆకట్టుకున్న నాగాల్
- ఫెదరర్‌పై సెట్ కైవసం

న్యూయార్క్

కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ మ్యాచ్‌లోనే భారత ఆటగాడు సుమిత్ అదరగొట్టాడు. పూర్తిగా ఏకపక్షమనుకున్న మ్యాచ్‌లో 20 సార్లు గ్రాండ్‌స్లామ్ విజేత, స్విస్ స్టార్ రోజర్ ఫెదరర్‌ను గట్టిగా ప్రతిఘటించాడు. తొలి సెట్‌ను గెలిచి సత్తా చాటాడు. గత 20 ఏళ్లలో గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో ఓ సెట్ గెలిచిన నాలుగో భారతీయుడిగా సుమిత్ ఘనత సాధించాడు. అయితే మ్యాచ్‌లో అతడు 6-4, 1-6, 2-6, 4-6తో ఓడిపోయాడు. మ్యాచ్ ఆరంభం ఆసక్తికరం. ఫెదరర్ తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శిస్తాడని అందరూ అనుకుంటే ప్రపంచ 190వ ర్యాంకు ఆటగాడు సుమిత్ తన ప్రదర్శనతో ఆశ్చర్యపరిచాడు. రెండో గేమ్‌లో సర్వ్ కోల్పోయిన అతడు.. మూడో గేమ్‌లో ఫెదరర్ సర్వ్‌ను బ్రేక్ చేసి అందరికీ షాకిచ్చాడు. సుమిత్ పదునైన ఫోర్ హ్యాండ్ షాట్లు ఆడాడు. హోరాహోరీగా సాగిన పదో గేమ్‌లో బ్రేక్ సాధించి సుమిత్ సెట్‌ను గెలుచుకున్నాడు. తొలి సెట్లో 19 అనవసర తప్పిదాలు చేసిన ఫెదరర్ తర్వాత బలంగా పుంజుకున్నాడు. తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ తర్వాతి రెండు సెట్లు అలవోకగా గెలుచుకున్నాడు. నాలుగో సెట్లో సుమిత్ మెరుగైన ప్రదర్శన చేశాడు. ఓ బ్రేక్ కూడా సాధించాడు. కానీ చివరికి ఫెదరర్‌దే పైచేయి అయింది. మరో భారత ఆటగాడు ప్రజ్నేశ్ గుణేశ్వరన్ కథ తొలి రౌండ్లోనే ముగిసింది. అతడు 4-6, 1-6, 2-6తో మెద్వెదెవ్ (రష్యా) చేతిలో ఓడిపోయాడు.

**జకోవిచ్ శుభారంభం:** యుఎస్ ఓపెన్‌లో టాప్ సీడ్, డిఫెండింగ్ ఛాంపియన్ నొవాక్ జకోవిచ్ (సెర్బియా) శుభారంభం చేశాడు. తొలి రౌండ్లో అతడు 6-4, 6-1, 6-4తో రాబర్టో కర్బాలెస్ (స్పెయిన్)పై అలవోకగా విజయం సాధించాడు. మరో మ్యాచ్‌లో వావ్రింకా (స్విట్జర్లాండ్) 6-3, 7-6 (7-4), 4-6, 6-3తో సిన్నర్ (ఇటలీ)పై గెలిచాడు. ఒపెల్కా (అమెరికా), లోపెజ్ (స్పెయిన్), గొఫిన్ (బెల్జియం) రెండో రౌండ్లో అడుగుపెట్టారు. మహిళల సింగిల్స్‌లో మాజీ నంబర్‌వన్ కెర్బర్ (జర్మనీకి)కు షాక్ తగిలింది. మొదటి రౌండ్లో ఆమె 5-7, 6-0, 4-6తో మ్లదనోవిచ్ (ఫ్రాన్స్) చేతిలో ఓడిపోయింది. ఎనిమిదో సీడ్ సెరెనా (అమెరికా) అలవోకగా తొలి రౌండ్ దాటింది. కెరీర్‌లో 24వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించాలనే పట్టుదలతో ఉన్న ఆమె ఏకపక్షంగా సాగిన పోరులో 6-1, 6-1తో మాజీ ఛాంపియన్ మరియా షరపోవాను చిత్తు చేసింది. రెండో సీడ్ ఆష్లే బార్టీ (ఆస్ట్రేలియా), ఆరో సీడ్ క్విటోవా (చెక్) కూడా ముందంజ వేశారు. బార్టీ 1-6, 6-3, 6-2తో దియాస్ (ఇటలీ)ను ఓడించగా.. క్విటోవా 6-2, 6-4తో అలెర్తోవా (చెక్)పై గెలిచింది. ఐదో సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్), వీనస్ విలియమ్స్ (అమెరికా), మాడిసన్ కీస్ (అమెరికా), పెంగ్ (చైనా), ఒస్తాపెంకో (లాత్వియా) కూడా రెండో రౌండ్‌కు చేరుకున్నారు.

ఎవరీ నాగాల్

సుమిత్ నాగాల్ 1997లో జన్మించాడు. 2015లో లి హాయాంగ్ నామ్ (వియత్నాం)తో కలిసి వింబుల్డన్ బాలుర డబుల్స్ టైటిల్ గెలవడం ద్వారా వెలుగులోకి వచ్చాడు. మొదట అతడి ప్రతిభను గుర్తించింది మహేశ్ భూపతి. గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ ఛాంపియన్‌ను తయారు చేయడమే లక్ష్యంగా ప్రతిభాన్వేషణ కార్యక్రమం నిర్వహించిన అతడు.. పదేళ్ల వయసులో సుమిత్‌ను ప్రత్యేక శిక్షణకు ఎంపిక చేశాడు. గాయాలతో చాలా ఇబ్బందిపడ్డ అతడు... ఏప్రిల్‌లో ఏటీపీ ర్యాంకింగ్స్‌లో 350వ స్థానంలో ఉన్నాడు. ఆ తర్వాత చక్కని విజయాలు సాధించిన అతడు ప్రస్తుతం కెరీర్‌లోనే అత్యుత్తమ ర్యాంకు (190వ)లో ఉన్నాడు. నిరుడు ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ క్వాలిఫయర్స్‌లో పోటీపడ్డా ఒక్క మ్యాచ్ కూడా నెగ్గలేకపోయాడు. కానీ యుఎస్ ఓపెన్ అర్హత పోటీల్లో మాత్రం సత్తా చాటాడు.

## బుమ్రా కష్టానికి ఫలితమిది

వీవీఎస్ లక్ష్మణ్

వెస్టిండీస్‌తో తొలి టెస్టులో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన టీమ్‌ఇండియా.. మొదట్లో కొంత తడబడ్డా.. చివరి రోజు సాయంత్రం ప్రత్యర్థిని కుప్పకూల్చి విదేశీ గడ్డపై అతి పెద్ద విజయాన్నందుకుంది. తొలి రోజు ఆరంభంలోనే భారత్ 3 వికెట్లు కోల్పోవడం చూసి ఏదో అనుకున్నారు. కానీ కోహ్లీ సేన నిజమైన ప్రపంచ నంబర్‌వన్‌లా ఆడి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. రెండేళ్లుగా టెస్టుల్లో సెంచరీ చేయని రహానె కచ్చితంగా ఒత్తిడికి గురై ఉంటాడు. మూడంకెల స్కోరు అందుకున్నాక రహానె స్పందన చూస్తే ఈ సెంచరీ అతడికెంత కీలకమో అర్థమైంది. నిజానికి తన పూర్తి సామర్థ్యానికి అజింక్య ఇంకా న్యాయం చేయలేదనే నా అభిప్రాయం. మ్యాచ్‌లో ప్రత్యేకంగా నిలిచిన ప్రదర్శన బుమ్రాదే. నెట్స్‌లో అతను పడే కష్టానికి ఫలితమే ఈ ప్రదర్శన. వ్యాఖ్యాతల బృందంలో ఉంటూ వెస్టిండీస్ పతనం గురించి వివ్ రిచర్డ్స్, ఇయాన్ బిషప్‌ల ఆవేదనను ప్రత్యక్షంగా గమనించా. ఆ జట్టు ఆటగాళ్లు తమను తాము నమ్మి ముందుకు సాగాలి.






### ● కోట్లా స్టేడియానికి జైట్లీ పేరు

దిల్లీ: దిల్లీలోని ఫిరోజ్‌షా కోట్లా స్టేడియానికి దివంగత మాజీ కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ పేరు పెట్టనున్నారు. దిల్లీ క్రికెట్ సంఘానికి సుదీర్ఘ కాలం పాటు సేవలందించిన జైట్లీ పేరును కోట్లా స్టేడియానికి పెట్టాలని నిర్ణయించినట్లు డీడీసీఏ తెలిపింది. "జైట్లీ ప్రోత్సాహం వల్లే కోహ్లి, సెహ్వాగ్, గంభీర్, నెహ్రా, పంత్ లాంటి భారత్ గర్వించే ఆటగాళ్లు వెలుగులోకొచ్చారు. అందుకే కోట్లాకు ఆయన పేరు పెడుతున్నాం" అని డీడీసీఏ అధ్యక్షుడు రజత్ శర్మ చెప్పాడు.

### ● శ్రీనుకు రజతం

లఖ్‌నవూ: అంతరాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ బుగత శ్రీను సత్తా చాటాడు. మంగళవారం జరిగిన పురుషుల 5000 మీటర్ల పరుగులో 14:35.30 నిమిషాల్లో లక్ష్యాన్ని చేరుకుని శ్రీను రజతం గెలుచుకున్నాడు. ఈ రేసులో లక్ష్మణన్ (తమిళనాడు, 14:34.30 ని) స్వర్ణాన్ని సొంతం చేసుకోగా, మాన్‌సింగ్ (ఉత్తరాఖండ్, 14:40.63 ని) కాంస్యం నెగ్గాడు.

### దీవుల్లో హాయ్ హాయ్

వెస్టిండీస్‌తో తొలి టెస్టు తర్వాత సమయం చిక్కడంతో టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి, భార్య అనుష్క శర్మ తోడుగా కరీబియన్ దీవుల్లో విహరిస్తున్నాడు. అనుష్కతో పాటు సహచరులు కేఎల్ రాహుల్, అశ్విన్, మయాంక్ అగర్వాల్‌తో కలిసి బోటుపై షికారు చేశాడు. ఈ చిత్రాన్ని రాహుల్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకున్నాడు.



ఈనాడు బిజినెస్

| | | | |
|---|---|---|---|
| సెన్సెక్స్ ▲ 147 | 37641 | నిఫ్టీ ▲ 48 | 11105 |
| డోజోన్స్ ▼ 63 | 25836 | నాస్‌డాక్ ▼ 16 | 7837 |

అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

| | |
|---|---|
| రూపాయి ▲ 71.48 54పైసలు (ఒక అమెరికా డాలరుకు) | ముడిచమురు ▲ 59.07 (బ్రెంట్ ధర డాలర్లలో) |

**ఘనం (+)**

| నిఫ్టీ | 27న | మార్పు% |
|---|---|---|
| TATA MOTORS | 120.35 | 8.86 |
| BRITANNIA | 2685.90 | 6.00 |
| TATA STEEL | 350.90 | 3.80 |
| GAIL (INDIA) | 130.20 | 3.01 |
| EICHER MOTORS | 15995.40 | 2.88 |
| INDUSIND BANK | 1386.10 | 2.79 |
| NTPC | 123.20 | 2.62 |

**గ్రహణం (-)**

| నిఫ్టీ | 27న | మార్పు% |
|---|---|---|
| BHARTI AIRTEL | 348.30 | -3.42 |
| INDIABULLS HSG | 471.50 | -3.33 |
| INFOSYS | 784.65 | -2.23 |
| TECH MAHINDRA | 676.35 | -2.14 |
| GRASIM | 723.95 | -1.81 |
| TCS | 2236.50 | -1.75 |
| DR. REDDYS LAB | 2540.70 | -1.03 |

**విదేశీ మారకపు రేట్లు**



(థామస్ కుక్) (రూ.లలో)

| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం | కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|---|
| అమెరికా డాలరు | 65.32 | 75.73 | బహ్రెయిన్ దీనార్ | 176.55 | 202.26 |
| పౌండ్ స్టెర్లింగ్ | 79.75 | 92.49 | కువైట్ దీనార్ | 195.55 | 243.51 |
| యూరో | 72.51 | 84.09 | ఒమన్ రియాల్ | 172.98 | 198.16 |
| జపనీస్ యెన్/100 | 61.78 | 71.65 | సౌదీ రియాల్ | 17.32 | 20.58 |
| ఆస్ట్రేలియా డాలరు | 44.19 | 51.12 | యూఏఈ దిర్హమ్ | 17.73 | 20.79 |
| సింగపూర్ డాలరు | 47.01 | 55.67 | మలేషియా రింగిట్ | 15.20 | 18.69 |
| థాయ్ బాత్/100 | 213.52 | 255.28 | చైనీస్ యువాన్ | 7.10 | 11.51 |



**కోడిగుడ్లు** — 27న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 319 | వరంగల్ | 322 |
| చిల్లరగా(ఒక గుడ్డు) | 3.80 | విశాఖపట్నం | 361 |
| బెంగళూరు | 335 | చెన్నై | 345 |
| 28వ తేదీకి... | | చిత్తూరు | 338 |
| విజయవాడ | 338 | నమక్కల్ | 348 |
| గోదావరి | 338 | | |

# మూడో రోజూ ముందుకే

● కొనసాగిన లాభాలు ● కలిసొచ్చిన అంతర్జాతీయ సంకేతాలు




సమీక్ష

వరుసగా మూడో రోజూ సూచీల జోరు కొనసాగింది. లోహ, వాహన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడం, సానుకూల అంతర్జాతీయ సంకేతాలు ప్రభావం చూపాయి. ప్రభుత్వానికి రూ.1.76 లక్షల కోట్ల మిగులు నిధులను బదిలీ చేయడానికి ఆర్‌బీఐ ఆమోదం తెలపడం కలిసొచ్చింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 54 పైసలు పెరిగి 71.48 వద్ద ముగియడానికి తోడు అమెరికాకు మాంద్యం తప్పదన్న అంచనాలతో ఐటీ షేర్లు ఒత్తిడి ఎదుర్కొన్నాయి. అమెరికా- చైనా వాణిజ్య చర్చలు మళ్లీ ప్రారంభం కావొచ్చన్న అంచనాలతో ఆసియా మార్కెట్లు కోలుకున్నాయి. ఐరోపా మార్కెట్లు మెరుగ్గా ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 37,658.48 పాయింట్ల వద్ద సానుకూలంగా ప్రారంభమైంది. అదే జోరు కొనసాగిస్తూ.. 37,731.51 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని తాకింది. అనంతరం ఒడుదొడుకులు ఎదుర్కొన్న సూచీ.. ఒకానొ కదశలో 37,449.69 పాయింట్లకు పడిపోయింది. చివరకు 147.15 పాయింట్ల లాభంతో 37,641.27 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ సైతం 47.50 పాయింట్లు పెరిగి 11,105.35 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 11,049.50- 11,141.75 పాయింట్ల మధ్య కదలాడింది. గత మూడు సెషన్లలో సెన్సెక్స్ 1168.34 పాయింట్లు, నిఫ్టీ 364 పాయింట్లు చొప్పున లాభాలు నమోదు చేశాయి.

సెన్సెక్స్ 30 షేర్లలో 22 లాభాలతో ముగిశాయి. టాటా మోటార్స్ 8.87%, టాటా స్టీల్ 3.86%, ఎన్‌టీపీసీ 2.75%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 2.72%, వేదాంతా 2.07%, ఎం అండ్ ఎం 2.07%, యెస్ బ్యాంక్ 2.06%, ఎస్‌బీఐ 1.94%, ఎల్ అండ్ టీ 1.79%, పవర్‌గ్రిడ్ 1.77% చొప్పున రాణించిన వాటిలో ఉన్నాయి. భారతీ ఎయిర్‌టెల్ 3.58%, ఇన్ఫోసిస్ 2.23%, టెక్ మహీంద్రా 2.12%, టీసీఎస్ 1.67%, కోటక్ బ్యాంక్ 0.73% మేర నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో లోహ, వాహన, చమురు-గ్యాస్, యంత్ర పరికరాలు, యుటిలిటీస్, విద్యుత్ 2.04% వరకు రాణించాయి. టెలికాం, టెక్, ఐటీ 2.26% వరకు పడ్డాయి. బీఎస్‌ఈలో 1672 షేర్లు లాభాల్లోనూ, 859 షేర్లు నష్టాలతోనూ ముగిశాయి. 158 షేర్లలో ఎటువంటి మార్పు లేదు.

## ఫోక్స్‌వ్యాగన్ మాజీ అధిపతి మృతి

బెర్లిన్: 'మిస్టర్ ఫోక్స్ వ్యాగన్'గా సుప్రసిద్ధుడైన ఫెర్డినాండ్ కార్ల్ పీచ్(82) కన్నుమూశారు. దివాలాలో ఉన్న కంపెనీని అంతర్జాతీయ దిగ్గజ సంస్థగా తీర్చిదిద్దిన ఘనత ఆయనది. కేవలం ఒక తెలివైన ఇంజినీర్‌గానే కాకుండా.. దూరదృష్టి గల గొప్ప కార్పొరేట్ నేతగానూ ఆయన పలువురి మన్ననలు అందుకున్నారు. యాభై ఏళ్లకు పైగా తన వృత్తిజీవితంలో ఫోక్స్ వ్యాగన్‌ను 13 బ్రాండ్ల సామ్రాజ్యంగా మార్చగలిగారు. ప్రస్తుతం ఆ కంపెనీ 6,60,000 మందికి ఉపాధినిస్తోంది. అయితే కంపెనీ డీజిల్ గేట్ కుంభకోణాన్ని ఎదుర్కోవడానికి ముందు, ఆయన కంపెనీని వీడడంతో చాలా మంది ఆగ్రహం వ్యక్తం చేసిన మాట వాస్తవం. కాగా, వియాన్నాలో ఏప్రిల్ 17, 1937న పీచ్ జన్మించారు.



## రూ.100 లక్షల కోట్ల నిర్వహణ ఆస్తులే లక్ష్యం

● మదుపర్లు కూడా 10 కోట్ల మంది అవ్వాలి

● వచ్చే దశాబ్దానికి మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ ప్రణాళిక

దిల్లీ: రూ.25 లక్షల కోట్ల స్థాయిలోని నిర్వహణ ఆస్తుల్ని వచ్చే దశాబ్దానికి రూ.100 లక్షల కోట్ల స్థాయికి తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు భారత మ్యూచువల్ ఫండ్ల పరిశ్రమ సంఘం (యాంఫీ) వెల్లడించింది. ప్రస్తుతం మదుపర్లు 2 కోట్ల మంది ఉండగా, ఈ సంఖ్యను 10 కోట్లకు చేర్చాలని భావిస్తోంది. ఈ నివేదికను సెబీ ఛైర్మన్ అజయ్ త్యాగి, మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ అధికారుల ఎదుట యాంఫీ విడుదల చేసింది. 'బ్యాంకులు, తపాలా కార్యాలయాల నెట్‌వర్క్‌ను వినియోగించుకుని, ప్రత్యక్ష, డిజిటల్ ఛానెళ్ల ద్వారా సాధారణ పొదుపు పరిష్కారాలను చూపించి మ్యూచువల్ ఫండ్ పరిశ్రమకు కొత్త ఖాతాదారుల్ని జత చేయాలనుకుంటున్నాం' అని యాంఫీ వెల్లడించింది.

### భద్రత విషయంలో రాజీ వద్దు

'మదుపర్లకు అధిక ప్రతిఫలాలు అందించాలన్న ఉద్దేశంతో కొన్ని మ్యూచువల్ ఫండ్లు రిస్కుతో కూడిన పెట్టుబడులకు దిగుతున్నాయి. అయితే ఆర్థిక భద్రత విషయంలో ఎవరూ రాజీ పడొద్దు. నిబంధనలను అనుసరించే పెట్టుబడులు పెట్టాలి. ఎందుకంటే 'మ్యూచువల్ ఫండ్స్ సరైనవి' అనే నినాదంతో పరిశ్రమ నడుస్తోంది. మదుపర్లకు ఫండ్లపై ఎంతో నమ్మకం ఏర్పడటానికి కొన్నేళ్లు పట్టింది. ఒక చెడు సంఘటన జరిగినా అది మొత్తం తుడిచిపెట్టుకుపోయే పరిస్థితి ఉంది. కాబట్టి జాగ్రత్తగా వ్యవహరించాలని అజయ్ త్యాగి మ్యూచువల్ ఫండ్ సంస్థలకు సూచించారు.



## చైనాకు మన జనరిక్ ఔషధాలు!

బీజింగ్: చైనాలో సవరించిన ఔషధ చట్టం వల్ల భారత జనరిక్ ఔషధాలకు మేలు జరగనుంది. 'విదేశాల్లో చట్టబద్ధమైన ఔషధాలను కూడా చైనా ఆమోదం లేక ఇప్పటివరకు ఆ దేశంలో నకిలీవిగా పేర్కొంటున్నారు. ఇకపై అలా కాదు. విదేశాల్లో చట్టబద్ధమైన ఔషధాలను, నకిలీ ఔషధ జాబితా నుంచి తొలగించే' చట్టాన్ని చైనా స్టాండింగ్ కమిటీ ఆఫ్ నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ సోమవారం ఆమోదించింది. డిసెంబరు 1 నుంచి అమల్లోకి వచ్చే కొత్త చట్టం ప్రకారం.. భారత జనరిక్ ఔషధాలతో పాటు పలు చట్టబద్ధ విదేశీ ఔషధాలను ఇక చైనాలో నకిలీ మందులుగా గుర్తించబోరు. ఈ నిర్ణయం వల్ల భారత ఫార్మా మార్కెట్ మరింత విస్తరించే అవకాశాలున్నాయని విశ్లేషకులు అంటున్నారు. కొంత మంది నిపుణులు మాత్రం.. చైనా తన మార్కెట్లోకి చౌక జనరిక్ ఔషధాలకు(ముఖ్యంగా భారత్ నుంచి) ఆహ్వానం పలుకుతోందని అంటున్నారు.

## సాంకేతిక నైపుణ్యంతో నీటి ఎద్దడిని అధిగమించాం

### ఇజ్రాయెల్ రాయబారి డాక్టర్ రాన్ మల్కా

ఈనాడు, హైదరాబాద్: 'మా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి మా జనాభా 15 రెట్లు పెరిగింది, అదే సమయంలో వర్షపాతం 50 శాతం తగ్గింది. అయినప్పటికీ పరిశోధనలతో సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయటం ద్వారా నీటి మిగులు సాధించగలిగాం, మా పొరుగు దేశాలకు కూడా నీరివ్వగలుగుతున్నాం' అని మనదేశంలో ఇజ్రాయెల్ రాయబారి డాక్టర్ రాన్ మల్కా అన్నారు. వ్యవసాయం, బిందు సేద్యం, నీటి యాజమాన్య పద్ధతులపై ఇప్పటి వరకు 1.47 లక్షల మంది రైతులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. 'ఇజ్రాయెల్‌తో వ్యాపార అవకాశాలు' అనే అంశంపై మంగళవారం ఇక్కడ తెలంగాణా వాణిజ్య మండళ్ల సమాఖ్య (ఎఫ్‌టీసీసీఐ) సారథ్యంలో జరిగిన సదస్సులో రాన్ మల్కా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తెలంగాణా రాష్ట్రం పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. సంస్థలకు త్వరితంగా అనుమతులు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణా వాణిజ్య మండళ్ల సమాఖ్య అధ్యక్షుడు కరుణేంద్ర జాస్తి, ఇతర ముఖ్యులు పాల్గొన్నారు.

## రోగుల భద్రతపై అంతర్జాతీయ సదస్సు

ఈనాడు, హైదరాబాద్: రోగుల భద్రతపై ఎనిమిదో అంతర్జాతీయ సదస్సు (ఐపీఎస్‌సీ) ను హైదరాబాద్‌లో సెప్టెంబరు 13- 14 తేదీల్లో నిర్వహించడానికి అపోలో హాస్పిటల్స్ సన్నాహాలు చేస్తోంది. సాంకేతిక పరిజ్ఞానం, వ్యక్తిగత శ్రద్ధ, భవిష్యత్తులో ఆరోగ్య సంరక్షణ, అంటువ్యాధుల నియంత్రణ, రేడియేషన్... తదితర అంశాలపై చర్చాగోష్ఠి నిర్వహిస్తారు. సుప్రసిద్ధ సంస్థలైన జాయింట్ కమిషన్ ఇంటర్నేషనల్ (జేసీఐ), వరల్డ్ ఇన్నోవేషన్ సమ్మిట్ ఫర్ హెల్త్ (విష్), నాబ్, పీడబ్ల్యూసీ, అస్కా, ఐఎంఏ, ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ, హిమా... తదితర సంస్థలు ఇందులో పాలు పంచుకుంటాయని అపోలో హాస్పిటల్స్ సంయుక్త మేనేజింగ్ డైరెక్టర్ సంగీతారెడ్డి అభిప్రాయపడ్డారు. మలేరియా, క్షయ వంటి వ్యాధులతో మరణిస్తున్న వారి కంటే, రోగి భద్రతను నిర్లక్ష్యం చేయటం వల్ల ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని తేలిన నేపథ్యంలో, ఈ సదస్సుకు ప్రాధాన్యత ఉందన్నారు.

## 2,000 విమానాలు అవసరం

### మంత్రి హర్‌దీప్ సింగ్ పురి

దిల్లీ: స్వల్ప, మధ్య కాలంలోనే దేశీయంగా సేవలందించే విమానాల సంఖ్య 2,000 కు చేరుతుందని కేంద్ర పౌర విమానయాన మంత్రి హర్‌దీప్ సింగ్ పురి తెలిపారు. జెట్ ఎయిర్‌వేస్ కార్యకలాపాలు నిలిచిపోయిన సమయంలో 540 విమానాలు మాత్రమే ఉన్నాయని, ప్రస్తుతం 690కి పెరిగాయని సీఐఐ-సీబీఆర్ఈ సమావేశంలో మంత్రి చెప్పారు. విమాన తయారీదార్లు, విమానాశ్రయాలను నిర్వహిస్తున్న సంస్థలు, టికెట్లు విక్రయించే కంపెనీలు లాభాల్లో ఉంటుంటే, విమానయాన సంస్థలు నష్టపోతున్నాయని, దీన్ని సరిదిద్దాల్సి ఉందన్నారు.

## జూన్ త్రైమాసిక ఆదాయంలో జియో మిన్న

దిల్లీ: జూన్ త్రైమాసికంలో అత్యధిక ఆదాయాన్ని ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ జియో సాధించింది. జియో రూ.10,900 కోట్లు, భారతీ ఎయిర్‌టెల్ రూ.10,701 కోట్లు, వొడాఫోన్ ఐడియా రూ.9809 కోట్ల ఆదాయాన్ని సాధించినట్లు టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. బీఎస్ఎన్ఎల్ రూ.4296 కోట్లు, ఎంటీఎన్ఎల్ రూ.408 కోట్లు మాత్రమే సాధించాయి.

## మార్కెట్ కబుర్లు

✦ ఐటీ దిగ్గజం **ఇన్ఫోసిస్** రూ.8,260 కోట్ల విలువైన షేర్ల తిరిగి కొనుగోలు (బైబ్యాక్) ప్రక్రియను ముగించింది. ఒక్కో ఈక్విటీ షేరును రూ.800 మించకుండా బైబ్యాక్ చేస్తామని, ఇందుకు రూ.8,260 కోట్లు వెచ్చిస్తామని ఈ ఏడాది జనవరిలో ప్రకటించింది.

✦ బాండ్లు, డిబెంచర్లు, నోట్లు, రుణ సెక్యూరిటీలు జారీ చేసి రూ.70,000 కోట్ల నిధుల్ని సమీకరించేందుకు వాటాదార్ల నుంచి అనుమతి లభించిందని **పీఎఫ్‌సీ** వెల్లడించింది.

✦ రుణ పరిష్కార ప్రణాళికలో భాగంగా ఈక్విటీ షేర్ల విక్రయం ద్వారా నిధుల్ని సమీకరించేందుకు బోర్డు ఆమోదం కోరినట్లు **డీహెచ్‌ఎఫ్‌ఎల్** వెల్లడించింది. ఈ నెల 30న జరిగే బోర్డు సమావేశంలో ఈ ప్రతిపాదనను డైరెక్టర్ల ముందుంచుతామని కంపెనీ ఎక్స్ఛేంజీలకు సమాచారమిచ్చింది.



కియా సెల్టోస్‌కు రూపాన్నిస్తున్న రోబోలు, (అంతర చిత్రంలో) కియా ఎండీ, సీఈవో కూక్యమ్ షిమ్

## 7 సీట్ల కారు తయారీకి కియా సన్నాహాలు

ఈనాడు డిజిటల్ – అనంతపురం, న్యూస్‌టుడే – పెనుకొండ: దేశీయంగా గిరాకీ పెరుగుతున్న 7 సీట్ల కారును అనంతపురం ప్లాంటులో తయారు చేయడానికి కియా మోటార్ సన్నద్ధమవుతోందని సమాచారం. సెప్టెంబరు 15 నుంచే ఆ కారు ప్రయోగాత్మక తయారీ చేపట్టనున్నట్లు సమాచారం. ఇప్పటికే కొరియా రోడ్లపై పరుగులు పెడుతున్న కియా కార్నివాల్ మోడల్‌లో కొన్ని మార్పులు చేసి ఇక్కడ తీర్చిదిద్దనున్నట్లు తెలిసింది. ఏడాదికి 3 లక్షల కార్ల ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకునేందుకు అత్యాధునిక సాంకేతికతతో కూడిన 300 రోబోలు ఇక్కడ సేవలందిస్తున్నాయి. అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దడం వల్లే కియా సెల్టోస్ కారుకు భారత్‌లో అపూర్వ ఆదరణ లభిస్తోందని సంస్థ ఎండీ, సీఈవో కూక్యమ్ షిమ్ పేర్కొన్నారు. ఈప్లాంట్‌లోని 1,948 మంది ఉద్యోగుల్లో 83 శాతం మంది ఆంధ్రప్రదేశ్ వారేనని షిమ్ వివరించారు.

# ఆన్‌లైన్ సంస్థల ద్వారా జరిపే విక్రయాలకూ చెల్లించాలి!



సతీష్ సరాఫ్, చార్టర్డ్ అకౌంటెంట్

**? మేం రెస్టారెంటు నిర్వహిస్తున్నాం. జొమాటో లాంటి ఆన్‌లైన్ సేవల సంస్థల ద్వారా కూడా విక్రయాలు జరుపుతున్నాం. వినియోగదారులు చెల్లించే డబ్బుల్లో కమిషన్ మినహాయించుకొని ఆ తర్వాత జొమాటో మాకు చెల్లింపులు చేస్తుంటుంది. మేం ఇ-కామర్స్ సంస్థల ద్వారా జరిపే విక్రయాలను జీఎస్‌టీఆర్-3బీలో చూపించాల్సి ఉంటుందా? ఈ విక్రయాలపై జీఎస్‌టీ కట్టాల్సి ఉంటుందా? జొమాటో మినహాయించుకున్న 1% టీసీఎస్ వివరాలను కూడా తెలియజేయాలా**

– భరత్

ఇ-కామర్స్ సంస్థల ద్వారా జరిపే విక్రయాలు సహా మొత్తం విక్రయాలకు రెస్టారెంట్లు జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. ఇ-కామర్స్ సంస్థల ద్వారా జరిపే విక్రయాలను జీఎస్‌టీఆర్-3బీ రిటర్న్‌లో పొందుపరిచి, వాటికి మీరు పన్ను కట్టాలి. అలాగే మీ ఎలక్ట్రానిక్ నగదు లెడ్జర్‌లో జమ అయ్యే టీసీఎస్‌ను మీరు చెల్లించాల్సిన పన్ను మొత్తంతో సర్దుబాటు చేసుకోవచ్చు. ఈ సర్దుబాటు చేసిన అనంతరం మిగతా ఎంతైతే మీరు కట్టాల్సి ఉంటుందో దానిని నగదు రూపేణా చెల్లించవచ్చు.

**? నేను నిర్మాణదశలో ఉన్న ఓ ఫ్లాటును రూ.44 లక్షలకు కొనుగోలు చేశాను. అడ్వాన్స్ కింద రూ.10 లక్షలు ఇప్పటికే చెల్లించాను. నిర్మాణదారు దీనిపై 5% జీఎస్‌టీ చెల్లించమని అడుగుతున్నారు. అసలు నేను ఎంత జీఎస్‌టీ చెల్లించాలి**

– కల్యాణ్ సి మిశ్రా

మీరు రూ.44 లక్షలపై 5 శాతం అంటే రూ.2.20 లక్షలు జీఎస్‌టీ కింద కట్టాల్సి ఉంటుంది. నిర్మాణదారు మీకు పన్ను రశీదు ఇచ్చినప్పుడు దీనిని చెల్లిస్తే సరిపోతుంది. సాధారణంగా ఫ్లాటు స్వాధీనం చేసిన అనంతరం 30 రోజుల్లోగా పన్ను రశీదు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే అడ్వాన్స్ డబ్బులపై జీఎస్‌టీ చెల్లించమని జీఎస్‌టీ చట్టంలో ఎటువంటి నిబంధన లేదు.

**? మేం ఇంట్లో చేనేత వస్త్రాలను తయారుచేస్తున్నాం. వీటిని అమెజాన్ లాంటి ఆన్‌లైన్ విక్రయకేంద్రాల్లో విక్రయించాలని అనుకుంటున్నాం. అయితే వాళ్లు జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ సంఖ్య అడుగుతున్నారు. నిజంగానే మాకు జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ అవసరమా..**

– హరిప్రియ

ఇ-కామర్స్ సంస్థల ద్వారా వస్తువులను విక్రయించదలిస్తే కచ్చితంగా జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ ఉండాలి. దీని కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జీఎస్‌టీ.గవ్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. మీరు సొంతంగా రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకోలేకపోతే.. జీఎస్‌టీ కన్సల్టెంట్‌ను సంప్రదించండి.



**? మాది స్థిరాస్తి వ్యాపారం. 2018-19 ఆర్థిక సంవత్సరానికి మాకు ఐటీసీ ఉంది. దానిని 2019-20 ఆర్థిక సంవత్సరానికి వాడొచ్చా**

– పొఫూరి.లోహిత్

2018-19కి పొందిన ఐటీసీని 2019-20 ఆర్థిక సంవత్సరం పన్ను చెల్లింపులకు వాడొచ్చు. ఎలక్ట్రానిక్ క్రెడిట్ లెడ్జర్‌లో ఒక్కసారి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ అయితే దానిని జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ రద్దయ్యే వరకు ఎన్ని సంవత్సరాలకైనా ఉపయోగించుకోవచ్చు.

**? మేము కిరాణా దుకాణాన్ని నిర్వహిస్తున్నాం. మా టర్నోవరు రూ.40 లక్షల్లోపే. గతేడాది కాంపోజిషన్ విధానంలో ఉన్నాము. అయితే మా ఆడిటర్ తిరిగి కాంపోజిషన్ విధానాన్ని ఎంపిక చేయకపోవడంతో ప్రస్తుతం సాధారణ డీలర్‌గా ఉన్నాం. ఇప్పటివరకు 2019-20 రిటర్న్‌లు దాఖలు చేయలేదు. జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని అనుకుంటున్నాం. ఆర్థిక సంవత్సరం మధ్యలో రిజిస్ట్రేషన్ రద్దుకు వీలవుతుందా**

– పి.వి.కృష్ణ

ఆర్థిక సంవత్సరం మధ్యలో జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ రద్దుకు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే అంతకంటే ముందు ఆ తేదీ వరకు రిటర్న్‌లన్నింటినీ సమర్పించాల్సి ఉంటుంది.

**? మాకు పారాబాయిల్డ్ బియ్యం ఫ్యాక్టరీ ఉంది. దీని నిర్మాణానికి వాడిన భారీ యంత్రపరికరాలకు ఐటీసీ క్లెయిమ్ చేసుకున్నాను. అయితే వీటిపై ఐటీసీ రాదని అంటున్నారు. ఇది నిజమేనా? దీనిని జీఎస్‌టీఆర్-9లో ఎలా రివర్సల్ చేయాలి**

–కృష్ణమూర్తి

మీరు విన్నదానిలో కొంత వరకే కరెక్టు. సివిల్ పనులు మినహా మిగిలిన వాటికి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందేందుకు మీరు అర్హులు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాలంటే సీజీఎస్‌టీ చట్టం- 2017లోని సెక్షన్ 17, సీజీఎస్‌టీ నిబంధనలు- 2017లోని నియమం 43ను అధ్యయనం చేయండి. వార్షిక రిటర్న్ జీఎస్‌టీఆర్-9లో మీరు ఐటీసీని రివర్సల్ చేయొచ్చు. అయితే నగదు రూపంలో మీరు దానిని తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ ఐటీసీని తగ్గించుకోవాలని మీరు అనుకుంటే జీఎస్‌టీ డీఆర్‌సీ-03 ఫారాన్ని సమర్పించి తద్వారా అధికంగా క్లెయిమ్ చేసుకున్న ఐటీసీని రివర్స్ చేయొచ్చు. అయితే ఈ రెండు మార్గాల్లో ఎలా రివర్సల్ చేయాలనుకున్నా.. మీరు ఆ రోజు వరకు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది.

**? జీఎస్‌టీఆర్-9 రిటర్న్‌ను ఎలా దాఖలు చేయాలో దయచేసి తెలియజేయండి**

– వెంకటేశ్వర్లు

రిటర్న్‌ల దాఖలు ప్రక్రియను పత్రికలో వివరించడం వీలు కాదు. ఇందుకు నన్ను క్షమించగలరు. మీరు రిటర్న్ దాఖలు గురించి తెలుసుకోవాలంటే ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా జారీ చేసిన టెక్నికల్ గైడ్‌ను అధ్యయనం చేయండి. జీఎస్‌టీఆర్-9, జీఎస్‌టీఆర్-9ఏ, జీఎస్‌టీఆర్-9సీ దాఖలుకు సంబంధించి పూర్తి ప్రక్రియను అందులో వివరించారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐడీటీసీ.ఐసీఏఐ.ఓఆర్‌జీ వెబ్‌సైట్ ద్వారా ఈ టెక్నికల్ గైడ్‌ను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

**? (1) మాది సిమెంటు వ్యాపారం. జీఎస్‌టీ రెగ్యులర్ డీలరుగా నెలవారీ రిటర్న్‌లు దాఖలు చేస్తున్నాను. కంపెనీ ఇచ్చిన రశీదు ప్రకారం జీఎస్‌టీఆర్-3బీలో ఐటీసీ క్లెయిమ్ చేసుకున్నాను. కానీ కంపెనీ వాళ్లు డిస్కౌంట్ తగ్గించి నాకు జీఎస్‌టీఆర్-2ఏలో చూపించారు. 2017-18 వార్షిక రిటర్న్ దాఖలు చేయాలంటే జీఎస్‌టీఆర్-3బీ, జీఎస్‌టీఆర్-2ఏ క్లెయిమ్‌ల మధ్య వ్యత్యాసం కనిపిస్తోంది. ఈ వ్యత్యాసాన్ని చెల్లిస్తేనే రిటర్న్‌ల దాఖలు వీలవుతుందని మా ఆడిటర్ అంటున్నారు. జులై 2019 జీఎస్‌టీఆర్-3బీ నేను ఇంకా దాఖలు చేయలేదు. ఇన్‌పుట్ క్లెయిమ్ కూడా ఎక్కువ ఉంది.. 2017-18లో వచ్చిన వ్యత్యాసాన్ని ఇప్పుడు రివర్సల్ చేయొచ్చా**

**(2) నేను జీఎస్‌టీ రిటర్న్‌లను ప్రతి నెలా దాఖలు చేస్తున్నాను. నేను ఏప్రిల్ 2018 నుంచి డిసెంబరు 2018 వరకు కొన్ని బిల్లులు పోవడం వల్ల ఐటీసీని క్లెయిమ్ చేసుకోలేకపోయాను. కానీ అవి జీఎస్‌టీఆర్-2ఏ రిటర్న్‌లో అప్‌లోడ్ చేశారు. నేను ఇప్పుడు వాటిని క్లెయిమ్ చేసుకోవచ్చా**

– పావని

(1) 2017-18 ఆర్థిక సంవత్సరానికి జీఎస్‌టీఆర్-3బీ రిటర్న్‌ను దాఖలు చేసేటప్పుడే సిమెంటు తయారీ సంస్థ నుంచి మీకు లభించిన డిస్కౌంట్‌ను తగ్గించుకొనే ఐటీసీ క్లెయిమ్ చేసుకోవాల్సి ఉండేది. మీ ఆడిటర్ చెప్పింది నిజమే. మీరు నగదు రూపేణా భారీ మొత్తాన్ని చెల్లించలేకుంటే.. డీఆర్‌సీ-03 ఫారాన్ని సమర్పించొచ్చు. ఆవిధంగా డిస్కౌంట్లపై పొందిన ఐటీసీని సర్దుబాటు చేసుకోవచ్చు. 2017-18 వార్షిక రిటర్న్‌ను దాఖలుకు ముందు డీఆర్‌సీ-03 ఫారాన్ని సమర్పించాల్సి ఉంటుంది.

(2) 2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఐటీసీని 2019-20లో క్లెయిమ్ చేసుకోవచ్చు. అయితే 2019 సెప్టెంబరు నెలకు నెలవారీ రిటర్న్ దాఖలు (20-10-2019)కు ముందు లేదంటే 2018-19 వార్షిక రిటర్న్ దాఖలు తేదీ ఏదీ ముందయితే అప్పటివరకు ఐటీసీ క్లెయిమ్ చేసుకోవాల్సి ఉంటుంది.

**మీ సందేహాలు పంపండి**

జీఎస్‌టీకి సంబంధించి మీ సందేహాలు మాకు పంపించండి.. మీ సందేహాలు ఎలాంటివైనా సరే అవి క్లుప్తంగానూ, సరళంగానూ ఉండాలి.. మా చిరునామా eenadubusinessdesk@gmail.com; businessdesk@eenadu.net

ఈనాడు బిజినెస్



ఆర్థిక మంత్రి వ్యూహాలు విశ్లేషణ

# ఉద్దీపనలు పరుగు పెట్టిస్తాయా?

**ఆర్థిక వ్యవస్థ నెమ్మదించింది.**

**గిరాకీ తగ్గి, పలు రంగాల్లో వృద్ధి అంతంత మాత్రంగా కనిపిస్తోంది.**

**వాహన విక్రయాలు క్షీణిస్తున్నందున, కంపెనీలు ఉత్పత్తిలో కోత విధిస్తున్నాయి. తాత్కాలిక ఉద్యోగులు ఉపాధి కోల్పోతున్నారు.**

**ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించి.. పలు ఉద్దీపనలు ప్రకటించింది.**

**పన్ను చెల్లింపుదార్లు, పరిశ్రమల నిర్వాహకులు, బ్యాంకర్లలో ఏర్పడిన భయాన్ని తగ్గించడానికి ప్రయత్నాలు చేసింది.**

**వ్యవస్థలోకి ద్రవ్యలభ్యతను పెంచింది. ఉప సంహారణలు, పునరుజ్జీవ ప్రణాళికల ద్వారా గిరాకీ, సెంటిమెంటు పెంచడానికి చర్యలు ప్రకటించింది.**

**.. అయితే నెమ్మదించిన వృద్ధిని పరుగులు పెట్టించేలా ఈ చర్యలున్నాయా అనే అంశంపై పలు విశ్లేషణలు వస్తున్నాయి.**

### సర్‌ఛార్జీ: దేశీయ హెడ్జ్‌ఫండ్‌లకు ప్రయోజనం వద్దా?

రూ.2 కోట్లకు మించి ఆర్జిస్తున్న ఎఫ్‌పీఐలపై విధించిన సర్‌ఛార్జీని ఉపసంహరిస్తున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. అంతర్జాతీయ బ్యాంకులు భారత్‌లో చేసే డెరివేటివ్ ట్రేడింగ్‌లకు ఊరటనిచ్చి.. స్థానిక హెడ్జ్ ఫండ్‌లకు అదే ప్రయోజనాన్ని ఎందుకు ఇవ్వలేదన్నది విశ్లేషకుల ప్రశ్న.

### వాహనరంగం: ఉత్పత్తి పెంచుతారా?

వాహన రంగానికి ఊరటనిచ్చేందుకు ప్రభుత్వం అధికార కార్యకలాపాలకు పాత కార్ల స్థానంలో కొత్తవి కొనేందుకు అంగీకరించింది. వచ్చే ఏడాది బీఎస్ 6 ఉద్గార ప్రమాణాలు అమల్లోకి వచ్చినా.. ఈ కార్లకు వచ్చిన ఇబ్బందేమీ ఉండదు. అయితే ఈ చర్య వల్ల కంపెనీలు, డీలర్ల వద్ద ఉన్న నిల్వలోని వాహనాల సంఖ్య తగ్గుతుంది మినహా తిరిగి సాధారణ స్థాయికి విక్రయాలు చేరుకునే వరకు తయారీదార్లు ఉత్పత్తి పెంచరు. ప్రజల ఆదాయాలు పెరిగేలా, వారికి చౌకగా రుణాలు అందే పరిస్థితిని వేగంగా తీసుకురావాల్సి ఉంది.

### ఏంజెల్ పన్ను: ఇన్నాళ్లు ఎందుకు ఆగారు?

అంకుర సంస్థలకు ఏంజెల్ పన్ను తొలగించడం మంచి విషయమే. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని ప్రభుత్వం తీసుకొచ్చిన ఆ పన్నును ఇన్నేళ్లు ఎందుకు తొలగించలేదు. అది కూడా అంత సులువుగా తొలగింపు సాధ్యమైనపుడు. అని ప్రశ్నిస్తున్నారు.

### బ్యాంకులు: నిధులు సరిపోతాయా?

బ్యాంకుల సంగతికి వద్దాం. వీటికి కేవలం 16 కంపెనీల నుంచే రూ.2.4 లక్షల కోట్ల మొండి బకాయిలున్నాయి. ఇందులో సగం సమస్యల్లో చిక్కుకున్న బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లకు ఇచ్చినవేనని క్రెడిట్ సూయిజ్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రూ.70,000 కోట్ల మూలధన నిధులు సరిపోతాయా అన్నది మరో ప్రశ్న.

### రేట్ల కోతలు: ప్రస్తుత వినియోగదార్ల మాటేమిటి?

రెపో రేట్లను రుణ రేట్లకు అనుసంధానించే చర్యను అందరూ ప్రశంసిస్తున్నారు. కానీ.. ఇప్పటికే రుణాలు తీసుకున్న వారికి రుణ వ్యయాలను తగ్గించకుండా చూసే మార్గాలను బ్యాంకర్లు అన్వేషిస్తున్నారని చెబుతున్నారు. దీన్ని నివారించాలి.

**ఈ మూడింటికి మద్దతు అవసరం**

జౌళి, వాహన, ఎలక్ట్రానిక్స్. ఈ మూడు రంగాల్లో భారీ సంఖ్యలో ఉద్యోగాలకు అవకాశం ఉంటుంది. నిర్మాణ, స్థిరాస్తి రంగానికీ ఇవి చేయూత నిస్తాయి. కానీ.. జౌళిలో బంగ్లాదేశ్ చాలా ముందుంది. వాహనాల్లో థాయ్‌లాండ్ దూసుకెళుతోంది. వియత్నాం ఎలక్ట్రానిక్స్‌లో మెరుస్తోంది. అందువల్ల ఈ మూడు రంగాల్లో సరైన వ్యూహాలను అమలు చేస్తే మినహా భారత ఎగుమతులు రాణించలేవని విశ్లేషకులంటున్నారు.

**అదే జరిగితే..**

అమెరికా కంపెనీలు చైనా నుంచి తమ ఉత్పత్తి కేంద్రాలను బయటకు తీసుకురావాలని సూచిస్తూ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ఒక ట్వీట్ చేశారు. ఇదే జరిగితే, భారత్‌కు మంచి అవకాశమని ఆర్థికవేత్తలు అంటున్నారు. చైనా నుంచి బయటకు వచ్చే కంపెనీలను ఆకర్షించేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు ప్రారంభిస్తే, 'భారత్‌లో తయారీ'ని తదుపరి స్థాయికి తీసుకెళ్లవచ్చు.

## నిపుణులతో సంప్రదించాకే నిధులు బదిలీ చేయాలి

ఆర్‌బీఐ ఉద్యోగుల సంఘం

**ఈనాడు, హైదరాబాద్:** ఆర్‌బీఐ వద్ద ఉన్న మిగులు నిధులను కేంద్ర ప్రభుత్వానికి బదిలీ చేసే అంశంపై విస్తృత స్థాయిలో సంప్రదింపులు చేపట్టాలని అఖిల భారత రిజర్వ్ బ్యాంకు ఉద్యోగుల సంఘం అభిప్రాయపడింది. బ్యాంకింగ్ రంగాన్ని ఆదుకునే రిజర్వు బ్యాంకు నుంచి నిధులు తీసుకుని, ఆర్థికంగా దాన్ని బలహీనపరిస్తే... ఏదైనా పెద్ద ఆర్థిక ఇబ్బంది వచ్చినప్పుడు లేదా మాంద్యం ముంచుకొచ్చినప్పుడు తట్టుకునే అవకాశం ఎక్కడుంటుందని ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సమీర్ ఘోష్ ప్రశ్నించారు. ఒక పక్క ప్రభుత్వానికి లోటు భారం ఉందని, అంతర్జాతీయ రేటింగ్ కూడా మెరుగ్గా లేదని, ఈ తరుణంలో ఆర్‌బీఐ నుంచి నిధులు తీసుకోవడం మరింత ఇబ్బందికరమవుతుందని అన్నారు. కొలంబియా విశ్వవిద్యాలయంతో కలిసి సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ ఫైనాన్షియల్ రీసెర్చ్ అండ్ లెర్నింగ్ సంస్థ, 47 దేశాల కేంద్ర బ్యాంకుల ఆస్తి అప్పుల పట్టీలను విశ్లేషించినప్పుడు ఆర్‌బీఐకి తగినంత ప్రాథమిక మూలధనం (కోర్ కేపిటల్) లేదని స్పష్టమైందని గుర్తుచేశారు. ఆర్‌బీఐ నుంచి నిధులు తీసుకునే అంశంలో ఇమిడి ఉన్న దీర్ఘకాలిక పరిణామాలను దృష్టిలో పెట్టుకుని, విస్తృత ప్రాతిపదికన ఆర్‌బీఐ మాజీ గవర్నర్లు, ఇతర నిపుణులతో చర్చించి ఆ తర్వాతే తగిన నిర్ణయానికి రావాలని కోరారు.

### మందగమనానికి మందు: ఆర్థికవేత్తలు

ప్రభుత్వానికి రూ.1.76 లక్షల కోట్లు బదిలీ చేయడానికి ఆర్‌బీఐ అంగీకరించడం ఆహ్వానించదగ్గ పరిణామమని ఆర్థికవేత్తలు, నిపుణులు అంటున్నారు. పెట్టుబడులు పెంచడానికి, రంగాలవారీగా ఉద్దీపనలు ప్రకటించడానికి తద్వారా మందగమనం పాలవుతున్న ఆర్థిక వ్యవస్థతో పోరాటం చేయడానికి ఈ నిధులు మోదీ ప్రభుత్వానికి ఉపయోగపడతాయని అంటున్నారు. రుణాలను తగ్గించుకోవడానికి; రూ.3.3 లక్షల కోట్ల మూలధన ప్రణాళికలకు మద్దతు ఇవ్వడానికి; బ్యాంకులకు మూలధనం ఇవ్వడానికి; ఒత్తిడిలో ఉన్న రంగాలకు ద్రవ్య ఉద్దీపనలు ఇవ్వడానికి ఇవి ఉపయోగపడతాయని నిపుణులు అంటున్నారు బ్యాంక్ ఆఫ్ అమెరికా మెరిల్ లించ్ గ్లోబల్ రీసెర్చ్ నివేదిక ప్రకారం.. బ్యాంకులకు రూ.70,000 కోట్లు ఇచ్చేందుకు ఆర్‌బీఐ నిధులను ప్రభుత్వం ఉపయోగించవచ్చు.

### ఉద్దీపనలిచ్చినా.. వృద్ధి 6.4 శాతమే: మూడీస్

ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఉద్దీపన చర్యలు మదుపర్లు, వ్యాపారుల సెంటిమెంటుకు ఊతమివ్వచ్చు కానీ.. దేశీయ, అంతర్జాతీయ సమస్యలను మాత్రం అడ్డుకోలేవని మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి 6.4 శాతానికి పరిమితం కావొచ్చని తెలిపింది. తదుపరి ఆర్థిక సంవత్సరంలో వృద్ధి 6.8 శాతానికి పుంజుకోవచ్చని అంటోంది.

### మరింత డీలా పడకపోవచ్చు: యెస్ బ్యాంక్

'గత 3-4 త్రైమాసికాలుగా భారత వృద్ధి నెమ్మదించింది. జనవరి-మార్చిలో 20 త్రైమాసికాల కనిష్ఠ స్థాయి అయిన 5.8 శాతానికి చేరడమే కాదు.. 2019-20 ఏప్రిల్-జూన్‌లో అది మరింత క్షీణించి 5.5 శాతానికి చేరింది. అంతర్జాతీయ వృద్ధి కూడా మందగమనం పాలు కావడంతో పాటు.. దేశీయంగా గిరాకీ తగ్గడం వల్ల ప్రస్తుతం ఈ దశ నడుస్తోంది. ఉద్దీపనలతో వృద్ధి మరింత డీలా పడకుండా ఉండడానికి అవకాశం ఉంద'ని యెస్ బ్యాంక్ ముఖ్య ఆర్థికవేత్త శుభదా రావు పేర్కొన్నారు.

### వెంటనే పుంజుకోకపోవచ్చు: డీ&బీ ఎకనమీ

ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న నిర్మాణాత్మక సమస్యలకు వేగవంతమైన పరిష్కారం ఏదీ లేకపోవడంతో భారత ఆర్థిక వృద్ధి వేగం మందగమనం పాలు కావొచ్చని డీ అండ్ బీ ఎకనమీ అబ్జర్వర్ పేర్కొంది. తయారీ రంగం పలు సవాళ్లను ఎదుర్కుంటుండడంతో పారిశ్రామికాభివృద్ధి సూచీ మెరుగుపడడానికి చాలా సమయం పట్టే అవకాశం ఉందని తెలిపింది. అయితే ఆయా రంగాల స్థాయిలో వివిధ సమస్యలకు విస్తృత స్థాయి సంస్కరణల ప్యాకేజీ సమాధానం చెప్పగలదని డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ ఇండియా చీఫ్ ఎకనమిస్ట్ అరుణ్ సింగ్ అభిప్రాయపడ్డారు.

## మాకు సాయం అక్కర్లేదు

సరిపడా మూలధనం ఉంది: ఎస్‌బీఐ

**దిల్లీ:** ప్రస్తుతం తగినంత స్థాయిలో మూలధనం కలిగి ఉన్నందున, ఈ ఆర్థిక సంవత్సరంలో కొత్తగా తమకు నిధులక్కర్లేదని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వెల్లడించింది. బ్యాంకింగ్ వ్యవస్థలో నిధుల లభ్యత పెంచేందుకు ప్రభుత్వ రంగ బ్యాంకులకు సత్వరం రూ.70,000 కోట్లు మూలధన సాయంగా అందించనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. మూలధన సాయాన్ని దశలవారీగా అందించాలని ప్రభుత్వం గతంలో అనుకున్నప్పటికీ, ఆర్థిక వ్యవస్థ మందగమనం నేపథ్యంలో అనుకున్నదాని కంటే ముందుగానే నిధులు విడుదల చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. 'మూలధన సాయం కోసం ఎస్‌బీఐ ఎదురు చూడట్లేదు. ఎందుకంటే మార్కెట్ నుంచి తగినన్ని నిధులు సమీకరించే సమర్థతను బ్యాంక్ కలిగి ఉంది. టైర్ 1, టైర్ 2 బాండ్ల జారీ ద్వారా నిధుల



అర్జిత్ బసు

సమీకరణ ప్రణాళికను ఇప్పటికే ప్రకటించింద'ని ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన ఓ సమావేశంలో ఎస్‌బీఐ మేనేజింగ్ డైరెక్టర్ అర్జిత్ బసు వెల్లడించారు. మార్కెట్ నుంచి సత్వరం నిధులు సమీకరించలేని స్థితిలో ఉన్న బ్యాంకులకే ఈ మూలధన సాయం అవసరం అవుతుందని తెలిపారు. నిధుల సమీకరణ నిమిత్తం ప్రధానేతర ఆస్తుల్లో పెట్టుబడులను ఉపసంహరించుకునే యోచనలోనూ ఎస్‌బీఐ ఉందని పేర్కొన్నారు. నాలుగో త్రైమాసికంలో ఎస్‌బీఐ కార్డ్స్‌ను పబ్లిక్ ఇష్యూకు తీసుకెళ్లనున్నట్లు ఈ నెల ప్రారంభంలో ఎస్‌బీఐ ఛైర్మన్ రజనీశ్ కుమార్ వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే సాధారణ బీమా విభాగంలో వాటా విక్రయ ప్రక్రియ మాత్రం ఆలస్యంగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో జరగొచ్చని ఆయన చెప్పారు.

## రాష్ట్రాలు పన్ను రేట్లు తగ్గిస్తేనే ప్రయోజనం

మారుతీ సుజుకీ ఛైర్మన్ ఆర్.సి.భార్గవ



**దిల్లీ:** వాహన తయారీ రంగాన్ని ప్రోత్సహించడంలో రాష్ట్రాలు తగిన పాత్ర నిర్వర్తించకపోతే, దేశ ఆర్థిక వ్యవస్థను 5 లక్షల కోట్ల డాలర్లకు చేర్చాలన్న మోదీ ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతుందని మారుతీ సుజుకీ ఇండియా ఛైర్మన్ ఆర్.సి.భార్గవ పేర్కొన్నారు. కంపెనీ వార్షిక సాధారణ సమావేశంలో వాటాదార్లను ఉద్దేశించి మాట్లాడుతూ.. దేశ తయారీ రంగ జీడీపీలో వాహన రంగ వాటా 49 శాతం వరకు ఉంటుందన్నారు. 'వాహన పరిశ్రమలతో రాష్ట్రాల్లో అనేక ఉద్యోగావకాశాలు వస్తాయి. ఒకవేళ అది మందగమనం పాలైతే, నిరుద్యోగిత పెరుగుతుంది. రాష్ట్రాలకు ఆదాయం తగ్గుతుంద'ని భార్గవ అన్నారు. 'పెట్రోలుపై పన్నునే తీసుకుంటే, కారు నిర్వహణ వ్యయంలో రాష్ట్రాలే నిర్ణయాత్మక శక్తిగా మారాయ'ని వివరించారు. రుణాల వడ్డీ వ్యయాలు దిగిరావడం సానుకూల అంశమని అన్నారు. వాహనాల రిజిస్ట్రేషన్ వ్యయాలు పెంపు ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకుందని గుర్తు చేశారు. 9 రాష్ట్రాలు రహదారి పన్నులు పెంచడం వల్ల వాహన వ్యయాలు దాదాపు రూ.97,000 వరకు పెరిగాయని ఒక ఉదాహరణగా చెప్పారు. ఈ ప్రభావం వినియోగదారుల కొనుగోలుశక్తిపై పడి, అమ్మకాలు ఆ రాష్ట్రాల్లో బాగా తగ్గాయని తెలిపారు.

**2020-21 కల్లా తిరిగి సాధారణ స్థితికి**

2020-21 కల్లా మారుతీ సుజుకీ ఇండియా తన సాధారణ వృద్ధి రేటును అందుకుంటుందని భార్గవ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్థిక వ్యవస్థ, వాహన పరిశ్రమల దుర్దశ ముగింపునకు చేరుకుందని, త్వరలోనే అమ్మకాలు పుంజుకుంటాయని భావిస్తున్నామని చెప్పారు.

## 14 రోజుల్లోగా సొమ్ము వాపసు

ఇ-కామర్స్ ముసాయిదా మార్గదర్శకాల విడుదల

- **సెప్టెంబరు 15లోపు సూచనలివ్వొచ్చు**
- **సంస్థలన్నీ భారతీయ చట్టాల ప్రకారం నమోదు కావాలి**

ఈనాడు – దిల్లీ

వినియోగదార్ల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఇ కామర్స్ ముసాయిదా నిబంధనలను ప్రభుత్వం విడుదల చేసింది. వీటిపై సంబంధీకులు సెప్టెంబరు 15 లోగా తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరింది. డిసెంబరు కల్లా వినియోగదారుల భద్రతా చట్టం నిబంధనావళి రూపకల్పనకు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంది. ఇవి అమల్లోకి వచ్చాక సంస్థలన్నీ తప్పనిసరిగా పాటించాల్సిందేనని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రి రాంవిలాస్ పాసవాన్ తెలిపారు. ముసాయిదా ప్రకారం..

- ✦ దేశంలో ఇ-కామర్స్ కార్యకలాపాలు నిర్వహించాలని అనుకునే ప్రతి సంస్థ నోటిఫికేషన్ విడుదలైన 90 రోజుల్లోపు భారతీయ చట్టాలకు లోబడి పేర్లు నమోదు చేసుకోవాలి.
- ✦ ప్రమోటర్లు గత అయిదేళ్లలో క్రిమినల్ కేసుల్లో శిక్షకు గురై ఉండకూడదు.
- ✦ వస్తు, సేవలకు చెల్లింపులన్నీ రిజర్వ్‌బ్యాంక్ ఇండియా మార్గదర్శకాలకు లోబడే ఉండాలి.
- ✦ వస్తువులు వాపసు ఇచ్చినపుడు, గరిష్ఠంగా 14 రోజుల్లోపు తిరిగి చెల్లింపులు చేయాలి.
- ✦ విక్రేతల పూర్తి వివరాలు, వ్యాపార గుర్తింపు, న్యాయపరమైన పేరు, ప్రధాన కార్యాలయం చిరునామా, వెబ్‌సైట్ పేరు, ఇ-మెయిల్ అడ్రస్, సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు, వారు అమ్మే వస్తువుల వివరాలు, వారిని వినియోగదారులు ఏ మార్గంలో సంప్రదించాలన్న వివరాలన్నీ వెబ్‌సైట్‌లో పొందుపరచాలి.

### ఇ-కామర్స్ సంస్థ బాధ్యతలు

- ✦ ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ వస్తు, సేవల ధరలను ప్రభావితం చేయకూడదు. వినియోగదారుల నిర్ణయాలను ప్రభావితం చేసేలా తప్పుడు పద్ధతులు, మోసపూరిత విధానాలు అనుసరించరాదు.
- ✦ విక్రయదారులే వినియోగదారులుగా చెప్పుకుంటూ, వస్తు, సేవల గురించి రివ్యూల్లో గొప్పగా ప్రచారం చేయరాదు.
- ✦ వినియోగదారులు వస్తు, సేవలను వెనక్కు ఇవ్వడం (రిటర్న్), డబ్బు తిరిగి పొందడం (రిఫండ్), మార్చుకోవడం (ఎక్స్ఛేంజీ), వారెంటీ, గ్యారెంటీ, డెలివరీ, సరఫరా, డబ్బు చెల్లించాల్సిన విధానం (మోడ్ ఆఫ్ పేమెంట్), ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు సంబంధించిన అన్ని విధివిధానాలను స్పష్టంగా వెబ్‌సైట్‌లో ప్రదర్శించాలి.
- ✦ ఆయా వస్తు, సేవల వల్ల ఎదురయ్యే భద్రత, ఆరోగ్య పరమైన అంశాలను అందుబాటులో ఉంచాలి.
- ✦ చెల్లింపు విధానాలన్నింటినీ అందుబాటులో ఉంచాలి. ఆ చెల్లింపులకున్న భద్రతా ప్రమాణాలు, దానికి లోబడి చెల్లింపులను రద్దుచేసుకునే విధానాలు, చెల్లింపులు, రద్దులపై పడే రుసుముల వివరాలన్నీ స్పష్టంగా తెలియజెప్పాలి.
- ✦ వినియోగదారుల వ్యక్తిగత ఖాతా వివరాల గోప్యతను కాపాడాలి. వినియోగదారుల వివరాల సేకరణ, వినియోగం, నిల్వ ఐటీ సవరణ చట్టం 2008లోని నిబంధనలకు లోబడే ఉండాలి.
- ✦ వినియోగదారునికి చెప్పిన సమయంకన్నా వస్తువులను ఆలస్యంగా అందించినా, లోపభూయిష్టమైన, తప్పు, నకిలీ వస్తువులు పంపినా, ప్రకటనల్లో చూపిన విధంగా లేకపోయినా ఇ- కామర్స్ సంస్థలు వాటిని వెనక్కు తీసుకోవాల్సిందే.
- ✦ నకిలీ వస్తువులు అమ్ముతున్నట్లు వినియోగదారులు ఫిర్యాదుచేసినా, ఇ-కామర్స్ నిర్వాహకులే గుర్తించినా వెంటనే ఆ విషయాన్ని విక్రేతకు చెప్పాలి. వస్తువు నిఖార్సైందేనని విక్రేత సాక్ష్యాలు సమర్పించలేకపోతే వెంటనే సదరు వస్తువును ఇ-కామర్స్ వేదిక నుంచి తొలగించాలి. ఆ విషయాన్ని వినియోగదారులకూ స్పష్టంగా చెప్పాలి.



రాంవిలాస్ పాసవాన్

### విక్రయదారులు ఇవి పాటించాలి

- ✦ వస్తు విక్రయదారులు ఇ-కామర్స్ సంస్థతో ముందస్తుగా లిఖితపూర్వక ఒప్పందం చేసుకోవాలి.
- ✦ వస్తువు పూర్తి ధర, డెలివరీ, పోస్టేజీ ఛార్జీలు, పన్నులను విడివిడిగా చూపాలి.
- ✦ లీగల్ మెట్రాలజీ సవరణ నిబంధనలు-2017కు అనుగుణంగా ప్యాకేజీకి ముందు వస్తువు రూపురేఖలను సంపూర్ణంగా చూపాలి.
- ✦ వస్తువుకు వారెంటీ, గ్యారెంటీ నిబంధన అమలులో హేతుబద్ధంగా వ్యవహరించాలి.
- ✦ వస్తు మార్పిడి, వెనక్కు ఇవ్వడం, డబ్బు తిరిగి చెల్లింపునకు సంబంధించిన విషయాల్లో పూర్తి పారదర్శకంగా ఉండాలి. వెనక్కి పంపినపుడు, ఆ భారాన్ని ఎవరు భరించాల్సి ఉంటుందో స్పష్టంగా చెప్పాలి.

### ఫిర్యాదుల పరిష్కార వేదిక

- ✦ ఫిర్యాదుల కోసం సంప్రదించాల్సిన అధికారి పేరు, అతని ఫోన్, ఇ మెయిల్ వివరాలు వెబ్‌సైట్‌లో ఉండాలి. ఫిర్యాదులను నెలరోజుల్లోపు పరిష్కరించాలి.
- ✦ ఫోన్, ఇమెయిల్, వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదులు చేసే వెసులుబాటు కల్పించాలి. ప్రతి ఫిర్యాదుకూ ఒక నెంబర్ ఇచ్చి, పరిష్కారం ఏ స్థితిలో ఉన్నదీ తెలుసుకునే వెసులుబాటు కల్పించాలి.
- ✦ ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను నేషనల్ కన్జ్యూమర్ హెల్ప్‌లైన్‌తో అనుసంధానం చేసే వ్యవస్థను నెలకొల్పాలి.

## రఫేల్‌తో ఆస్ట్రా మైక్రోవేవ్ జట్టు

ఏఆర్‌సీని ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**ఈనాడు, హైదరాబాద్:** భారత సైన్యానికి అవసరమైన సాఫ్ట్‌వేర్ ఆధారిత రేడియో కమ్యూనికేషన్ వ్యవస్థలను తయారు చేసేందుకు ఇజ్రాయెల్‌కు చెందిన రఫేల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టం, స్థానిక డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ సంస్థ ఆస్ట్రా మైక్రోవేవ్ ప్రొడక్ట్స్‌తో చేతులు కలిపింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఆస్ట్రా రఫేల్ కమ్యూనికేషన్ సిస్టమ్ (ఏఆర్‌సీ)ని ఏర్పాటు చేసింది. హైదరాబాద్ సమీపంలోని రావిర్యాలలో ఉన్న హార్డ్‌వేర్ పార్క్‌లో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌ను మంగళవారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి జి.కిషన్ రెడ్డి ప్రారంభించారు. విదేశీ పెట్టుబడుల నిబంధనలకు అనుగుణంగా 51:49 నిష్పత్తిలో ఈ సంస్థ ఏర్పాటైంది. కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఇజ్రాయెల్, భారత్‌ల మధ్య దీర్ఘకాలంగా అనేక రక్షణ ఒప్పందాలున్నాయని తెలిపారు. రానున్న 10 ఏళ్లపాటు ఏడాదికి 90 లక్షల ఉద్యోగాలు, ఆ తర్వాత పదేళ్ల పాటు సంవత్సరానికి 40లక్షల ఉద్యోగాలను సృష్టించాల్సిన అవసరం దేశంలో ఉందని తెలిపారు. తయారీ రంగ పరిశ్రమలు భారీగా ఏర్పాటైతేనే ఇది సాధ్యపడుతుందని పేర్కొన్నారు. డిఫెన్స్, ఫార్మా, రైల్వేలలో 100 శాతం ఎఫ్‌డీఐలను అనుమతించేందుకు ఇదే కారణమని చెప్పారు. ఆస్ట్రా మైక్రోవేవ్ ప్రొడక్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.గురునాథ రెడ్డి మాట్లాడుతూ.. ఈ కేంద్రంపై రూ.35 కోట్ల పెట్టుబడి పెట్టినట్లు పేర్కొన్నారు. రూ.210 కోట్లకు పైగా ఆర్డర్లున్నాయని, 24 నెలల్లో పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. ప్రస్తుతం 15 మందితో ఈ యూనిట్ ప్రారంభం అవుతోందని, త్వరలోనే 75-100 మందికి పైగా తీసుకుంటామని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎగుమతులు చేసే అవకాశం ఉందని వెల్లడించారు. రఫేల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్స్ ప్రెసిడెంట్, సీఈఓ యోవ్ హర్-ఈవెన్ మాట్లాడుతూ.. గత 20 ఏళ్లుగా భారత రక్షణ దళాలకు పరికరాలను అందిస్తున్నామని, భవిష్యత్తులో కొనసాగిస్తామని తెలిపారు. భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి రాన్ మల్కా, తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, మహేశ్వరం బీజేపీ నాయకులు అందెల శ్రీరామ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



**ఆస్ట్రా రఫేల్ కమ్యూనికేషన్ సిస్టమ్స్ యూనిట్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆవరణలో మొక్కలు నాటిన మంత్రి కిషన్ రెడ్డి. చిత్రంలో గురునాథ రెడ్డి, జయేశ్ రంజన్, రాన్ మల్కా, యోవ్ హర్-ఈవెన్**

## పదేళ్లలో 40,000 ఉద్యోగాలు: వివో

**దిల్లీ:** దేశీయ తయారీప్లాంటు కోసం మొత్తం రూ.7500 కోట్ల పెట్టుబడి పెడతామని, రాబోయే 10 ఏళ్లలో 40,000 ఉద్యోగాలు సృష్టించాలన్నది తమ లక్ష్యమని చైనా స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ వివో ప్రకటించింది. భారత్‌లో ప్లాంటు నెలకొల్పేందుకు రూ.4,000 కోట్ల ప్రణాళికను వివో గతంలోనే ప్రకటించగా, ఇప్పుడు మరో రూ.3,500 కోట్లు అదనంగా పెడతామని తెలిపింది. గ్రేటర్ నోయిడాలోని ప్లాంటుపై తొలుత సంస్థ రూ.400 కోట్ల పెట్టుబడి పెట్టింది. ప్లాంటు విస్తరణను దశలవారీగా చేపడతామని, మొత్తం రూ.7,500 కోట్లు పెట్టుబడి పెడతామని వివో ఇండియా డైరెక్టర్ (బ్రాండ్ స్ట్రాటజీ) నిపున్ మార్యా వెల్లడించారు. ప్రస్తుతం ఏడాదికి 2.50 కోట్ల స్మార్ట్‌ఫోన్లు తయారు చేస్తుండగా, వచ్చే నెలలో ఆరంభమయ్యే తొలిదశ విస్తరణ తరవాత ఈ సామర్థ్యం 3.34 కోట్లకు పెరుగుతుందని, అదనంగా 2700 ఉద్యోగాలు లభిస్తాయని వెల్లడించారు. దశలవారీ విస్తరణ, ఇతర అవసరాల కోసం నిపుణులైన 40,000 మంది రాబోయే 10 ఏళ్లలో అవకాశాలు కల్పించాలన్నది ప్రణాళికగా నిపున్ వివరించారు.

# దోమకాటుకు చెల్లు!



**రక్తం జాడనూ పసిగట్టలేవు • గ్రాఫీన్ ఫలకాలతో రక్షణ**

వాషింగ్టన్: దోమకాటు నుంచి మానవాళికి విముక్తి కల్పించే దిశగా శాస్త్రవేత్తలు సరికొత్త ముందడుగు వేశారు! రక్తం వాసనను దోమలు పసిగట్టకుండా నిలువరించే సరికొత్త రక్షణ విధానాన్ని కనుగొన్నారు. గ్రాఫీన్ ఆక్సైడ్(జీవో) ఫలకాలతో తయారుచేసిన ఈ సన్నని రక్షణ ఛత్రాన్ని ధరిస్తే.. దోమలు మనిషిపై వాలినప్పటికీ కుట్టలేవు. రసాయనాలను వినియోగించకుండానే దోమకాటును నివారించగలగడం ఇందులోని విశిష్టత. సాధారణంగా దోమలు రక్తం జాడను గుర్తించేందుకుగాను రసాయనిక సంకేతాలను ఉపయోగించుకుంటాయి. ఈ సంకేతాలను తాము అభివృద్ధి చేసిన గ్రాఫీన్ రక్షణ ఛత్రం అడ్డుకోవడంతో దోమలు రక్తం జాడ తెలుసుకోలేవని అమెరికాలోని బ్రౌన్స్ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆచార్యులు రాబర్ట్ హర్ట్ తెలిపారు.

గ్రాఫీన్ ఫలకాల పనితీరును తెలుసుకునేందుకుగాను శాస్త్రవేత్తలు కొంతమందిని ఎంచుకున్నారు. వారిలో కొందరి చేతులకు జీవో రక్షణ ఏర్పాటుచేశారు. మరికొందరి చేతులకు జున్ను పూసిన వస్త్రాలను కట్టారు. మిగతావారి చేతులను ఖాళీగా ఉంచారు. ప్రయోగశాలలో పెంచిన, వ్యాధికారకం కాని దోమలను అందరి చేతులపైకి వదిలారు. జున్ను పూసిన వస్త్రాలతో కూడిన చేతులు, ఖాళీ చేతులను దోమలు కుట్టాయి. జీవోతో కప్పిన చేతులపై వాలలేదు. రక్తాన్ని గుర్తించే రసాయనిక సంకేతాలను జీవో అడ్డుకోవడం వల్లే ఇది సాధ్యమైందని శాస్త్రవేత్తలు తెలిపారు. జీవోతో కూడిన చేతులపై మానవ స్వేదాన్ని చల్లగా దోమలు అక్కడికి వచ్చి వాలాయని, ఆ రక్షణ ఛత్రాన్ని ఛేదించి కుట్టడంలో మాత్రం విఫలమయ్యాయని వివరించారు.

# ఐఎస్ఎస్ చేరిన హ్యూమనాయిడ్ రోబో

మాస్కో: రోదసిలోకి రష్యా పంపిన తొలి హ్యూమనాయిడ్ రోబో ఎట్టకేలకు మంగళవారం విజయవంతంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లోకి ప్రవేశించింది. "జాప్యానికి మన్నించండి. ట్రాఫిక్‌లో చిక్కుకుపోయాను. ఇప్పుడు పనిలోకి దిగడానికి నేను సిద్ధం" అంటూ ఈ రోబో తన ట్విటర్ ఖాతాలో సరదాగా వ్యాఖ్యానించింది. 'ఫెడోర్' అనే ఈ రోబో.. మనిషి పరిమాణంలో ఉంటుంది. ఐఎస్ఎస్‌లో సంక్లిష్టమైన పనుల నిర్వహణలో మానవులకు తోడ్పాటు అందిస్తుంది. వచ్చే నెల 7 వరకూ అక్కడే ఉంటుంది. ఈ రోబో గురువారం సోయజ్ వ్యోమనౌకలో భూమి నుంచి బయలుదేరిన సంగతి తెలిసిందే. శనివారమే ఈ వ్యోమనౌక ఐఎస్ఎస్‌తో సంధానం కావాల్సింది. అయితే సాంకేతిక



ఇబ్బంది వల్ల ఆగిపోయింది. మంగళవారం జరిగిన రెండో ప్రయత్నంలో అది విజయవంతంగా అంతరిక్ష కేంద్రంతో సంధానమైంది.

# దిల్లీలో తాగునీటి బకాయిల రద్దు

**వెల్లడించిన సీఎం కేజ్రీవాల్**

దిల్లీ: రాజధానిలో నివాస గృహాల తాగునీటి బకాయిలను రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి కేజ్రీవాల్ మంగళవారం ప్రకటించారు. దిగువ మధ్యతరగతి, పేదలుండే ఇ, ఎఫ్, జీ, హెచ్ కాలనీల్లో సరైన తాగునీటి మీటర్లున్న ఇళ్లకు ఇది వర్తిస్తుందని తెలిపారు. తద్వారా 10.5 లక్షల మంది లాభపడనున్నట్లు ఆయన చెప్పారు.

## బెర్తులు నిండని రైళ్లలో 25% వరకు రాయితీ

దిల్లీ: విమానయాన రంగం నుంచి ఎదురవుతున్న గట్టి పోటీని ఎదుర్కొనేందుకు కొన్ని రైళ్ల టికెట్ మూలధరలో 25 శాతం వరకు రాయితీ ఇచ్చేందుకు రైల్వేశాఖ సమాయత్తమవుతోంది. మునుపటి ఏడాదిలో 50% కంటే తక్కువ బెర్తులే నిండిన రైళ్లకు ఇది వర్తిస్తుంది. శతాబ్ది, తేజస్, గతిమాన్ ఎక్స్‌ప్రెస్ సహా గుర్తించిన రైళ్లలో దీనిని ఏయే స్టేషన్ల మధ్య ఎంత కాలం పాటు అమలుచేయాలో నిర్ణయించుకునే అధికారాన్ని జోనల్ రైల్వేలకు ఇవ్వాలని మంత్రిత్వశాఖ నిర్ణయించింది.

## నన్ను అవమానించడమే ఈడీ లక్ష్యం: చిదంబరం

దిల్లీ: కేవలం తనను అవమానించాలన్నదే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఉద్దేశమని, అందుకే తనను అరెస్టు చేయాలనుకుంటోందని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం మంగళవారం సుప్రీంకోర్టుకు విన్నవించారు. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో ఇప్పటికే సీబీఐ కస్టడీలో ఉన్న ఆయన... ఈడీ కేసులో అరెస్టు నుంచి మినహాయింపు పొందేందుకు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ఆర్.భానుమతి, ఎ.ఎస్.బోపన్నల ధర్మాసనం మంగళవారమూ విచారణను కొనసాగించింది. బుధవారం వరకూ చిదంబరానికి అరెస్టు నుంచి మినహాయింపునిచ్చింది.

## కేంద్ర మాజీ మంత్రి చిన్మయానంద్‌పై కేసు

షాజహాన్‌పుర్: లైంగిక ఆరోపణలు చేసిన యువతి అదృశ్యమైన నేపథ్యంలో... ముముక్షు ఆశ్రమ అధిపతి, భాజపా సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి స్వామి చిన్మయానంద్‌పై పోలీసులు మంగళవారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆశ్రమం ఆధ్వర్యంలోని ఓ కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన సదరు యువతి... చిన్మయానంద్ తనను లైంగికంగా వేధించారంటూ ఇటీవల వీడియో క్లిప్పింగ్‌ను విడుదల చేసింది. ఈ క్రమంలోనే ఆమె అదృశ్యమైపోయింది. దీంతో ఆమె తండ్రి మంగళవారం పోలీసులను ఆశ్రయించారు. 72 ఏళ్ల భాజపా నేత, మరికొందరు తన కుమార్తెతో పాటు పలువురు యువతులను లైంగికంగా వేధించినట్లు ఫిర్యాదు చేశారు.

## అమిత్ షా విమానం నడిపేందుకు అబద్ధాలు

**బీఎస్ఎఫ్ మాజీ పైలట్‌పై విచారణ**

దిల్లీ: నకిలీ ఈ-మెయిళ్లతో మోసగించి, కేంద్ర హోం మంత్రి అమిత్ షా విమానాన్ని నడపడానికి ప్రయత్నించిన బీఎస్ఎఫ్ మాజీ పైలట్ వింగ్ కమాండర్ జె.ఎస్. సంగ్వాన్‌పై దర్యాప్తు మొదలైంది. కార్గిల్ యుద్ధంలో కూడా పాల్గొన్న సంగ్వాన్ అనేక పురస్కారాలను అందుకున్నారు. గతంలో ఆయన బీఎస్ఎఫ్‌లో పనిచేశారు. అమిత్ షా విమానాన్ని నడిపేందుకు సంగ్వాన్ పేరును సిఫార్సు చేస్తూ రెండు నెలల కిందట బీఎస్ఎఫ్‌లోని వైమానిక విభాగం నుంచి ఎల్ అండ్ యాంప్; టీ సంస్థకు ఈ-మెయిళ్లు వచ్చాయి. ఆయనకు 4వేల గంటల పాటు విమానాన్ని నడిపిన అనుభవం ఉందని వాటిల్లో ఉంది. హోం మంత్రి విమానాన్ని నడపడానికి అనుభవం కనీసం వెయ్యి గంటలు ఉండాలి. అయితే వీఐపీల విమానాలను నడపడానికి కావాల్సిన అర్హతలు ఆయనకు లేవని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. తన సీనియర్ సహచరుడి ఈమెయిల్‌ను అనుకరిస్తూ ఆయన ఈ మోసానికి పాల్పడినట్లు వెల్లడైంది.

## నేడు ఈపీఎఫ్ ఉద్యోగుల దేశవ్యాప్త సమ్మె

హైదరాబాద్: భవిష్యనిధి ఉద్యోగులు బుధవారం దేశ వ్యాప్తంగా ఒక్క రోజు సమ్మె చేయనున్నారు. పదోన్నతులు, నియామకాలు, గ్రూప్ బి, సి, డి క్యాడర్ పోస్టుల భర్తీ, సిబ్బంది పునర్వ్యవస్థీకరణ నివేదిక అమలు ద్వారా కలిగే ప్రయోజనాలను తక్షణమే అందించటం వంటి డిమాండ్ల సాధన కోసం సమ్మెకు పిలుపునిచ్చినట్లు ఈపీఎఫ్ స్టాఫ్ యూనియన్, ఆలిండియా ఈపీఎఫ్ స్టాఫ్ ఫెడరేషన్ సంఘాల నేతలు తెలిపారు.

# దొంగతనం ఆశ 'చావ్లా'!

**అమెరికాలో భారత సంతతి వ్యాపారవేత్త దినేశ్ అరెస్టు**

వాషింగ్టన్: అమెరికాలో భారత సంతతి వ్యాపారవేత్త దినేశ్ చావ్లా(56)ను విమానాశ్రయంలో లగేజీ అపహరణ అభియోగాలతో పోలీసులు అరెస్టు చేశారు. అధ్యక్షుడు ట్రంప్ కుటుంబానికి చెందిన నాలుగు హోటళ్లలో ఆయన మాజీ భాగస్వామి. టెన్నెసి రాష్ట్రంలోని మెంఫిస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో బ్యాగేజి ప్రాంతం నుంచి చావ్లా హోటల్స్ సీఈవో దినేశ్ చావ్లా ఈ నెల 18న వేరే ప్రయాణికుడి సూట్‌కేస్ దొంగతనం చేసినట్లు పోలీసులు తెలిపారు. బ్యాగులు దొంగతనం చేయడం తప్పని తనకు తెలుసునని, కేవలం సరదా కోసమే ఆ పనిచేశానని చావ్లా చెప్పినట్లు వివరించారు.

## పత్రికా స్వేచ్ఛ వన్ వే ట్రాఫిక్ కాదు: సుప్రీంకోర్టు

దిల్లీ: మనదేశంలో పాత్రికేయం సాగుతున్న తీరుపై సుప్రీంకోర్టు ఆవేదన వ్యక్తం చేసింది. పత్రికా స్వేచ్ఛ ఏకపక్షం(వన్ వే ట్రాఫిక్) కాకూడదని పేర్కొంది. తప్పుడు-కల్పిత కథనాలకు పాత్రికేయంలో స్థానం లేదని వ్యాఖ్యానించింది. 'ది వైర్' వార్తా పోర్టల్‌తోపాటు ఆ సంస్థకు చెందిన కొందరు పాత్రికేయులపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తనయుడు జయ్ షా దాఖలు చేసిన పరువు నష్టం కేసులపై విచారణ సందర్భంగా జస్టిస్ అరుణ్ మిశ్ర, జస్టిస్ ఎం.ఆర్.షా, జస్టిస్ గవయిలతో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ వ్యాఖ్యలు చేసింది. వివరణ కోరుతూ వ్యక్తులకు తాఖీదులు పంపిన తర్వాత వార్తలను ప్రచురించేందుకు కొన్ని వార్తా సంస్థలు కనీసం 5-6 గంటలకు కూడా వేచి ఉండకపోతుండటాన్ని న్యాయస్థానం తీవ్రంగా విమర్శించింది. ఇదేం పాత్రికేయమంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. పరువు నష్టం కేసుల్లో విచారణ ఎదుర్కోవాలంటూ గుజరాత్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా దాఖలు చేసిన అప్పీళ్లను ఉపసంహరించుకునేందుకు 'ది వైర్', పాత్రికేయులను న్యాయస్థానం అనుమతించింది.

# జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక ప్యాకేజీ!

- మెరుగులు దిద్దుతున్న మోదీ సర్కారు
- కేంద్ర చట్టాలు, పథకాల అమలు కోసమే

దిల్లీ: జమ్మూ-కశ్మీర్‌లో అభివృద్ధిని శరవేగంగా పట్టాలెక్కించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా 106కుపైగా కేంద్ర చట్టాల అమలుకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు, వివిధ పథకాల అమలుకు వందల కోట్ల రూపాయల ప్యాకేజీని త్వరలోనే ప్రకటించనుంది. ఈ దిశగా కేంద్రం కసరత్తు చేస్తోంది.

జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేసిన కేంద్రం ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడగొట్టిన సంగతి తెలిసిందే. వచ్చే నెల 31 నుంచి ఆ రాష్ట్రం కేంద్ర పాలిత ప్రాంతాలుగా మారనుంది. ఈ సంధికాలంలో అటు కేంద్ర, ఇటు రాష్ట్ర చట్టాలు అమల్లో ఉంటాయి. అక్టోబర్ 31 నుంచి పూర్తిగా కేంద్ర చట్టాల్లోకి మారేందుకు వీలుగా వందల కోట్ల రూపాయలతో కూడిన ఒక ప్యాకేజీ రూపకల్పనలో కేంద్రం నిమగ్నమైందని సంబంధిత వర్గాలు తెలిపాయి. గతవారం కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ కార్మిక,



విద్యుత్, పునరుత్పాదక ఇంధనం, మానవ వనరుల అభివృద్ధి తదితర శాఖలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్మూ-కశ్మీర్‌లోని ప్రాజెక్టులపై మదింపు జరిపారు. అక్కడ కేంద్ర చట్టాలను సమర్థంగా అమలు చేయడానికి అవసరమైన నిధులపై విశ్లేషణ జరిపారు. వివిధ మంత్రిత్వశాఖలు అందించిన ప్రతిపాదనల ఆధారంగా నిర్దిష్టంగా ఎంత మొత్తం అవసరమన్నది ఇంకా గణించాల్సి ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

**కొన్ని ప్రతిపాదనలివీ..**

- జమ్మూ-కశ్మీర్‌లోని ఈఎస్ఐ చందాదారులకు ఆరోగ్య సేవలు అందించడానికి అక్కడ కొత్తగా ఒక ఆసుపత్రిని నిర్మించాలని కార్మిక శాఖ ప్రతిపాదించింది.
- విద్యా హక్కు చట్టం అమలు చేయడానికి కేంద్రం కోట్ల రూపాయలు అందించనుంది.
- రాష్ట్రంలోని ప్రజలకు వివిధ రకాల ప్రయోజనాలు, రాయితీలను అందించడానికి వీలుగా ఆధార్ చట్టం-2016ను కేంద్రం అమలు చేయనుంది.

**ఉన్నతాధికారుల సమీక్ష**

మరోవైపు జమ్మూ-కశ్మీర్ పునర్విభజన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకున్న మార్గాలపై చర్చించేందుకు కేంద్ర హోంశాఖ కార్యదర్శి ఎ.కె.భల్లా అధ్యక్షతన పలు శాఖలకు చెందిన ఉన్నతాధికారులు మంగళవారం ఇక్కడ సమావేశమయ్యారు. కేంద్ర పాలిత ప్రాంతాలుగా మారుతున్న జమ్మూ-కశ్మీర్, లద్దాఖ్‌లో పర్యాటక రంగానికి ఊతమిచ్చేందుకు కేంద్రం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. వీటిని ఖరారు చేయడానికి కేంద్ర పర్యాటక శాఖ సహాయ మంత్రి ప్రహ్లాద్ పటేల్, అధికారులు వచ్చే నెలలో ఈ రాష్ట్రంలో పర్యటించనున్నారు. పర్యాటకులకు మార్గనిర్దేశం చేసే గైడ్‌లకు శిక్షణ ఇస్తామని, వివిధ భాషలను వారికి పరిచయం చేస్తామని మంత్రి తెలిపారు.

## దొంగిలించిన బ్యాండ్‌ఎయిడ్‌తో చికిత్స చేస్తారా?

**ఆర్‌బీఐ నిధుల బదిలీపై రాహుల్‌గాంధీ విమర్శ**



దిల్లీ: కేంద్ర ప్రభుత్వానికి భారీ స్థాయిలో నిధులు బదిలీ చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) ఆమోద ముద్ర వేసిన నేపథ్యంలో మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ధ్వజమెత్తారు. ఆర్థిక వ్యవస్థను దివాలా దిశగా నెట్టివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. "ప్రధాని, ఆర్థికమంత్రి స్వయంగా సృష్టించుకున్న ఆర్థిక విపత్తు నుంచి ఎలా బయట పడాలో వారికి తెలియట్లేదు. ఆర్‌బీఐ నుంచి నిధులు దోచుకున్నంత (నిధుల బదిలీని ఉద్దేశిస్తూ) మాత్రాన అది పనిచేయదు" అని పేర్కొన్నారు. తుపాకీ గాయానికి ఔషధాల దుకాణం నుంచి బ్యాండ్‌ఎయిడ్‌ను దోచుకుని అతికించుకున్నట్లుగా నిధుల బదిలీ నిర్ణయం ఉందని ట్విటర్ వేదికగా ఎద్దేవా చేశారు.

## ఒక్కసారి మీ ఆర్థిక మంత్రులతో మాట్లాడండి

**రాహుల్ గాంధీకి కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ సూచన**



పుణె: ఆర్‌బీఐ నిధులను దోచుకుంటున్నారన్న కాంగ్రెస్ పార్టీ విమర్శలపై కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం తీవ్రంగా స్పందించారు. ఇటువంటి ఆరోపణలు చేసేముందు కాంగ్రెస్ పార్టీలో ఆర్థిక మంత్రులుగా పనిచేసిన వారితోను, సీనియర్లతోను మాట్లాడాలని రాహుల్‌గాంధీకి సూచించారు. మంగళవారమిక్కడ ఆమె జీఎస్‌టీ సమావేశం మధ్యలో విలేకరులతో మాట్లాడారు. "దోపిడీ ఆరోపణలు చేయడం, ఒకరిని దొంగ అనడం కాంగ్రెస్ పార్టీకి అలవాటైపోయింది. ఎన్నికల్లో చావుదెబ్బ తగిలినప్పటికీ ఆ పార్టీ ఇంకా వాటినే పట్టుకుని వేలాడుతుండడం ఆశ్చర్యంగా ఉంది" అంటూ రాఫెల్ వివాదాన్ని నేరుగా ప్రస్తావించకుండా వ్యాఖ్యానించారు.



## జైట్లీ కుటుంబానికి మోదీ ఓదార్పు

అనారోగ్యం కారణంగా ఇటీవల మృతిచెందిన భాజపా సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి అరుణ్ జైట్లీ నివాసానికి ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం వెళ్లారు. జైట్లీకి ఘనంగా నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. 'విధి జైట్లీని మనకు దూరం చేసింది. దేశానికి ఆయన చేసిన మంచి పనులు శాశ్వతంగా నిలిచిపోతాయి' అని ప్రధాని అన్నారు. దాదాపు 25 నిమిషాలు అక్కడే గడిపారు. మరోవైపు, తన తండ్రి అస్థికలను రోహన్ జైట్లీ సోమవారం గంగానదిలో నిమజ్జనం చేశారు.

## మళ్లీ గగనతలాన్ని మూసివేయనున్న పాక్!

ఇస్లామాబాద్: భారత విమానాలను తన గగనతలంలోకి అనుమతించకుండా మరోసారి పూర్తిస్థాయిలో నిషేధం విధించేందుకు పాకిస్థాన్ సన్నద్ధమవుతోంది. ప్రధాన మంత్రి ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలో సమావేశమైన క్యాబినెట్‌లో ఈ మేరకు ప్రతిపాదన వచ్చినట్లు శాస్త్ర సాంకేతిక వ్యవహారాల మంత్రి ఫవాద్ చౌధరి పేర్కొన్నారు. జమ్మూ-కశ్మీర్‌లోని తాజా పరిస్థితులపై చైనా కేంద్ర సైనిక కమిషన్ ఉపాధ్యక్షుడు క్విలియాంగ్‌తో చర్చించినట్లు పాక్ సైన్యం తెలిపింది.

- కశ్మీర్ విషయంలో ఇమ్రాన్ పూర్తిగా విఫలమయ్యారని పాక్‌లో విపక్ష నేత బిలావల్ భుట్టో జర్దారీ దుయ్యబట్టారు. ఒకప్పుడు శ్రీనగర్‌ను భారత్ నుంచి దక్కించుకోవాలన్న విధానం పాక్‌లో ఉండేదని, ఇప్పుడు పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) రాజధాని ముజఫరాబాద్‌ను కాపాడుకోవడంపై దృష్టి పెట్టాల్సి వస్తోందని అన్నారు.

# కొరతగానే ఖరీఫ్ సాగు!

**దేశంలో సాగు విస్తీర్ణం** (లక్షల హెక్టార్లలో)

| | |
|---|---|
| 2018-19 | 997.67 |
| 2019-20 | 975.16 |

దేశవ్యాప్తంగా ఒక్కోచోట ఒక్కోలా కురుస్తున్న వర్షాల ప్రభావంతో ఈ ఏడాది ఇప్పటి వరకు ఖరీఫ్ కొంత కొరతతోనే 'సాగు'తోంది. కేంద్ర వ్యవసాయ శాఖ వెల్లడించిన గణాంకాల ప్రకారం మొత్తంగా ఖరీఫ్ పంటల సాగు విస్తీర్ణం గతేడాది కంటే ఈ ఏడాది (ఆగస్టు 23 నాటికి) కొంత తక్కువగానే ఉంది. 2018-19లో పరిస్థితితో పోలిస్తే కీలకమైన వరి సాగు తక్కువగా ఉంది. పత్తి పంట మెరుగ్గా ఉంది. పప్పుల సాగు కొంత తగ్గింది. మొత్తంగా ఖరీఫ్ సాగు విస్తీర్ణం 2018-19లో 997.67 లక్షల హెక్టార్లు కాగా ఈ ఏడాది 975.16 లక్షల హెక్టార్లలో సాగవుతోంది.






## కశ్మీర్‌లో ఐటీ దిగాలు!

శ్రీనగర్: జమ్మూ-కశ్మీర్‌లో అంతర్జాల వ్యవస్థపై నిషేధం ప్రభావం లోయలోని ఐటీ రంగంపై పడింది. శ్రీనగర్ శివార్లలోని రంగ్‌రేత్ ప్రాంతంలో పదుల సంఖ్యలో ఐటీ కంపెనీలున్నాయి. దాదాపు 5 వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. 22 రోజులుగా తమ కార్యకలాపాలు కొనసాగడం లేదని, జీతాలు చెల్లించలేని పరిస్థితి ఎదురవుతున్నట్లు కంపెనీ యజమానులు చెబుతున్నారు. తమ భవిష్యత్తుపై ఉద్యోగుల్లోనూ ఆందోళన కనిపిస్తోంది. ఈనెల 5 నుంచి తమకు, ఉద్యోగులకు సమాచార సంబంధాలు తెగిపోయినట్లు యజమానులు తెలిపారు.

✦ శ్రీనగర్‌లోని టూరిస్ట్ రిసెప్షన్ కేంద్రం వద్ద విమాన టిక్కెట్ల విక్రయ కేంద్రాన్ని జిల్లా అధికారులు ప్రారంభించడంతో ప్రజలు క్యూ కడుతున్నారు. జమ్మూ-కశ్మీర్ పర్యాటక విభాగం, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సహకారంతో 6 కౌంటర్లు తెరిచారు. మరిన్ని ఏర్పాటుకు కశ్మీర్ లోయలోని ప్రముఖ ట్రావెల్ ఏజెంట్లను సంప్రదిస్తున్నట్లు జమ్మూ-కశ్మీర్ పర్యాటక డైరెక్టర్ నిస్సార్ అహ్మద్ వనీ తెలిపారు.

ఈటీవీ భారత్
యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

## వెలుగు పూలు పూయిస్తున్నాడు!

కర్ణాటక: ఓ యువ ఇంజినీరు రైతుగా మారాడు. వినూత్నంగా 'వెలుగు' పూలసాగు చేపట్టి లాభాల పంట పండిస్తున్నాడు. కేంద్ర ప్రభుత్వోద్యోగం వచ్చే అవకాశం ఉన్నా, వెళ్లకుండా పొలాన్నే నమ్ముకున్నాడు. వ్యవసాయానికి సాంకేతికతను జోడిస్తూ సాటి యువకులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. చామరాజ్‌నగర్ వాసి సతీశ్ తన కున్న ఎకరా పొలంలో చైనా రకం చామంతులు సాగుచేస్తున్నాడు. భారత్‌లో కోల్‌కతాలో మాత్రమే ఇవి కనిపిస్తాయి. చూడచక్కని వర్ణాలతో.. వేడుక ఏదైనా.. అలంకరణకు ఈ పూలు చక్కగా నప్పుతాయి. 12 విభిన్న రంగుల్లో 8 రకాల చామంతులను సాగు చేస్తున్నాడు. ఒక్కో పువ్వు ధర 3-10 రూపాయల వరకు పలుకుతుంది. ఈ పంటకో విశేషం



ఉంది. 24 గంటలూ వెలుతురు అవసరం. దీంతో రాత్రుళ్లు విద్యుత్తు దీపాల వెలుగులందిస్తున్నాడు. బీటెక్ చేసి.. యూపీఎస్‌సీ పరీక్షల్లోనూ అర్హత సాధించిన సతీశ్ సాగును నమ్ముకోవడంతో ఆయన తండ్రి మురిసిపోతున్నారు. లైట్లు, కూలీలు లాంటి ఖర్చులన్నీ కలిపి ఏడాదికి దాదాపు 6 లక్షలవుతుంటే. .ఆదాయం సుమారు రూ. 15-18 లక్షల మధ్య ఉంటున్నట్లు సతీశ్ చెబుతున్నాడు.

## వివరాలు రికార్డు చేస్తున్న యాపిల్ 'సిరి'

- ఏజెంట్ల చేతికి చిక్కుతున్న శృంగార వ్యవహారాలు
- వెల్లడించిన 'ఐరిస్ ఎగ్జామినర్'

డబ్లిన్: జనం మాటలను అర్థం చేసుకుని, తదనుగుణంగా చర్యలు తీసుకునే యాపిల్ డిజిటల్ అసిస్టెంట్ 'సిరి'... వినియోగదారుల వ్యక్తిగత విషయాలను రహస్యంగా రికార్డు చేస్తున్నట్లు, వాటిని సంస్థ ఏజెంట్లు వర్గీకరిస్తున్నట్లు వెలుగుచూసింది. ఐరిస్ ఎగ్జామినర్ అనే సంస్థ ఈ విషయాన్ని గతవారం వెల్లడించింది. దీంతో సిరి రికార్డింగుల వర్గీకరణను యాపిల్ నిలిపేసింది. 'వ్యక్తులు ఇచ్చే ఆదేశాలతో పాటు వారి ఆరోగ్య, ఔషధాల వివరాలు, వ్యాపార రహస్యాలు, శృంగార వ్యవహారాలను కూడా సిరి రికార్డు చేస్తోంది. 'హే సిరి' అనే కమాండ్ ఇవ్వకపోయినా... కొన్ని సారూప్య శబ్దాలకు సిరి యాక్టివేట్ అవుతోంది. ఆ సమయంలో అక్కడి సంభాషణలను అది నమోదు చేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న యాపిల్ ఏజెంట్లు వీటిని తరచూ విని, విశ్లేషిస్తున్నారు' అని సదరు సంస్థ తన నివేదికలో పేర్కొంది. తమ వినియోగదారుల గోప్యతను పరిరక్షిస్తామని, సిరి రికార్డింగ్‌ల వర్గీకరణ కార్యకలాపాలను నిలిపివేశామని యాపిల్ వర్గాలు చెప్పినట్లు ఐరిస్ ఎగ్జామినర్ ఉటంకించింది.

## మాజీ సీఎం అజిత్‌జోగి గిరిజనుడు కాదు!

రాయ్‌పుర్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి అజిత్‌జోగి తాను షెడ్యూల్ తెగకు (ఎస్టీ) చెందిన వ్యక్తినంటూ చెబుతున్న విషయాన్ని ఉన్నతస్థాయి కుల ధ్రువీకరణ కమిటీ తోసిపుచ్చిందని ఓ అధికారి మంగళవారం తెలిపారు. 2018లో ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ఆదేశాల మేరకు గిరిజన, షెడ్యూల్ కులాల అభివృద్ధి విభాగం కార్యదర్శి డీడీ సింగ్ నేతృత్వంలో ఏర్పడిన కమిటీ ఈ మేరకు నివేదికను సిద్ధం చేసినట్లు వివరించారు. తన వాదనను బలపరిచే ఎలాంటి ఆధారాన్ని అజిత్ జోగి సమర్పించలేకపోయారని, అందువల్ల ఆయనను కన్వార్ కులస్థుడిగా పేర్కొంటున్న అన్ని ధ్రువీకరణపత్రాలను రద్దు చేస్తున్నట్లు నివేదికను ఉటంకిస్తూ ఆ అధికారి వివరించారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92,
Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00